https://epaper.dksaardyamlochaatimpu.com

E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

డీకే చాటింపు

సారథ్యంలో

తెలంగాణ దిన పత్రిక

హైదరాబాద్ సంపుటి : 18 సంచిక : 48 ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ గురువారం,నవంబర్,19, 2026 పేజీలు : 8 వెల : రూ.1/-



పొరసత్వం రాకముందే సోనియాకు ఓటు..

రిపోర్టు కోరిన ఢిల్లీ కోర్టు



న్యూఢిల్లీ,నవంబర్,18 :కాంగ్రెస్ నేత సోనియా గాంధీ కి భారతీయ పౌరసత్వం రాకముందే ఓటరు జాబితాలో ఆమె పేరు ఉన్నట్లు ఫిర్యాదు నమోదు అయ్యింది. ఆ కేసులో రిపోర్టు సమర్పించాని పోలీసులను ఢిల్లీ కోర్టు కోరింది. వికాశ్ త్రిపాఠి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మెజిస్ట్రేట్ కోర్టు ఆ ఆదేశాలు జారీ చేసింది. రౌజ్ అవెన్యూ కోర్టులోని జుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ వినోద్ జోషీ ఈ ఆదేశాలు ఇచ్చారు. సోనియా గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని వికాశ్ తన పిటీషన్‌లో కోరాడు. అయితే ఈ అంశంపై నవంబర్ 28వ తేదీన కోర్టు విచారణ చేపట్టనున్నది. 2025 సెప్టెంబర్ 11న వికాశ్ ఇచ్చిన ఫిర్యాదును అదనపు చీఫ్ జుడిషియల్ మెజిస్ట్రేట్ వైభవ్ చౌరాసియా డిస్మిస్ చేశారు. అయితే ఆ ఆదేశాలను సవాల్ చేస్తూ త్రిపాఠి సెషన్స్ కోర్టులో రివిజన్ పిటీషన్ దాఖలు చేశారు. న్యూఢిల్లీ నియోజవకర్గంలో 1980లోనే ఎన్నికల జాబితాలో సోనియా గాంధీ పేరు ఉన్నట్లు త్రిపాఠి ఆరోపించారు. కానీ భారతీయ పౌరసత్వం ఆమె కు ఏప్రిల్1983లో కల్పించినట్లు పేర్కొన్నారు.1980 ఎన్నికల జాబితాలో సోనియా గాంధీ పేరు ఉన్నా.. ఆ తర్వాత 1982లో ఆ పేరును డిలీట్ చేశారన్నారు . మళ్లీ 1983లో సోనియా పేరును ఓటర్ల లిస్టులో చేర్చినట్లు చెప్పారు.

గత ఆంధ్ర పాలకుల కంటే రేవంత్ రెడ్డి వల్లే

తెలంగాణకు ఎక్కువ నష్టం

కృష్ణా జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలు దెబ్బతింటున్నాయన్న కేటీఆర్
సాగర్ ప్రాజెక్టు నుంచి ఏపీ 90 టీఎంసీల నీటి మళ్లింపునకు యత్నిస్తోందని ఆరోపణ
జల్ జీవన్ మిషన్ పేరుతో నీటి వినియోగానికి కేంద్రం సహకరిస్తోందని విమర్శ



హైదరాబాద్,నవంబర్,18 :తెలంగాణ సాగు నీటి, తాగునీటి ప్రయోజనాలను దెబ్బతీసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ... నాగార్జున సాగర్ ప్రాజెక్టు నుంచి దాదాపు 90 టీఎంసీల కృష్ణా నది నీటిని మళ్లించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఈ ప్రక్రియకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరోక్ష సహకారం ఉంటోందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రధానమంత్రి మోదీ, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తీరు వల్ల తెలంగాణ ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలుగుతోందని ఆయన విమర్శించారు. జల్ జీవన్ మిషన్ పేరుతో ఏపీ చేపడుతున్న నీటి వినియోగానికి కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇస్తోందని మండిపడ్డారు. గతంలో ఆంధ్ర పాలకుల కంటే రేవంత్ రెడ్డి పాలనలోనే రాష్ట్రానికి ఎక్కువ నష్టం జరుగుతోందని అన్నారు. సాగర్ ప్రాజెక్టు వద్ద గత ఏడాది కాలంగా జరుగుతున్న పనులపై తెలంగాణ ప్రభుత్వానికి సమాచారం లేదా? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఏపీ నీటి మళ్లింపు యత్నాలను అడ్డుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకుందో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.కృష్ణానదీ యాజమాన్య బోర్డుకు (కేఆర్ఎంబీ) అధికారికంగా ఏమైనా ఫిర్యాదు చేశారా?అని నిలదీశారు. అలాగే రాష్ట్ర తాగు నీటి అవసరాల నిమిత్తం మిగిలిన 40 టీఎం సీల కేటాయింపులను కోరుతూ ప్రభుత్వం వెం టనే కేఆర్ఎంబీకి లేఖ రాయాలని అన్నారు.

ఏలూరు జిల్లాను వణికిస్తున్న పెద్దపులి..



ఏలూరు జిల్లాలో గత ఆరు నెలలుగా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న పెద్దపులి సంచారం కొనసాగుతూనే ఉంది. పలు మండలాలను చుట్టివచ్చిన ఈ పులి, తాజాగా లింగపాలెం మండలం సింగగూడెం శివారులోని మల్లేశ్వరం ప్రాంతానికి చేరుకుంది. ప్రస్తుతం అక్కడి మామిడితోటలో మకాం వేసినట్టు అధికారులు గుర్తించారు. దీంతో సమీప గ్రామాల ప్రజలు తీవ్ర భయాందో ళనలకు గురవుతున్నారు. సోమవారం రాత్రి ఈ పులి చాట్రాయి మండలంలోకి ప్రవేశిం చడంతో ఆ ప్రాంత ప్రజలు కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్నారు. ఎటు నుంచి ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనన్న ఆందోళనతో బిక్కుబిక్కుమంటున్నారు. పులి కదలికల సమా చారం అందుకున్న అటవీ, పోలీసు శాఖల అధికారులు వెంటనే అప్రమత్తమ య్యారు.

కశ్మీర్‌లో భద్రతా దళాల భారీ విజయం..
మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్ లతీఫ్ భట్ హతం

మసీదులో నక్కిన అతడు లొంగిపోవడానికి నిరాకరించి కాల్పులు జరపిన వైనం-లష్కర్‌లో చేరిన సరిగ్గా ఏడాదికి లతీఫ్ అంతం

శ్రీనగర్,నవంబర్,18 :జమ్మూకశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో భద్రతా దళాలు జరిపిన భారీ ఎన్‌కౌంటర్‌లో లష్కరే తొయిబా మోస్ట్ వాంటెడ్ 'కేటగిరీ –ఎ' ఉగ్రవాది లతీఫ్ భట్ (23) హతమయ్యాడు. స్థానిక మసీదులో నక్కి ఉన్న అతడిని ప్రాణాలతో పట్టుకునేందుకు వీడియో కాల్ ద్వారా లొంగిపోవాలని బలగాలు అవకాశం ఇచ్చినా నిరాకరించాడు. బలగాలపైకి కాల్పులు జరపడంతో భద్రతా సిబ్బంది ఎదురుకాల్పులు జరిపి అతడిని అక్కడికక్కడే మట్టుబెట్టారు. ఈ ఆపరేషన్‌లో మసీదుకు ఎలాంటి నష్టం వాటిల్ల కుండా బలగాలు అత్యంత సంయమనం పాటించాయి. కశ్మీర్ లోయలో మిగిలి ఉన్న ఏకైక క్రియా శీల స్థానిక ఉగ్రవాది అతడేనని భద్రతా వర్గాలు తెలిపాయి. సరిగ్గా లష్కరే తొయిబాలో చేరిన ఏడాదికే లతీఫ్ భట్ అంతం కావడం గమనార్హం. 2025 నవంబర్ 18న ఉగ్రవాదబాట పట్టిన అతడు.. సరిగ్గా ఏడాది తర్వాత బలగాల చేతిలో హతమయ్యాడు. దక్షిణ కశ్మీర్‌లో లష్కర్ స్థానిక కమాండర్‌గా ఉంటూ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' (టీఆర్ఎఫ్), కశ్మీర్ రివల్యూషనరీ ఆర్మీ (కేఆర్ఏ) సంస్థలతో సంబంధాలు కొనసాగించాడు. ఉగ్రవాదంలోకి రాకముందు అతడు వడ్రంగిగా పనిచేశాడు. భాన్‌లో 8వ తరగతి, అమ్ముజీలో 12వ తరగతి చదివి.. కుల్గాం ప్రభుత్వ కళాశాలలో డిగ్రీలో చేరి మధ్యలోనే మానేశాడు. దక్షిణ కశ్మీర్‌లో పలు దాడులకు ఇతడే ప్రధాన సూత్రధారి. జులై 22న అనంత్‌నాగ్‌లో ఓ పోలీస్ అధికారి హత్య, ఆగస్టు 1న కుల్గాంలో ఇద్దరు వలస కార్మికుల హత్యల్లో ఇతడి ప్రమేయం ఉంది. నవంబర్ 11న కుల్గాంలో సీఆర్‌పీఎఫ్ చెక్‌పోస్టుపై దాడి చేసి ముగ్గురు జవాన్లను గాయపరిచాడు. ఈ దాడికి ముందు రెక్కీ నిర్వహించిన దృశ్యాలు సీసీటీవీల్లో నమోదయ్యా యి. గత ఐదారు నెలలుగా ఇతడికి ఆశ్రయం, లాజిస్టిక్స్ సమకూర్చిన స్థానిక సహచరుడు ఉమర్ నిసార్



దార్‌ను నవంబర్ 16న జరిగిన ఎన్‌కౌంటర్‌లో సైన్యం హతమార్చింది. అప్పుడు లతీఫ్ తప్పించుకున్నాడు.చివరకు పక్కా సమాచా రంతో చేపట్టిన ఆపరేషన్‌లో అతడిని భద్రతా దళాలు అంతమొందించాయి. పాకిస్తాన్ లోని ఇతడి హ్యాండ్లర్లు, ఆయుధాలు సమకూర్చిన నెట్‌వర్క్‌పై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

హ్యాట్రిక్‌తో రికార్డులు బద్దలు కొడుతాం: యూపీ సీఎం

లక్నో: మూడోసారి బీజేపీ అధికారంలోకి వస్తుందని ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్పి శ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ సారి తమ పార్టీ రికార్డులు బద్దలుకొడు తుందని ఆయన అన్నారు. తమ కూటమి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో 320 సీట్లు సాధిస్తాయని అన్నారు. రైజింగ్ భారత్ సమ్మిట్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఫలితాలపై అనుమానాలు అవస రం లేదన్నారు. గతంలో నమోదు చేసిన రికార్డుల కన్నా ఈసారి మెరుగ్గా ప్రదర్శిస్తా మని తెలిపారు. 320 మార్క్ దాటుతుందా అని ఓ రిపోర్టర్ అడిగిన ప్రశ్నకు ఆయన బ దులిస్తూ కచ్చితంగా ఆ దిశలోనే తమ పార్టీ పనిచేస్తోందన్నారు.



చెక్ బౌన్స్ కేసులో నిర్మాత బండ్ల
గణేశ్‌కు ఏడాది జైలు శిక్ష

అమరావతి,నవంబర్,18 :టాలీవుడ్ ప్రముఖ నిర్మాత, నటుడు బండ్ల గణేశ్‌కు న్యాయస్థానంలో ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. చెక్ బౌన్స్ కేసులో ఆయనకు ఒంగోలు కోర్టు ఏడాది సాధారణ జైలు శిక్ష విధించింది. శిక్షతో పాటు రూ. 95 లక్షల భారీ జరిమానా విధిస్తూ న్యాయమూర్తి కీలక తీర్పు వెలువరించారు. పూర్తి వివరాల్లోకి వెళితే... ఆర్థిక లావాదేవీలకు సంబంధించి జెట్టి వెంకటేశ్వర్లు అనే వ్యక్తికి బండ్ల గణేశ్ తన నిర్మాణ సంస్థ 'పరమేశ్వర ఆర్ట్ ప్రొడక్షన్స్' పేరిట రూ. 95 లక్షల విలువైన చెక్ ఇచ్చారు.బ్యాంక్ ఖాతాలో సరిపడా నిధులు లేకపోవడంతో ఆ చెక్ బౌన్స్ అయింది. నగదు చెల్లింపు విషయంలో న్యాయం జరగకపోవడంతో బాధితుడు ఒంగోలు కోర్టును ఆశ్రయించారు. ఈ కేసుపై న్యాయ స్థానంలో సుదీర్ఘంగా విచారణ జరిగింది. ఇరు పక్షాల వాదనలు విన్న అనంతరం, నేరం రుజువు కావడంతో కోర్టు బండ్ల గణేశ్‌ను దోషిగా తేల్చింది. ఆయనకు ఏడాది సాధారణ జైలు శిక్షతో పాటు



రూ. 95 లక్షల జరిమానా విధించింది. జరిమానా మొత్తంతో పాటు, ఈ కేసు విచారణ నిమిత్తం బాధితుడికి అయిన కోర్టు ఖర్చులను కూడా బండ్ల గణేశే పూర్తిగా భరించాలని న్యాయమూర్తి స్పష్టం చేశారు. గతంలోనూ పలు చెక్ బౌన్స్ కేసుల్లో బండ్ల గణేశ్‌కు న్యాయస్థానాలు జైలు శిక్షలు విధించగా, ఆయన పైకోర్టుల్లో అప్పీల్‌కు వెళ్లిన సంగతి తెలిసిందే.

అమెరికా రాడార్‌పై ఇరాన్ గురి..
యూఎస్ ప్రతీకార మెరుపు దాడులు



వాషింగ్టన్: పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం మరోసారి తీవ్రరూపం దాల్చిం ది. అమెరికా, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ప్రయత్నాలు కొనసాగుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో మాత్రం పరస్పర దాడులు ఆగడం లేదు. తాజాగా హార్మూజ్ జలసంధిలో ఇరుదేశాల మధ్య మరోసారి సైనిక ఘర్షణ చోటుచేసుకుంది. బహ్రెయిన్‌లోని అమెరికా సైనిక రాడార్ వ్యవస్థపై ఇరాన్ దాడి చేసిందన్న ప్రకటన వెలువడిన కొద్దిసేపటికే.. అమెరికా యుద్ధ విమానాలు ఇరాన్‌పై విరుచుకుపడ్డాయి. క్వెష్మ్ ద్వీపంలోని క్షిపణి ప్రయోగ కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకుని దాడులు చేశాయి. అమెరికా సైనిక అధికారి వెల్లడించిన వివరాల ప్రకారం.. ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ క్షిపణి ప్రయోగ కేంద్రంపై అమెరికా వైమానిక దాడులు నిర్వహించింది. అమెరికా సిబ్బంది, సైనిక ఆస్తులపై ఇరాన్ దూకుడుకు ప్రతిస్పందనగానే ఈ చర్య తీసుకున్నట్లు అధికారి పేర్కొన్నారు. అయితే ఈ దాడుల్లో ఎలాంటి మౌలిక నదుపాయాలు దెబ్బతినలేదని ఇరాన్ మీడియా ఓ అధికారిని ఉటంకిస్తూ వెల్లడించింది. అంతకుముందు బహ్రెయిన్‌లోని షేక్ ఇసా వైమానిక స్థావరంలో ఉన్న అమెరికా సైనిక రాడార్ వ్యవస్థను లక్ష్యంగా చేసుకున్నట్లు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ ప్రకటించింది. అమెరికా ఐదో నౌకాదళ ప్రధాన కార్యాలయం బహ్రెయిన్‌లోనే ఉంది. ఇరాన్ దాడిని అడ్డుకున్నామని, ఎలాంటి ప్రాణనష్టం లేదా ఆస్తినష్టం జరగలేదని బహ్రెయిన్ వెల్లడించింది. అమెరికాతో సైనిక భాగస్వామ్యం కొనసాగించడం, షియా మత పెద్దల పట్ల వ్యవహరిస్తున్న తీరుపై బహ్రెయిన్‌ను ఇరాన్ హెచ్చరించింది. తమకు వ్యతిరేకంగా అమెరికాతో కలిసి పనిచేయడం ప్రాంతీయ భద్రతకు ముప్పుగా మారు తుందని వ్యాఖ్యానించింది.

'తెలంగాణ నదీ జలాల్లో చుక్క నీటి వాటాను కూడా వదులుకోం

బీఆర్ఎస్ అబద్దాలు చెప్పడం మానుకోవాలి: మంత్రి ఉత్తమ్ కుమార్



హైదరాబాద్, నవంబర్ 18: 'తెలంగాణ నదీ జలాల్లో చుక్క నీటి వాటాను కూడా వదులుకోం. బీఆర్ఎస్ హయాంలోనే కృష్ణా జలాలను ఏపీ ఎక్కువగా వాడుకుంది. మేం వచ్చాకనే తెలంగాణ ఎక్కువ నీళ్లను వినియోగించుకుంటోంది. బీఆర్ఎస్ అబద్దాలు చెప్పడం మానేయాలి' అంటూ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. 'బీఆర్ ఎస్.. తెలంగాణ ప్రజలకు అబద్దాలు చెబుతోంది. కేటీఆర్ మాటలు తీవ్రంగా ఖండిస్తున్నాను. కేంద్ర జల్ జీవన్ మంచి నీటి పథకం కింద ఏపీ. తరలించే పనికి శ్రీకారం చుట్టింది. దీనిని మేము వ్యతిరేకిస్తున్నాం. దీనిపై కేంద్రానికి, కేఆర్ఎమ్‌బీకి మా అభ్యంతరాలు చెప్పాం. ఆ పనులు ఆపించడానికి అన్నీ విధాలుగా ప్రయత్నిస్తున్నాం. మేము మీలా ఏపీ పార్టీలు, నేతలతో లాలూచీ పడే వ్యక్తులం కాదు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో కృష్ణా జలాలను ఏపీయే ఎక్కువగా వినియోగించుకుంది. కృష్ణా నుంచి ఏపీ 4460 తరలిస్తే తెలంగాణ 1993 లు మాత్రమే వినియోగించుకుంది. మేం వచ్చాక ఏపీ 98.16 తరలిస్తే.. తెలంగాణ వినియోగించుకుంది. ఏపీ కంటే తెలంగాణయే అధికంగా వినియోగించుకుంది. బీఆర్ఎస్ దుష్ప్రచారం చేయడం మానుకోవాలి' అంటూ మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి.. సోనియా ఆత్మకథపై కేటీఆర్ చేసిన విమర్శలకు సమాధానం చెప్పారు.' సోనియా గాంధీ లేకుండా తెలంగాణ రాష్ట్రమే లేదు. తెలంగాణ సోనియా గుండెల్లో ఉన్నందుకే రాష్ట్ర ఏర్పాటు జరిగింది. మీ పదవులు, ఆస్తులు, సంపద అంతా సోనియా తెలంగాణ ఇవ్వడం వల్లనే. అది మీ నాన్న అసెంబ్లీలో కూడా చెప్పారు' అంటూ ఆక్షేపించారు.

4.63 లక్షల మందికి పెన్షన్లు..

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక: మంత్రి సీతక్క

వరంగల్, నవంబర్18: రాష్ట్రంలో 4.63 లక్షల మందికి పెన్షన్లు ఇస్తున్నామని తెలంగాణ గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క వెల్లడించారు. ఈ పెన్షన్ లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటిస్తున్నామని తెలిపారు. బుధవారం వరంగల్ జిల్లా సంగెం మండలం స్టేషన్ చింతలపల్లి టెక్స్‌టైల్ పార్క్ పైలాన్ వద్ద రూ. 45 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు చేయూత పెన్షన్ పత్రాలను ఆమె పంపిణీ చేశారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఇంట్లో ఆడ కూతురు సంతోషంగా ఉండాలనేది సీఎం రేవంత్ రెడ్డి ఆరాటమని చెప్పారు. మహిళా సంఘాలకు మ్యారేజ్ ఫంక్షన్ హాల్స్ ఇస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులతోపాటు పథకాలన్నీ మహిళల పేరు మీదే ఇస్తున్నామని మంత్రి సీతక్క వివరించారు.

కేవలం ఈ మూడేళ్లలో మహిళా సంఘాలకు రూ.75 వేల కోట్లు రుణాలు ఇచ్చామని గుర్తు చేశారు. మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా పెట్రోల్ బంక్, సోలార్ పవర్ ప్లాంట్స్‌తోపాటు 300 ప్రాంతాల్లో ఇందిర మహిళా శక్తి క్యాంటీన్లు ఇచ్చామని అన్నారు. మేడారం జాతరలో వ్యాపారాల కోసం మహిళా సంఘాలకు రూ.3 కోట్లు ఇస్తే.. వారు రూ.9 కోట్లు సంపాదించారని సోదాహరణంగా మంత్రి సీతక్క వివరించారు.

బరాక్ క్షిపణుల ఆధునికీకరణకు ఇజ్రాయెల్‌తో భారత్ కీలక ఒప్పందం

ఢిల్లీ, నవంబర్18: భారత నావికాదళానికి చెందిన బరాక్ పాయింట్ డిఫెన్స్ క్షిపణి వ్యవస్థ ఆధునికీకరణ కోసం కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ ఇజ్రాయెల్ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్ తో రూ.1,976.40 కోట్ల కీలక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. బుధవారం న్యూఢిల్లీలో రక్షణ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ సమక్షంలో ఈ ఒప్పందంపై ఇరుదేశాలకు చెందిన అధికారులు సంతకాలు చేశారు. దీంతో భారత నావికాదళ యుద్ధనౌకలపై ఉన్న బరాక్ క్షిపణి వ్యవస్థల్లోని హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌లను సమగ్రంగా ఆధునికీకరిస్తారు. పాత సాంకేతికత స్థానంలో కొత్త విడిభాగాలను అమర్చే అబోలెసెన్స్ మేనేజ్‌మెంట్ ప్రక్రియను కూడా ఈ ఒప్పందంలో భాగంగా నిర్వహిస్తారు. ఈ అప్‌గ్రేడ్ ద్వారా శత్రు దేశాల క్షిపణులు, ఇతర గగనతల దాడుల నుంచి భారత యుద్ధ నౌకలకు మరింత బలమైన, ఎక్కువ దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదించగల రక్షణ సామర్థ్యం లభిస్తుంది.



అఖిల భారత కిసాన్ సభ జాతీయ కార్యదర్శిగా సాగర్

-నారాయణపేట జిల్లా నారాయణపేట మండలం కోటకొండ నివాసికి స్థానం...



-సర్వత్ర హర్షం...

నారాయణపేట,(డీకే చాటింపు): నల్లగొండలో ఈనెల15 నుంచి18 వరకు జరిగిన అఖిల భారత కిసాన్ సభ 36 వ,మహాసభల్లో జాతీయ సహాయ కార్యదర్శిగా సాగర్ ను ఎన్నికయ్యారు.సాగర్ ఎన్నిక పట్ల తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు అంజిలయ్య గౌడ్,కార్యదర్శి దస్తప్ప బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.అఖిల భారత కిసాన్ సభ 36వ,మ హాసభల్లో నారాయణపేట జిల్లా నారాయణపేట మండలం కోటకొండ గ్రామ నివాసి సాగర్ కు చోటు దక్కడం హర్షించదగ్గ విషయమన్నారు.ఆయన చిన్న తనం నుంచే విద్యార్థి సంఘ నాయకుడిగా గ్రామ స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ భారత విద్యార్థి సమాఖ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులుగా కార్యదర్శిగా, యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శిగా,ప్రస్తుతం తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదగా కొనసాగుతూ విద్యార్థి యువజన నిరుద్యోగ రైతు కార్మిక సమస్యల మీద అనేక పోరాటాలు చేశారాని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు.నారా యణపేట జిల్లా లో జరుగుతున్న భూ నిర్వాశితుల పోరాటం భూ పోరాటలకు బాసటగా నిలస్తున్నారన్నారు. భవిష్యత్తులో రైతు కార్మిక ప్రజా పోరాటాలకు నాయకత్వం వహించాలని వారు ఆకాంక్షించారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలి





మంచిర్యాల్ (డీకే చాటింపు): ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతో పాటు వారి విద్యా ప్రమాణాలు, హాజరు శాతం, ఏకాగ్రతను పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం జిల్లాలోని కోటపల్లి మండలంలో గల మోడల్ స్కూల్‌లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, కోటపల్లి మండల తహసీల్దార్ రాఘవేంద్ర, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేశ్వరరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్ తివారి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో విద్యారంగంలో భారీగా పెట్టుబ డులు పెట్టడం జరుగుతుందని తెలిపారు. ఉదయం పూట అల్పాహారం తీసుకోకుండా పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు సి.ఎం. బ్రేక్‌ఫాస్ట్ పథకం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని, పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రోజంతా ఉత్సాహంగా చదువుకోవడంతో పాటు క్రీడలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 20 లక్షల మంది విద్యార్థులకు ఈ పథకం ద్వారా ప్రయోజనం చేకూరనుండగా, మంచిర్యాల జిల్లాలో సుమారు 35 వేల మంది విద్యార్థులకు, చెన్నూర్ నియోజకవర్గంలో సుమారు 12 వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ఎవరూ ఆకలితో పాఠశాలకు రాకూడదనే గొప్ప ఆలోచనతో ముఖ్యమంత్రి ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. తాను 2009 నుంచి 2014 వరకు పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న సమయంలోనే ఈ ప్రాంతంలో 109 మోడల్ పాఠశాలలు మంజూరయ్యాయని గుర్తుచేశారు. కోటపల్లి మోడల్ స్కూల్‌లో 301 మంది బాలురు, 237 మంది బాలికలు విద్యనభ్యసిస్తుండటం సంతోషంగా ఉందని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది అందిస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. విద్యార్థులు చిన్నతనం నుండి క్రమశిక్షణ, పట్టుదల, కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలని, ప్రతి ఒక్కరూ ఒక ఉన్నతమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు. తాము భవిష్యత్తులో డాక్టర్లు, ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు కావాలనే సంకల్పంతో చదువుకోవాలని, లక్ష్య సాధనకు క్రమశిక్షణ ఎంతో ముఖ్యమని తెలిపారు. పాఠశాల స్థాయిలోనే వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, మంచి నడవడిక అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రస్తుతం పాఠశాల లో మంచి ఫలితాలు సాధిస్తున్నప్పటికీ, సి.ఎం. బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలుతో ఇకపై 100 శాతం ఉత్తీర్ణతతో పాటు అత్యుత్తమ గ్రేడ్‌లు సాధించే దిశగా విద్యార్థులు కృషి చేయాలని ఆకాంక్షించారు. విద్యార్థులు 100 శాతం డిస్టింక్షన్ ఫలితాలు సాధిస్తే పాఠశాలకు ప్రత్యేక బహుమతి అందజేస్తానని తెలిపారు. మోడల్ స్కూల్‌లో సుమారు 500 మంది విద్యార్థులకు ఉ పయోగపడేలా భోజనశాల నిర్మాణానికి 40 లక్షల రూపాయలు అవసర మని, ఇందులో 20 లక్షల రూపాయలు జిల్లా కలెక్టర్ ద్వారా, మరో 20 లక్షల రూపాయలు డిఎంఎఫ్‌టి నిధుల నుండి కేటాయించడం జరుగుతుం దని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ నిధులు మంజూరు చేస్తున్నామని, ఇప్పటికే డిగ్రీ కళాశాలకు 2 కోట్ల రూపాయలు, ఇంటర్మీడియట్ కళాశాలకు 1.50 కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని, కోటపల్లిలో సుమారు 90 లక్షల రూపాయలతో ఎస్.సి. వసతి గృహ నిర్మాణ పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలోని సోమనపల్లిలో 2 వేల 500 మంది విద్యార్థులకు వసతి సౌకర్యాలతో కూడిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను వచ్చే విద్యా సంవత్సరం నుండి ప్రారంభించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని, విద్యార్థుల వసతి అవసరాలను దృష్టిలో ఉంచుకొని అదనపు వసతి గృహ సీట్ల మంజూరు కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. విద్యార్థులు సంప్రదాయ విద్యతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వివిధ నైపుణ్యాలను అభ్యసించాలని సూచించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సుమారు 4 వేల కోట్ల రూపాయల వ్యయంతో అడ్వాన్స్‌డ్ టెక్నా లజీ సెంటర్లను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. వీటి ద్వారా విద్యార్థుల కు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు మెరుగుపర చనున్నట్లు తెలిపారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూళ్లు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, గురుకులాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పాఠశాలల నుండి వచ్చే అవసరాల ప్రతిపా దనలను పరిశీలించి నిధులు మంజూరు చేయడం జరుగుతుందని, అవసరమైన మరమ్మతులు, త్రాగునీరు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలలలో ఎలాంటి అదనపు వసతులు అవసరమైనా పూర్తి వివరాలతో ప్రతిపాదనలు సమర్పించాలని, ఒకేసారి అన్ని అవసరాలను తెలియజేయడం ద్వారా పనులు పునరావృతం కాకుండా సమగ్రంగా అభివృద్ధి పనులు చేపట్టవచ్చని సూచించారు. అవసరమైన చోట బోర్‌వెల్స్, మరమ్మతులు, ఇతర సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల కోసం బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్న భోజనం, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం, డైట్, కాస్మెటిక్ ఛార్జీల పెంపు వంటి పలు కార్యక్రమాలను అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థుల హాజరు శాతం ఇప్పటికే సగటున 75 శాతానికి పైగా ఉ ండగా, కొన్ని సందర్భాలలో 80 శాతానికి చేరుతుందని తెలిపారు. ఈ పథకాలతో రానున్న రోజులలో హాజరు శాతం, విద్యా ఫలితాలు మరింత మెరుగుపడతాయని తెలిపారు. విద్యార్థులు మంచి ప్రవర్తన, సానుకూల దృక్పథం, క్రమశిక్షణ, కష్టపడే తత్వాన్ని అలవర్చుకొని తమ లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్యార్థుల అభ్యున్నతికి జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మంత్రి, జిల్లా కలెక్టర్ విద్యార్థులతో కలిసి అల్పాహారం స్వీకరించి, అధి కారులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ల్యాబ్ గదిని ప్రారంభించారు.లి చెన్నూర్ మండలం కన్నేపల్లి నుండి సంకారం వరకు 90 లక్షల రూపాయల ఎం.ఆర్.ఆర్. 2024-25 నిధులతో పునరుద్ధరించిన బి.టి. రహదారిని ప్రారంభించారు. సంకారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాలకు బెంచీలను అందజేశారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన వసతులను సమకూర్చాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన డిఎంహెచ్వో



నిజామాబాద్ ప్రతినిధి నవంబర్ 18 (డీకే చాటింపు,):జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి రాజశ్రీ నిజమాబాద్ పట్టణంలోని గౌతమ్ నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ ఓ వ్యాధినిరోదక టీకా లకార్యక్రమాన్ని, టీకాల అర్హుల జాబితా లిస్టు ను, సెషన్ ప్లాన్ను, డ్రాప్ అవుట్ పిల్లల జాబితాను, పరిశీలించి వంద శాతం వ్యాధిని ర్ధక టీకాలను ఇవ్వా లని అన్నారు. తప్పిపో యిన ప్రతి పిల్లాడిని ఆశ వ్యక్తిగతంగా పర్యవేక్షించి టీకాలు ఇవ్వాలి అన్నారు. డి ఫ్రీజర్, ఐఎల్ఆర్ ను చూసి, కోల్డ్ చైన్ నిర్వహిస్తూ, టెంపరే చర్ రికార్డు చేయాల న్నారు. ఆసుపత్రిలో జరిగే ప్రసవాలు, గర్భిణీ స్త్రీల నమోదు రిజిస్టరు, ప్రమాదకర లక్షణాలు గల గర్భిణీ స్త్రీల రికార్డులను పరిశీలించి 100% ఆస్పత్రి ప్రసవాలు జరగాలని, ప్రమాదకర లక్షణాలు గల గర్భిణీ స్త్రీలను ముందుగానే ఉన్నత ఆసుపత్రులకు రిఫర్ చేయాలన్నారు. సర్వైకల్ క్యాన్సర్ నియంత్రణకు 14 ఏళ్ల బాలికలకు హెచ్పీవీ టీకాలను అర్హులైన బాలికలు అందరికీ ఇవ్వాలని, తల్లిదండ్రు లకు టీకాపై అవగాహ న కలిగించాలని, పెండింగ్ లో ఉన్న టీకాలను మూడు రోజుల్లో పూర్తి చేయాల న్నారు. 18 సంవత్సరా లు నిండిన మహిళలం దరికీ ఆరోగ్య మహిళ ద్వారా జీవనశైలి వ్యాధుల నియంత్రణ కోసం మరియు మహిళల ఆరోగ్య కోసం పరీక్షలు నిర్వహించాలన్నారు. ల్యాబ్ రికార్డులు, శాంపుల్ రిపోర్టులు, నాకు రిజిస్టర్, రిజిస్టర్, హెచ్ఎంఐఎస్ రిపోర్ట్ లను పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకో వాలని, రికార్డులను రిపోర్టులను ఎప్పటి కప్పుడు సవరించు కుంటూ నాణ్యమైన సేవలను అందించాలని వైద్యాధికారికి మరియు వైద్య సిబ్బందికి తెలియజేశారు. తనిఖీ సమయంలో ఆస్పత్రి వైద్యాధికారిని మైత్రి, ఫార్మసిస్టు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది ఉన్నారు.

అన్ని కార్యక్రమాలకు డప్పు కొట్టినం.. ఇకపై మన హక్కుల కోసం కొడదాం..!!

-ఆది జాంభవ డప్పుల సంఘం ఆవిర్భావ సభలో... -అంబేద్కర్ జాతర సంఘం జిల్లా అధ్యక్షులు యు. మహేష్ పిలుపు... -నారాయణపేటలో 500 డప్పులతో భారీ ర్యాలీ... -ఆవిర్భావ సభలో డప్పుకు పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించిన మహేష్... -డప్పు కళాకారులకు నెలకు రూ.6 వేల పింఛన్ ఇవ్వాలి... -అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలి...





నారాయణపేట,(డీకే చాటింపు): అన్ని కార్యక్రమాలకు డప్పు కొట్టినం..ఇకపై మన హక్కుల కోసం కొడదామని అంబేద్కర్ జాతర సంఘం జిల్లా అధ్యక్షులు యు.మహేష్ పిలుపునిచ్చారు.ఆది జాంభవ డప్పుల సంఘం ఆవిర్భావ సభ సందర్భంగా బుధవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో డప్పు కళాకారులు భారీ ర్యాలీ నిర్వహించారు.అంబేద్కర్ జాతర జిల్లా అధ్యక్షులు యు.మహేష్ రాంలీలా మైదానం(భారం బావి)వద్ద జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.అనంతరం సత్యనారాయణ చౌరస్తా వద్ద యు.మహేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆవిర్భావ సభలో డప్పుకు పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సభను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ డప్పు కళాకారులకు నెలకు రూ.6 వేల పింఛన్ అందించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని,బీమా పథకంతో పాటు అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సదుపాయాలు కల్పించాలని కోరారు.ఈ డిమాండ్లను జిల్లా కలెక్టర్ ప్రియాంక,ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి దృష్టికి తీసుకువస్తామన్నారు. త్వరల్లోనే డీసీసీ మాజీ అధ్యక్షులు కుంభం శివ కుమార్ రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి అసెంబ్లీలో రాష్ట్రశీలో ఉన్న డప్పులు కళాకారుల హక్కుల కోసం మాట్లాడే విధంగా కృషి చేస్తామన్నారు. పార్టీలకు అతీతంగా అందరూ ఐక్యంగా ఉంటేనే మన హక్కులను సాధిశీచుకోవచన్నారు.డప్పు కొట్టిన చేతులతో డాలర్లు సంపాదించే స్థాయికి కళాకారులు ఎదగాలని ఆకాంక్షించారు. నారాయణపేట జిల్లాలో మొట్టమొదటి సారిగా 500 మంది డప్పులతో భారీ ర్యాలీ నిర్వహించడం సంతోషకారమ్మన్నారు.అన్ని శుభకార్యాలకు,వివిధ కార్యక్రమాలకు డప్పులు కొట్టిన మనం ఇకపై మన హక్కుల సాధన కోసం డప్పులు కొడదామని పిలుపునిచ్చారు. ఆది జంభవ డప్పుల సంఘం జిల్లా కమిటీ అధ్యక్షులుగా కూన్సీ రాజు,ప్రధాన కార్యదర్శి తిమ్మయ్య తో పాటు మరి కొందరిని కమిటీ సభ్యులుగాఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఆవిర్భావ సభలో వార్డు కౌన్సిలర్ భరత్,వివిధ సంఘాల నాయకులు ఈశ్వరమ్మ, వడెప్ప,రమేష్,చంటి శివ, నర్సింహా,కృష్ణయ్య,పాండు, డప్పు కళాకారులు,సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్లిక్..క్లిక్..ఫోటో ముచ్చట్లు..!

అక్క ఎమ్మెల్యే..తమ్ముడు పిసిసి సభ్యులు..!! -ఒకే వేదికపై అక్క తమ్ముడు సందడి...

-నారాయణపేట నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి, చిట్టెం అభిజయ్ రెడ్డి... -కనువిందు చేసిన దృశ్యాలు...



చేయూత పెన్షన్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే

నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి, పిసిసి సభ్యులు,ఎమ్మెల్యే సోదరుడు చిట్టెం అభిజయ్ రెడ్డి బుధవారం నారాయణపేట నియోజకవర్గంలోని దామరగిద్ద,నారాయణపేట మండలాల్లో పర్యటించారు.దామరగిద్ద మండల కేంద్రంలోని భవాని మాత ఆలయం దగ్గర దామరగిద్ద మండలానికి చెందిన చేయూత పెన్షన్ల పత్రాలు, సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అలాగే నారాయణపేట మండల కేంద్రంలోని అభినందన్ గార్డెన్స్ లో నారాయణపేట మండలానికి చెందిన చేయూత పెన్షన్లు, సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే తో పాటు వారి సోదరుడు చిట్టెం అభిజయ్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఈ ఇద్దరు నేతలు పార్టీ శ్రేణులతో ఎంత ఉత్సాహంతో మాట్లాడారు.

ఈ దృశ్యాలు అందర్నీ విశేషంగా ఆకట్టుకున్నాయి.అలాగే ఎమ్మెల్యే వర్ణిక రెడ్డి ఎంతో ఉత్సాహంతో లబ్ధిదారులకు చేయూత పెన్షన్ పత్రాలను అందజేసి వారి దగ్గర చిరునవ్వుతో మాట్లాడి లబ్ధిదారులను ఉత్సాహపరిచారు.!



ఒకే వేదికపై ఎమ్మెల్యే, పిసిసి సభ్యులు తదితరులు

లక్ష తులసి కుండీల పంపిణీకి శ్రీకారం

జాగృతి ఛైర్మన్ భావన శ్రీనివాస్



ఎల్బీనగర్ (డీకే చాటింపు) ఎల్.బి.నగర్ నియోజకవర్గాన్ని తులసి వనంగా తీర్చిదిద్దే ఆలోచనతో కార్తీక క్షీరాబ్ధి ద్వాదశిని పురస్కరించుకుని సాహెబ్ నగర్ ప్రభుత్వ పాఠశాల, వనస్థలిపురం మొదటి ముద్ద, పద్మావతి కాలని వెంకటేశ్వర స్వామి దేవాలయం వేదికలుగా జాగృతి అభ్యుదయ సంఘం లక్ష తులసి,ఔషధ మొక్కల కుండీల పంపిణీని ప్రారంభించారు. ఎల్.బి.నగర్ శాసన సభ్యులు శ్రీ దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన చక్రవర్తి శ్రీ చౌదూరి నరసింహారావు, బి.ఎన్.రెడ్డి డివిజన్ మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డిలు హాజరై పంపిణీని ప్రారంభించారు. ఎల్.బి.నగర్ నియోజకవర్గాన్ని తులసివనంగా చూడాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని మొదలు పెట్టామని జాగృతి ఛైర్మన్ భావన శ్రీనివాస్ వెల్లడి. ప్రకృతిలో సహజంగా లభించే ఔషధ మొక్కలతో వాతావరణం శుద్ధితో పాటు ఆరోగ్యం చేకూరుతుందని, తద్వారా మనిషి మనసు పవిత్రమై సానుకూల దృక్పథం వైపు మళ్ళే అవకాశాలుంటాయని, మొక్కలను పూజించే మన సంస్కృతిలో సైన్స్ దాగి ఉందని వక్తలు ఉద్ఘాటించారు. చలికాలంలో ఉసిరి చెట్టు క్రింద కూర్చోడం, ఉసిరిని ఏదొక రూపంలో తినడం వలన కఫ సంబంధ వ్యాధుల్ని దూరం చేయొచ్చన్నారు.రాజకీయ వ్యవస్థలో నేడు జరుగుతున్న ఎన్నికల ప్రక్రియలో చోటుచేసుకుంటున్న అవినీతి అక్రమాల స్థానంలో జుజ నిబంధనలకు అనుగుణంగా ఎన్నికలు జరిగి ప్రజాస్వామ్యం కాపాడబడాలనే ఆలోచనతో అటు విలువైన ఓటుని కొనే నాయకుల, ఇటు అమ్ముకుంటున్న ఓటర్ల మనసు మారాలని, తులసి మొక్కలతో నియోజకవర్గం అంతా తులసివనంగా ప్రక్షాళన జరగాలనే లక్ష్యంతో ఈ బృహత్తర కార్యక్రమాన్ని ఒక మహా యజ్ఞంలా భావించి ప్రారంభించామని రైట్ ఓట్ ఛాలెంజ్ ఉ ద్యమం చేస్తున్న జాగృతి అభ్యుదయ సంఘం ఛైర్మన్ భావన శ్రీనివాస్ అన్నారు. శ్వాస, దగ్గు, ఆయాసం, షుగర్, కిడ్నీస్టోన్స్, క్యాన్సర్, మందబుద్ధి, నెమ్ము, కీళ్ల నొప్పులు, మల బద్దకం, నరాల బలహీనతను తగ్గించే పలు రకాల మొక్కలను ఈరోజు వరకు 5000 పంచినట్లు శ్రీనివాస్ తెలిపారు.

ఖర్చుతో కూడుకున్న తిరిగి వాడుకునే కుండీలలోనే మొక్కలను దాతల సహకారంతో పంచుతున్నామన్నారు. కార్యక్రమంలో సాహెబ్ నగర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ వి దినేష్, డాక్టర్ విజయ్, గోరక్షక్ ప్రముఖ్ యాదగిరిరావు, లయన్స్ క్లబ్, ఆర్యవైశ్య సంఘం, వివిధ కాలనీ సంక్షేమ సంఘాల, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రవీందర్ రెడ్డి, సిహెచ్ .వి.ఆర్.కే మూర్తి కూడా పాల్గొన్నారు.లి సునీల్ గుప్త, రేణికుంట కళ్యాణ్, నాగేంద్ర, కొలిశెట్టి సంజయ్ కుమార్, క్రిష్ణవేణి, వెంకటేశ్వర స్వామి ఆలయం ఛైర్మన్ చంద్రశేఖర్, దాతలు యాదా రామలింగేశ్వరరావు, బండి లక్ష్మణరావు, రేచింతల పావని, చేబ్రోలు శ్రీనివాసులు, జాగృతి ప్రతినిధులు శ్రీరంగనాథ్, శరత్ కుమార్, ఆసబత్తుల సత్యనారాయణ, పద్మజ యద్దనపూడి, సౌజన్య తదితరులు పాల్గొన్నారుభావన శ్రీనివాస్.

డీకే చాటింపు
తెలంగాణ దిన పత్రిక
గురువారం,నవంబర్,19, 2026

దేశ ఐక్యతకు భంగం!

కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీజేపీ అనుసరి స్తున్న పలు విధానాల వలన దేశ ఉత్తర దక్షిణ రాష్ట్రాల మధ్య దూరం రోజురోజుకూ పెరిగిపోతున్నది. ప్రధానంగా వస్తువులపై పన్ను సేకరణ మొత్తాలను ఒకే గొడుగుకిందికి తీసుకొచ్చిన జీఎస్టీ విధానం 101 రాజ్యాంగ సవరణ ద్వారా 2016 సంవత్సరం నుండి అమలులోకి వచ్చినది. ఇప్పటికే ఈ పన్ను సేకరణ మొత్తాలను వివిధ రాష్ట్రాలకు చేస్తున్న పంపిణీలో వ్యత్యాసాలు ఉన్నాయి.. దీంతో దక్షిణాది రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రమైన అసంతృప్తికి గురి అవుతున్నాయి. మరోవైపు నియోజకవర్గాల డీలిమిటేషన్ పునర్విభజనను 2011 జనాభా ప్రాతిపదికగా చేయడంతో పుండు మీద కారం చల్లినట్టు దేశ ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య అగాధం ఏర్పడ డానికి కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించినట్టు అయింది. రాజ్యాంగంలోని 82 (170) ఆర్టికల్ చట్టం ద్వారా దేశంలో నియోజకవర్గాల డీలిమిటేషన్ ప్రక్రియ మొదటిసారి 1951 జనాభా గణాంకాల ఆధారంగా చేపట్టారు.. 1952లో 489 లోకసభ స్థానాలను ప్రకటించారు. రెండోసారి 1963లో 489 నుండి 522కు పెంచుతూ విభజన జరిగింది. ఇక మూడవ పర్యాయం 1973లో 522 నుండి 545 పార్లమెంటు సభ్యుల స్థానాలుగా పెరిగాయి. అధిక జనాభా కలిగిన రాష్ట్రాలు అధిక ప్రయోజనం పొందనున్నాయని, అలా పొందకుండా నిరోధించడానికి చట్ట సవరణ ద్వారా డీలిమి టేషన్ ప్రక్రియను నిలిపివేశారు.. తిరిగి 1986 ఆర్టికల్ 84 సవరణ ద్వారా నియోజకవర్గాల డీలిమిటేషన్ పునర్విభజన ప్రక్రియను 2026 వరకు వాయిదా వేశారు. కాబట్టి ఈ సంవత్సరం జనాభాను అనుసరించి నియోజకవర్గాల డీలి మిటేషన్ జరగబోతున్నది. ఈ నేపథ్యంలో దేశ ఉత్తర దక్షిణ రాష్ట్రాల మధ్య జనాభా ఉత్పత్తి వృద్ధి రేటులో గణనీయంగా హెచ్చు తగ్గులు చోటు చేసుకున్నాయి. ఈ కారణంగా ఏ క్షణంలోనైనా అసంతృప్తి భగ్గున మండడానికి సిద్ధంగా వుంది. 2026లో వివిధ రాష్ట్రాల జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరిగితే అగ్నికి ఆజ్యం పోసినట్టు అవుతుంది. ఈ వెలుగులో ప్రధాన కార్యకారణాలను పరిశీలించాల్సి ఉ ంది. అందులో ప్రధానమైనది రాష్ట్రాల మధ్య ఎఈఖీ (ఏనీబీజీశ్రీ టవతీబితిశ్రీతిబిఎ ఖీజీబివ) సంతాన ఉత్పత్తి వృద్ధి నిష్పత్తి క్రమాన్ని అవగతం చేసుకోవాలి. అక్షరాస్యత ఉన్నత చదువులు, కుటుంబ సంక్షేమం అభివృద్ధి తద్వారా సమాజ వృద్ధి పెంపొందడం వలన దక్ష ణాదిలో జనాభా తగ్గిపోయినది. ప్రజలు వస్తు సేవలను వినియోగించుకోవడం ద్వారా అధిక వస్తు సేవల పన్నులు చెల్లిస్తున్నారు. ఇదే కాలంలో అటు ఉత్తర భారత రాష్ట్రాలలో నిర క్షరాస్యత, వెనుకబాటు మూలంగా అధిక జనాభా ఉంది. జనాభా నిష్పత్తి ఆధారంగా జీఎస్టీ సంపద పంపిణీలో అధిక నిధులను దేశ ఉత్తర రాష్ట్రాలు పొందుతున్నవి. జనాభా తక్కువ ఉన్న దక్షిణాది రాష్ట్రాలకు తక్కువ నిధుల పంపిణీ జరుగుతుంది. దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం నిధుల వంపిణీలోనూ, నియోజకవర్గాల పునర్విభజనలోనూ వివక్ష కొనసాగడం తద్వారా రానున్న కాలంలో దక్షిణాది రాష్ట్రాలకు శాపంగా పరిణమించనున్నది. దక్షిణాదికి చెందిన ఆయా రాష్ట్రాలలోని అధికార, విపక్ష పార్టీలన్నీ తాత్కాలిక ప్రయోజనాలను పక్కనపెట్టి ఏకం కావలసిన తరుణం ఆసన్నమైనది. ఉత్తర భారతంలో విస్తరించిన బీజేపీ, దక్షిణాదిలో ఎలాగైనే సరే.. జండా ఎగరవేయాలని తహతహలాడుతున్నది. అందులో భాగంగానే ఎన్నికల సంఘం ద్వారా రాష్ట్రాలలో "సర్" అమలు పరుస్తున్నది. దీని ద్వారా ఎన్నికల సంఘం దేశంలో ముందు ఎప్పుడూ లేనంత తీవ్ర విమర్శలను వివిధ రాజకీయ పార్టీల నుంచి ఎదుర్కొంటున్నది. ప్రస్తుత రాజకీయ వాతావరణంలో దక్షిణాది రాష్ట్ర ప్రభుత్వాల పిల్లి మెడలో గంట ఎవరు కడతారో..? ఎదిరి చూడవలసి ఉన్నది. ఇప్పటికే ఆయా రాష్ట్రాల లోకనభ స్థానాలు మొత్తం 850 వరకు పెరగనున్నాయని తెలుస్తున్నది. అంటే రాష్ట్రాలలో గణనీయంగా లోకసభ స్థానాలు పెరగనున్నాయి. ప్రధానంగా వస్తువులపై పన్ను సేకరణ మొత్తాలను ఒకే గొడుగుకిందికి తీసుకొచ్చిన జీఎస్టీ విధానం 101 రాజ్యాంగ సవరణ ద్వారా 2016 సంవత్సరం నుండి అమలులోకి వచ్చినది. ఇప్పటికే ఈ పన్ను సేకరణ మొత్తాలను వివిధ రాష్ట్రాలకు చేస్తున్న పంపిణీలో వ్యత్యాసాలు ఉన్నాయి.. దీంతో దక్షిణాది రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రమైన అసంతృప్తికి గురి అవుతున్నాయి. మరోవైపు నియోజకవర్గాల డీలిమిటేషన్ పునర్విభజనను 2011 జనాభా ప్రాతిపదికగా చేయడంతో పుండు మీద కారం చల్లినట్టు దేశ ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య అగాధం ఏర్పడ డానికి కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించినట్టు అయింది. రాజ్యాంగంలోని 82 (170) ఆర్టికల్ చట్టం ద్వారా దేశంలో నియోజకవర్గాల డీలిమిటేషన్ ప్రక్రియ మొదటిసారి 1951 జనాభా గణాంకాల ఆధారంగా చేపట్టారు..



ఇళ్ళస్థలాల సాధనకై 20న గ్రేటర్ జర్నలిస్టుల మహా ధర్నా

హలో జర్నలిస్ట్-ఛలో ఇందిరా పార్క్

(డీకే చాటింపు,హైదరాబాద్): గ్రేటర్ జర్నలిస్టులకు ఇళ్ళస్థలాల కేటాయింపులో కొనసాగుతున్న ప్రభుత్వ వివక్ష, నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈ నెల 20వ తేదీన ఇందిరా పార్కు ధర్నా చౌక్ లో జర్నలిస్టుల మహాధర్నా కార్యక్రమం చేపట్టనున్నట్లు గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య, కార్యదర్శి బొల్లం శ్రీనివాస్ లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ ధర్నాలో వివిధ రాజకీయ పార్టీల, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని మద్దతు తెలియజేస్తారని వారు పేర్కొన్నారు. ఇళ్ళస్థలాల కోసం ఎన్నో ఏళ్ళుగా ఎదురు చూస్తూ నిరాశ – నిస్పృహలకు లోనైన గ్రేటర్ జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు నివాస స్థలాలు, గృహ వసతి కల్పించే ఉద్దేశ్యంతో 2008 లో "గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ"(=వస్త్ర చీశీ. 163/2008) ఏర్పాటు చేయడం జరిగిందని, దాదాపు 1300 మంది సొసైటీ సభ్యులైన జర్నలిస్టులు గత 18 ఏళ్ళుగా ఇళ్ళస్థలాల కోసం పోరాటం చేస్తున్నారని అన్నారు. హైదరాబాద్ జిల్లాతో సహా జీహెచ్ఎంసీ పరిధిలోని వివిధ మున్సిపాలిటీలలో నివసిస్తూ వివిధ పత్రికలు, టీవీ చానళ్ళలో పని చేస్తున్న జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్ళస్థలాలు కేటాయించకుండా ఉత్తుత్తి హామీలతో కాలయాపన చేస్తుందని ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత కూడా జర్నలిస్టులకు కనీస సదుపాయాలు లభించడంలేదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో



జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన ఐదు అంశాలను మేనిఫెస్టో లో పెట్టి అమలు చేస్తామని హామీ ఇచ్చారని, కానీ అధికారంలోకి వచ్చి మూడేళ్ళు కావస్తున్నా ఒక్క సమస్యను కూడా పరిష్కరించలేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల ఇళ్ళస్థలాల విషయంలో ముఖ్యమంత్రి, మంత్రుల చిట్ చాట్ మాటలు, ఉత్తుత్తి హామీలే తప్ప ఆచరణలో ఏమీ చేయడంలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పాత్రికేయులు రోడ్లపైకి రావాల్సిన పరిస్థితి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ళస్థలాల సమస్య పై ఈనెల 20న జరిగే జర్నలిస్టుల మహాధర్నాతోనైనా ప్రభుత్వం వెంటనే మేల్కొని గ్రేటర్ జర్నలిస్టులకు ప్రత్యేక జీవో ద్వారా ఇళ్ళస్థలాలు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు.

పేద విద్యార్థి కీ గద్వాల్ చేయూత
చదువుకు అండగా సీఎం ప్రజావాణి



(డీకే చాటింపు,హైదరాబాద్): ఆర్థిక ఇబ్బందుల కారణంగా పాఠశాల ఫీజు 35 వేలు చెల్లించలేక విద్యా సర్టిఫికెట్లు పొందలేక ఉన్నత విద్యకు ఆటంకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థి కందుకూరి యోగేశ్వర్ గుప్తాకు సీఎం ప్రజావాణి స్టేట్ ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్ పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి చేయూతనిచ్చారు. ఆ విద్యార్థి సర్టిఫికెట్స్ ను స్కూల్ నుంచి పొందడానికి అవసరమైన ఫీజు రూ. 35 వేలు ఇన్నర్ వీల్ బంజారా సంస్థ ద్వారా ఏర్పాటు చేసి మంగళవారం మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజా భవన్ లో నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో చెక్ ను గద్వాల్ విజయలక్ష్మి అందజేశారు.ఫీజు బకాయి ఉందనే కారణంతో విద్యార్థికి టెన్త్ క్లాస్ మెమోతో పాటు ఇతర విద్యా సంబంధిత సర్టిఫికెట్లను అందించేందుకు పాఠశాల యాజమాన్యం నిరాకరించడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థి సమస్యను సీఎం ప్రజావాణి స్టేట్ ఇన్‌చార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్‌పర్సన్ గద్వాల్ విజయలక్ష్మి దృష్టికి తీసుకువచ్చారు.

సేవా స్ఫూర్తికి చిరునా మాగా ఇందూరు యువత

నిరంతర అన్నదాన సేవకు 2,000 రోజులు

- అభినందించిన పోలీస్ కమిషనర్

నిజామాబాద్ ప్రతినిధి నవంబర్ 18 (డీకే చాటింపు): సమాజంలో ఆకలితో అలమటించే అభాగ్య లకు అన్నం అందిస్తూ , అనాథలకు అండగా నిలుస్తూ , ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తం అందిస్తున్న ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు స్ఫూర్తిదాయ కమని పోలీస్ కమిష నర్ పి. సాయి చైతన్య, అన్నారు. నిరంతర అన్నదాన కార్యక్రమా న్ని 2,000 రోజుల పాటు నిర్విరామంగా కొనసాగించడం , సంస్థ 15 ఏళ్ల సేవా ప్రస్థానా న్ని విజయవంతంగా పూర్తి చేసుకోవడం అభినందనీయమని కొనియాడారు.ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ 15వ వార్షికోత్సవ వేడుకలు , అన్నదాన సేవకు 2,000 రోజులు పూర్త యిన సందర్భంగా నగరం లోని కంటేశ్వర్ ప్రాంతంలో ఉన్న ఎస్.ఆర్. జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్ సాయి చైతన్య జ్యోతి ప్రజ్వలన చేసి వేడుక లను ప్రారంభించారు. అలరించిన చిన్నారుల, కళాకారుల సాంస్కృతి క ప్రదర్శనలు ఆకట్టు కున్నాయి.పోలీస్ కమీషనర్ మాట్లాడు తూ ఇందూరు యువ త స్వచ్ఛంద సేవా సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు సమాజం లోని ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నా యన్నారు. సాధారణం గా ఎవరూ ముందుకు రాని ఎన్నో మానవతా కార్యక్రమాలను సంస్థ నిరంతరం నిర్వహించ డం గొప్ప విషయ మన్నారు. ముఖ్యంగా 2,000 రోజుల పాటు అన్నదాన కార్యక్రమా న్ని కొనసాగిస్తూ వేలాది మంది నిరాశ్రయులు , అనాథలు , అభాగ్యుల ఆకలి తీర్చడం అభినం దనీయమన్నారు. అనాథ మృతదేహాలకు గౌరవప్రదంగా అంత్య క్రియలు నిర్వహించ డం ,



మతిస్థిమితం కోల్పోయి రోడ్లపై దీన స్థితిలో జీవిస్తున్న వారికి అవసరమైన సేవలు , సంరక్షణ అందించడం వంటి కార్యక్రమాలు సంస్థ మానవతా దృక్పథానికి నిదర్శనమన్నారు. ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగ స్వాములు కావాలని పిలుపునిచ్చారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ మద్దుకూరి సాయి బాబు సంస్థ చేపడు తున్న వివిధ సేవా కార్యక్రమాల వివరా లను ఎల్ఈడీ తెరపై వీడియో ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఎస్.ఆర్. కళాశాల జనరల్ ఇన్‌చార్జి శ్రీకాంత్ రెడ్డి , డీన్ రాంబాబు , కళాశాల ప్రిన్సిపల్ , ఇందూరు యువత ప్రధాన కార్యదర్శి వాలా బాలకిషన్ , రాజేశ్ శర్మ , లక్కంపల్లి సంజీవరావు , సుజన్ కుమార్ , రాంబాబు , గజవాడ హనుమంత రావు, మహిపాల్ రెడ్డి , సుజాతారెడ్డి, సుధాకర్ రాజు , జగన్మోహన్ , ఇందూరు యువత కార్యవర్గ సభ్యులు , కళాశాల అధ్యాప కులు , విద్యార్థినీ విద్యార్థులు తదిత రులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ప్రొద్దుటూరి
వినయ్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా
5 లక్షల LOC కాపి అందజేత



ఆర్మూర్ విలేఖరి నవంబర్ 18 (డీకే చాటింపు):ఆర్మూర్ మండలం రాంపూర్ గ్రామ వాస్త వ్యులు ఎర్రోళ్ల ప్రకాష్ ఇటీవలే అనారోగ్యం తో బాధపడుతూ సర్జరీ కోసం NIMS హాస్పిట ల్ లో జాయిన్ అయ్యా రు.కాగాకాంగ్రెస్ నాయ కులు ఆర్మూర్ నియోజ కవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి కువిన్నవించడంతో వారు స్పందించి ముఖ్య మంత్రి సహాయ నిధి నుండి ఐదు లక్షలు మంజూరు చేయించి, శుక్ర నిజామాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రివర్యు లు ధనసరి అనసూయ సీతక్క ద్వారా మంజూరు చేయిం చారు. ఐదు లక్షల రూపాయల LOC కాపీని స్వయానా బాధిత కుటుంబ సభ్యులకు హైదరా బాద్ లోని జూబ్లీహిల్స్ ఆఫీసులో ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి అంద జేశారు.శుక్ర కాపీ ఇప్పించిన ప్రొద్దు టూరి వినయ్ కుమార్ రెడ్డి మరియు మంత్రి వర్యులు ధనసరి అన సూయ సీతక్క కు బాధితుడి భార్య రజిత మరియు కుటుంబ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మోడల్ సోలార్ గ్రామాల ఎంపిక

రెడ్కో ఏఈ జగదీప్ రామ్

నిజామాబాద్ ప్రతినిధి నవంబర్ 18 (డీకే చాటింపు): ప్రతి నియోజక వర్గంలో మోడల్ సోలార్ విలేజ్ ఎంపిక ప్రక్రియ జరుగుతుందని నిజా మాబాద్ జిల్లా రెడ్కో జిల్లా మేనేజర్ రవీంద్రచౌహన్,అసిస్టెంట్ ఇంజనీర్ జగదీప్ రామ్ వివరించారు. జిల్లాలో ని నిజాంబాద్ రూరల్ నియోజకవర్గం నుండి గుండారం గ్రామం బాల్కొండ నియోజక వర్గం నుండి రహత్ నగర్ గ్రామాలు ఎంపిక చేసినట్లు వివరించారు. గృహ జ్యోతి పథకంలో భాగంగా ఆర్ సి సి బిల్డింగ్ ఉన్న ప్రతి ఇంటికి ఉచితంగా రెండు కిలో వాట్ల సోలార్ సిస్టం ఏర్పా టు చేయడం జరుగు తుందని అన్నారు. ఈ రెండు గ్రామాలలో సర్వే పూర్తయిందని సుమారు 1500 మంది లబ్ధిదా రులకు ఎంపిక చేసామని వివరిం చారు. ఒక ఇంటికి ఒక లక్ష వరకు లబ్ధి పొందు తుందన్నారు. ప్రధాన మంత్రి సూర్య యోజన పథకం, కింద పూర్తి సబ్సిడీపై అందజేయడం జరుగుతుందన్నారు. త్వరలో టెండర్ల ప్రక్రియ పూర్తికాగానే గ్రామాల్లో సోలార్ యంత్రాలను బిగిస్తారు అన్నారు. ఎమ్మెల్యే ఎమ్మెల్సీలకు ఉచిత సోలార్ విద్యుత్ జిల్లాలోని ప్రతి ఎమ్మెల్యేకు ఒక సోలార్ యూనిట్ ఉచితంగా ఏర్పాటు చేయడం జరుగుతుందని పూర్తి గా కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ తో ఈ పథకం అమలవుతుందని ఎంపిక ప్రక్రియ పూర్తయిందన్నారు. అంతేకాకుండా కోటగిరి మండలం



లోని ప్రభుత్వ కార్యాల యాలు, సొంత బిల్డిం గులు ఉన్న వాటికి కూడాపూర్తిగా ఉచి తంగా సోలార్ విద్యుత్ ఇన్స్టాల్ చేస్తామని వాటికి సంబంధించి త్వరలోనే కార్యాల యాలకు సమాచారం అందిస్తా మన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత
బీపి, షుగర్ పరీక్షలు...



బెల్లంపల్లి (డీకే చాటింపు) నేటి ఆధునిక జీవితం లో ఆహార అలవాట్లతో జీవనశైలి మారుతుంది. దింతో బీపి, షుగర్ చిన్న వయస్సులో వస్తున్నాయని లయన్స్ క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు. బుధవారం బెల్లంపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక తిలక్ గ్రౌండ్ లో ఉచిత బీపి, షుగర్ పరీక్షలు నిర్వహించారు. నెల రోజులు ఈ ఉచిత పరీక్షలు నిర్వహిస్తామని అన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు మేరుగు ప్రభాకర్, ప్రతినిధులు కటుకూరి సత్యనారాయణ,ఈగ వెంకటస్వామి, పాల్గొన్నారు

తరలిపోతున్న విదేశీ నిధులు



అంతర్జాతీయంగా పెరుగుతున్న ముడి చమురు ధరలు, బలపడుతున్న అమెరికన్ డాలర్, అమెరికా బాండ్ల ఈల్డ్స్ ఆకర్షణీయంగా ఉండటం భారతీయ స్టాక్ మార్కెట్లలో పెట్టుబడిదారుల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్) తాజా వివరాల ప్రకారం, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులు (ఎఫ్‌పీఐ) అక్టోబర్ నెలలో ఇప్పటివరకు భారతీయ ఈక్విటీల నుంచి ఏకంగా రూ. 44,166 కోట్లను వెనక్కి తీసుకున్నారు. సెప్టెంబర్‌లో రూ. 35,861 కోట్ల విలువైన నిధుల ఉపసంహరణల జరిగింది. దీంతో ఈ క్యాలెండర్ ఏడాదిలో భారత ఈక్విటీల నుంచి విదేశీ ఇన్వెస్టర్ల మొత్తం నిధుల తరలింపు ఏకంగా రూ. 3.04 లక్షల కోట్లకు చేరింది. ఇది గతేడాది మొత్తం నమోదైన రూ. 1.66 లక్షల కోట్ల కంటే దాదాపు రెట్టింపు కావడం విదేశీ నిధులు వెనక్కి వెళ్లిపోతున్న పరిస్థితిని సూచిస్తోందని గణాంకాలు పేర్కొన్నాయి. ఈ నిధుల ఉపసంహరణలను కేవలం మనదేశ పెట్టుబడి అవకాశాలపై నమ్మకం కోల్పోయినట్టు చూడకూడదని, ఇది ప్రపంచవ్యాప్తంగా క్యాపిటల్ రీ-అలోకేషన్ అని నిపుణులు చెబుతున్నారు. యూఎస్ 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్లపై 5.2 శాతానికి పైగా రిస్క్-ఫ్రీ రాబడి లభిస్తుండటంతో గ్లోబల్ ఇన్వెస్టర్లు తమ నిధులను సురక్షితమైన ప్రదేశాలకు తరలిస్తున్నారు.

12 వ,అంతర్జాతీయ మత్స్య కార్మిక దినోత్సవం వేడుకలు
-ఈనెల 21న పల్లె పల్లెలో జరుపుకోవాలి...
-నారాయణపేట జిల్లా ముదిరాజ్ సంఘం నేతల పిలుపు...



నారాయణపేట,(డీకే చాటింపు):
12 వ,అంతర్జాతీయ మత్స్య కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 21 న(శనివారం)పల్లె పల్లెలో ముదిరాజ్ సభ్యులు సంఘటితమై జెండా ఎగురవేసి వేడుకలు నిర్వహించుకోవాలని జిల్లా ముదిరాజ్ సంఘం పెద్దలు పిలుపునిచ్చారు. నారాయణపేట జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు ఏ.కాంత్ కుమార్ అధ్యక్షతన బుధవారం నారాయణపేట లో ఇందుకు సంబం ధించిన గోడపత్రికను ముదిరాజ్ సంఘం నేతలు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం నేతలు మాట్లాడుతూ మత్స్య కారులు సభ్యత్వం లేని వారు సభ్యత్వం చేసుకోవాలని, మత్స్య కార్మికులు అందరు ప్రభుత్వ సంక్షేమ ఫాలలు అందుకోవాలని తెలిపారు. ముదిరాజ్ సంఘం పెద్దల సూచనలను ప్రతి ముదిరాజ్ పాటించి ఆచరణలో పెట్టాలని కోరారు.
ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు సరాఫ్ నాగరాజ్ ముదిరాజ్,ముదిరాజ్ సంఘం పట్టణ అధ్యక్షులు బి.వెంకటయ్య ముదిరా జ్, కౌన్సిలర్ ఏ. రాము,ముదిరాజ్ సంఘం యువత అధ్యక్షులు,వకీల్ సంతోష్,కాకర్ల భీమయ్య, కొనంగేరి హన్మంతు,వకిల్ ప్రశాంత్,గొవింద్ గేరి లక్ష్మి కాంత్,కార్తిక్,బసవపురం వెంకటేశ్,సంకలపురం మల్లేష్,కాశీష్ సంతోష్, మన్నె సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అభ్యర్థులకు ఆర్థికకష్టాలు

కర్నూలు: ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ మొదలైన నాటి నుంచీ కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం వైఖరి, ఇప్పుడు క్షేత్రస్థాయి క్యాడర్‌ను తీవ్ర గందరగోళంలోకి నెట్టేసింది. "రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిపోతోంది, తమ అభ్యర్థులను నామినేషన్లు వేయనివ్వడం లేదు అంటూ గవర్నర్‌కు ఫిర్యాదులు, మీడియా ముందు ప్రెస్‌మీట్లతో నానా హంగామా సృష్టించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి.. తీరా ఎన్నికల రణక్షేత్రం వేడెక్కుతున్న తరుణంలో యథావిధిగా బెంగళూరు ప్యాలెస్‌కు వెళ్లిపోయారు. అధినేత చేసిన ఆరోపణలకు పూర్తి భిన్నంగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 90 శాతానికి పైగా స్థానాల్లో వైసీపీ అభ్యర్థులు యథేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేయడం, ఒకవైపు అసత్య ప్రచారాన్ని బట్టబయలు చేస్తూనే, మరోవైపు నాయకత్వ చిత్తశుద్ధిని ప్రశ్నార్థకం చేస్తోంది.స్థానిక ఎన్నికల్లో ఎవరైనా ప్రత్యర్థులకు స్థానాలు ఏకగ్రీవం చేస్తే, భవిష్యత్ అసెంబ్లీ , సార్వత్రిక ఎన్నికల్లో వారికి ఎట్టిపరిస్థితుల్లోనూ పార్టీ టికెట్లు ఇచ్చేది లేదని జగన్ స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. దీంతో తమ రాజకీయ భవిష్యత్తును కాపాడుకునేందుకు కొందరు, మరికొందరు స్థానిక టీడీపీ నేతలతో తెరవెనుక చర్చలు జరిపి వ్యక్తిగత ప్రయోజనాలు , హామీలు పొందే వ్యూహంతో నామినేషన్లు వేయించినట్లు స్పష్టమవుతోంది. నామినేషన్ల సంఖ్య భారీగానే కనిపించినప్పటికీ, అందులో ప్రజాబలంతో పాటు అంతర్గత బేరసారాల వ్యూహాలే ఎక్కువ పాత్ర పోషించాయన్న వాదన బలంగా వినిపిస్తోంది.నామినేషన్లు వేయడం ఒక ఎత్తైతే, ఆ తర్వాత సీరియస్‌గా బరిలో నిలబడి ప్రజల్లోకి వెళ్లాలనుకున్న అసలైన క్యాడర్ పరిస్థితి మాత్రం దయనీయంగా మారిపోయింది. పోరుబాట పట్టిన అభ్యర్థులను వెనకుండి నడిపించే నాథుడే కరువయ్యారు. అధికారంలో ఉన్నప్పుడు అన్నీ అనుభవించి, కోట్లాది రూపాయల పదవులు అనుభవించిన జిల్లా స్థాయి ముఖ్య నేతలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు ఇప్పుడు ముఖం చాటేశారు. తమ సొంత ఇలాకాల్లో సైతం ఎన్నికల ఖర్చులకు రూపాయి విదల్చకుండా చేతులెత్తేశారు. కనీసం బూత్ స్థాయి ఏజెంట్లను నియమించుకోవడానికి, రోజువారీ ప్రచార రథాలు, కరపత్రాల ముద్రణకు కూడా జిల్లా నాయకత్వం నుంచి నయాపైసా ఆర్థిక సాయం



అందకపోవడంతో క్షేత్రస్థాయి నాయకులు దిక్కుతోచని స్థితిలో ఒంటరి పోరాటం చేయాల్సి వస్తోంది.ముఖ్యంగా ప్రతిష్ఠాత్మక నగరాలైన విజయవాడ, విశాఖపట్నం, కడప వంటి మున్సిపల్ కార్పొరేషన్లలో పార్టీ తరఫున మేయర్ రేసులో నిలిచిన అభ్యర్థుల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. కార్పొరేషన్ స్థాయి ప్రచారం అంటే లక్షల్లో, కోట్లల్లో ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో ఆర్థికంగా దెబ్బతిన్న అభ్యర్థులు సొంత జేబుల్లోంచి నిధులు పెట్టే సాహసం చేయలేకపోతున్నారు. అటు పార్టీ పెద్దల నుంచి ఎటువంటి చేయూత లభించడం లేదు. దీనితో వీధుల్లో నామమాత్రపు మైకులతో తిరుగుతూ ప్రచారం చేస్తున్నామా లేదా అన్నట్లుగా కాలం వెళ్లదీస్తున్నారు. అధిష్ఠానం బెంగళూరులో కూర్చుని సోషల్ మీడియా ట్వీట్లతో సరిపెడుతుంటే, క్షేత్రస్థాయిలో తాము ఎందుకు బలపడాలన్న అసహనం అభ్యర్థుల్లో పెల్లుబుకుతోంది.

ఈ ఆర్థిక స్తోమత లేమి, నాయకత్వపు అలసత్వం వెరసి చివరికి చాలాచోట్ల వైసీపీ అభ్యర్థులు అధికార కూటమి నేతలతో లాలూచీ పడేదిశగా అడుగులు వేయిస్తోంది. గెలిచే అవకాశాలు లేనప్పుడు సొంత ఆస్తులు అమ్ముకుని ఎన్నికల్లో తగలబెట్టడం కంటే.. అధికార పక్షంతో ఏదో ఒక రూపంలో సర్దుబాటు చేసుకుని నిశ్శబ్దంగా ఉండటమే శ్రేయస్కరమని పలువురు కౌన్సిలర్, కార్పొరేటర్ అభ్యర్థులు నిర్ణయించుకుంటున్నారు. ఎన్నికలను కేవలం రాజకీయ ప్రతీకార ప్రకటనలకే పరిమితం చేసి, పోరాడే సైనికులకు కవచాన్ని, ఆయుధాలను అందించని అధిష్ఠాన వైఖరి వల్లే ఈ పరిస్థితి దాపురించింది.

గజరాత్ ను మించిపోతున్న ఆంధ్రా..!

విజయవాడ, : ఏపీ పోర్టులు 210 మిలియన్ మెట్రిక్ టన్నుల సరకు రవాణాతో దేశంలోనే రెండో స్థానంలో నిలిచాయి. నౌకల టర్న్ ఎరౌండ్ సమయం తగ్గించడం, వసతులు మెరుగుపడటంతో గత ఏడాదితో పోలిస్తే సరకు రవాణాలో 12 శాతం పెరుగుదల నమోదైంది. రాష్ట్రంలో కొత్తగా నిర్మిస్తున్న రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం, కాకినాడ పోర్టులు పూర్తైతే మరో 109 ఎంఎంటీల సామర్థ్యం అదనంగా అందుబాటులోకి వస్తుంది. ఈ లక్ష్యాలు నెరవేరితే నాన్-మేజర్ పోర్టుల సరకు రవాణాలో మొదటి స్థానంలో ఉన్న గుజరాత్‌ను ఆంధ్రప్రదేశ్ త్వరలోనే దాటేయడం ఖాయంగా కనిపిస్తోంది.సముద్ర వాణిజ్యంలో ఆంధ్రప్రదేశ్ రికార్డు స్థాయిలో దూసుకుపోతోంది. 2025-26 సంవత్సరానికిగానూ రాష్ట్రంలోని పోర్టుల ద్వారా సుమారు 210 మిలియన్ మెట్రిక్ టన్నుల (ఓఓ) సరకు రవాణా జరగడంతో రాష్ట్రం దేశంలోనే రెండో స్థానంలో నిలిచింది. నాన్-మేజర్ పోర్టుల కార్గో సామర్థ్యంలో ప్రస్తుతం గుజరాత్ టాప్ 1లో ఉంది. ఏపీ వ్యూహాత్మక అడుగులతో భవిష్యత్తులో గుజరాత్‌ను వెనక్కి నెట్టి నెంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకునే దిశగా పయనిస్తోందని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ కమర్షియల్ ఇంటెలిజెన్స్ అండ్ స్టాటిస్టిక్స్-డీజీసీఐఎస్ (తాజా లెక్కలు స్పష్టం చేస్తున్నాయి.2025-26 సంవత్సరానికి పోర్టుల ద్వారా సుమారు 210 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు రవాణా అయింది. 2024-25తో పోలిస్తే ఇది సుమారు 12 శాతం ఎక్కువ. దేశంలో నాన్- మేజర్ పోర్టుల సరకు రవాణా సామర్థ్యంలో గుజరాత్ ప్రథమ స్థానంలో ఉంది. ఏపీ రెండో స్థానంలో నిలిచింది. ఈ వివరాలను కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ కమర్షియల్ ఇంటెలిజెన్స్ అండ్ స్టాటిస్టిక్స్-డీజీసీఐఎస్ రీసెంట్‌గా వెల్లడించింది.విశాఖ మేజర్ పోర్ట నుంచి 91.17 ఎంఎంటీల రవాణా జరిగింది. గత ఆర్థిక సంవత్సరంతో



పోల్చి చూస్తే ఇది 10.35 శాతం పెరుగుదల. గతంలో రవాణా కేవలం 82.62 ఎంఎంటీలుగా ఉంది. ఈ ఏడాది రాష్ట్రంలోని నాన్-మేజర్ పోర్టుల ద్వారా 118.83 ఎంఎంటీల రవాణా జరిగింది. నౌకల టర్న్ ఎరౌండ్ టైమ్‌ని తగ్గించడం, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ఈ పెరుగుదలకు ప్రధాన కారణంగా తెలుస్తుంది.కాగా ప్రస్తుతం విశాఖ పట్నం, గంగవరం, కృష్ణపట్నం తదితర పోర్టుల మొత్తం సామర్థ్యం 327.5 ఎంఎంటీలు. అందులో కేవలం 64.12 శాతం మాత్రమే వినియోగించుకోవడం జరుగుతుంది. ఈ పూర్తి సామర్థ్యాన్ని వాడుకోవాల్సి ఉంది. దీంతోపాటు కొత్తగా నిర్మాణంలో ఉన్న రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం, కాకినాడ పోర్టుల తొలిదశ పనులు పూర్తయితే అదనంగా మరో 109 ఎంఎంటీల సామర్థ్యం అందుబాటులోకి వస్తుంది. 2026-27 నాటికి నాన్-మేజర్ పోర్టుల సామర్థ్యాన్ని 191 ఎంఎంటీల నుంచి 285 ఎంఎంటీలకు పెంచాలన్న ఏపీ మారిటైం పాలసీ లక్ష్యం నెరవేరితే, దేశ కార్గో రవాణాలో గుజరాత్‌కు ఏపీ గట్టి పోటీ ఇవ్వడం ఖాయంగా కనిపిస్తోంది.

తిరుమలలో సగానికి తగ్గిన నీటి నిల్వలు

తిరుమల :తిరుమలలో నీటి అవసరాలను తీర్చేందుకు పాపవినాశనం, గోగర్భం, ఆకాశగంగ, కుమారధార, పసుపుధార జలాశయాలు ఉన్నాయి. ఈ ఐదు రిజర్వాయర్లలో కలిపి 21.60 లక్షల గ్యాలన్ల నీటిని వినియోగించగా.. 40.08 లక్షల గ్యాలన్ల నీరు అదనంగా నిల్వ ఉందని టీటీడీ తెలిపింది. దీంతో తిరుమల ముఖ్యమైన ఐదు జలాశయాల్లో 61.68 లక్షల గ్యాలన్ల నీటి పెరుగుదల ప్రధాన నీటి వనరులుగా ఉన్నాయి.ఆంధ్రప్రదేశ్‌లో ఎల్‌నినో ప్రభావం కనిపిస్తోంది.. ఈ ఏడాది సరైన వర్షాలు లేకపోవడంతో నీళ్ల సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందంటున్నారు. తిరుమల నీటి అవసరాల కోసం కొన్ని జలాశయాలు ఉన్నాయి.. తిరుమలలో పాపవినాశనం, గోగర్భం, ఆకాశగంగ, కుమారధార, పసుపుధార జలాశయాలు ప్రధాన నీటి వనరులుగా ఉన్నాయి.. వీటిలో నీటిమట్టం గురించి టీటీడీ స్పష్టత ఇచ్చింది. తిరుమలలోని ఐదు ప్రధాన జలాశయాల్లో శుక్రవారం వరకు మొత్తం 61.68 లక్షల గ్యాలన్ల నీటి మట్టం పెరిగిందని టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఐదు జలాశయాల్లో కలిపి 21.60 లక్షల గ్యాలన్ల నీటిని వినియోగించగా, 40.08 లక్షల గ్యాలన్ల నీరు అదనంగా నిల్వ ఉందని తెలిపారు.పాపవినాశనం డ్యామ్ నిల్వ సామర్థ్యం 5,240.00 లక్షల గ్యాలన్లు కాగా.. అంతకముందు 2,667.39 లక్షల గ్యాలన్లు ఉంటే.. ప్రస్తుత నిల్వ 2,688.35 లక్షల గ్యాలన్లకు పెరిగింది.. పెరిగిన నీరు 20.96 లక్షల గ్యాలన్లుగా ఉంది. వినియోగం 14.10 లక్షల గ్యాలన్లు ఉంది.. మిగులు నీరు 6.86 లక్షల గ్యాలన్లుగా ఉంది. గోగర్భం డ్యామ్ నిల్వ సామర్థ్యం 2,833.10 లక్షల గ్యాలన్లు కాగా.. గత రోజు నిల్వ 499.06 లక్షల గ్యాలన్లు ఉన్నాయి.. ప్రస్తుత నిల్వ 508.31 లక్షల గ్యాలన్లుగా ఉంది.. పెరిగిన నీరు 9.25 లక్షల గ్యాలన్లు కాగా, వినియోగం 7.50 లక్షల గ్యాలన్లుగా ఉంది.. మిగులు నీరు 1.75 లక్షల గ్యాలన్లు.ఆకాశగంగ డ్యామ్‌లో నిల్వ సామర్థ్యం 685.00 లక్షల గ్యాలన్లు ఉంటే.. గత రోజు నిల్వ 24.07 లక్షల గ్యాలన్లుగా ఉందని తెలిపారు. ప్రస్తుత నిల్వ 30.40



లక్షల గ్యాలన్లు కాగా.. పెరిగిన నీరు 6.33 లక్షల గ్యాలన్లు.. వినియోగం 0.00 లక్షల గ్యాలన్లు.. మిగులు నీరు 6.33 లక్షల గ్యాలన్లుగా ఉంది. కుమారధార డ్యామ్ నిల్వ సామర్థ్యం 4,259.01 లక్షల గ్యాలన్లు కాగా.. గత రోజు నిల్వ 338.84 లక్షల గ్యాలన్లుగా ఉంది. ప్రస్తుత నిల్వ 363.98 లక్షల గ్యాలన్లు కాగా.. పెరిగిన నీరు 25.14 లక్షల గ్యాలన్లుగా ఉంది. వినియోగం 0 గ్యాలన్లు కాగా.. మిగులు నీరు 25.14 లక్షల గ్యాలన్లుగా ఉంది. పసుపుధార డ్యామ్ నిల్వ సామర్థ్యం 1,287.54 లక్షల గ్యాలన్లు కాగా.. గత రోజు నిల్వ 24.38 లక్షల గ్యాలన్లుగా ఉంది. ప్రస్తుత నిల్వ 24.38 లక్షల గ్యాలన్లు కాగా.. నీరు పెరగలేదు.. వినియోగం లేదు, మిగులు నీరు 0 గ్యాలన్లుగా ఉంది.మొత్తంగా ఐదు జలాశయాల్లో 61.68 లక్షల గ్యాలన్ల నీరు పెరగ్గా, 21.60 లక్షల గ్యాలన్ల నీరు వినియోగమైంది. ప్రస్తుతం 40.08 లక్షల గ్యాలన్ల నీరు మిగులుగా ఉంది. ఆకాశగంగ డ్యామ్ పరిధిలో 8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సమయంలో 7.02 లక్షల గ్యాలన్లు, నవరాత్రి బ్రహ్మోత్సవాల సమయంలో 148.48 లక్షల గ్యాలన్ల నీరు అదనంగా చేరింది. అక్టోబర్ 23వ తేదీ వరకు మొత్తం 244.46 లక్షల గ్యాలన్ల నీరు అదనంగా చేరిందని టీటీడీ తెలిపింది.

దిగొస్తున్న కూరగాయల ధరలు

హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో కూరగాయల ధరలు దిగొస్తున్నాయి. వంటిల్లో రోజూ ఉపయోగించే టమాటా, ఉల్లిపాయలు ధరలు అదుపులో ఉన్నాయి. మొన్నటివరకు వీటి ధరలు భగ్గుమనగా.. ప్రస్తుతం స్థిరంగా కొనసాగుతున్నాయి. దీపావళి పండుగ సీజన్ క్రమంలో ధరలు చౌకకే దొరకడంతో సామాన్యులు ఊరట చెందుతున్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఇటీవల ధరలు పెరిగాయి. కూరగాయలకు డిమాండ్ ఉండటంతో ధరలు పెరిగాయి. అయితే ఇప్పుడు పంట మార్కెట్‌కు వస్తుండటంతో సరఫరా పెరిగింది. ఈ కారణంతో ధరలు తగ్గుతూ వస్తున్నాయి. దీంతో ఈ పరిణామం పండుగ వేళ సామాన్యుల ఇంటి బడ్జెట్‌ను తగ్గిస్తోంది. పండుగ సమయాల్లో ఇంట్లో ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. కిరాణా సరుకుల అవసరం ఎక్కువగా ఉంటుంది. ఇక రకరకాల వంటలు వడేందుకు కూరగాయల అవసరం ఎక్కువగా ఉంటుంది. ధరలు తగ్గడం పండక్కి ముందే ఊరటగా కల్గిస్తోంది.కూకట్‌పల్లి మోడ్రన్ అండ్ మోడల్ రైతు బజార్‌లోని నవంబర్ 3వ తేదీన కిలో టమాట రూ. 29, వంకాయ రూ. 18, బెండకాయ రూ. 45, పచ్చిమిర్చి రూ. 45, బజ్జి మిర్చి రూ. 60, కాకరకాయ రూ. 35, బీరకాయ రూ. 35, క్యాబేజీ రూ. 13, బీన్స్ రూ. 55, క్యారెట్ రూ. 43, గోబీపువ్వు రూ. 25, దొండకాయ రూ. 23, చిక్కుడుకాయ రూ. 45, గోరుచిక్కుడు రూ. 35, బీట్‌రూట్ రూ. 19కు విక్రయిస్తున్నారు. ఇఖ క్యాప్సికమ్ రూ. 45, బంగాళాదుంప రూ. 19, కీర (లోకల్) రూ. 23, కీర (ఇటాలియన్) రూ. 35, దోసకాయ రూ. 18, సొరకాయ రూ. 20, పొట్లకాయ రూ. 22 పలుకుతున్నాయి. అలాగే కిలో కంద రూ. 35, ఉల్లికాడలు రూ. 55, ఉల్లిగడ్డ రూ. 40, పచ్చి



మామిడికాయ ఒక్కొక్కటి రూ. 15-20, అరటికాయ ఒక్కొక్కటి రూ. 9-10, చామగడ్డ రూ. 35, ముల్లంగి ఒక్కొక్కటి రూ. 6-8, చిలగడదుంప రూ. 35, గుమ్మడికాయ రూ. 25, నిమ్మకాయలు డజను రూ. 50-60కు లభిస్తున్నాయి. అలాగే మునగకాయలు ఒక్కొక్కటి రూ. 8-10, బొప్పాయి రూ. 50, పుట్టగొడుగులు (200 గ్రా.) రూ. 50, ఎండుమిర్చి రూ. 280, పాత అల్లం రూ. 180, కొత్త అల్లం రూ. 120, వెల్లుల్లి రూ. 260, చింతపండు రూ. 160, పండుమిర్చి రూ. 80, ఉసిరి రూ. 45, కరివేపాకు రూ. 80, పర్వల్ రూ. 28, పల్లికాయ రూ. 55, లోబియా రూ. 28, ఆగాకరకాయ కిలో రూ. 85గా ఉన్నాయి.విజయవాడలోని రైతు బజార్లలో కిలో టమాట రూ.39, బెండ రూ.24, పచ్చిమిర్చి రూ.34, కాకర రూ.34, క్యాబేజీ రూ.24, క్యారెట్ రూ.45, దొండ రూ.24, బంగాళదుంప రూ.25, ఉల్లిపాయలు రూ.39, గోరుచిక్కుళ్లు రూ.32, దోస రూ.20, చామదుంప రూ.34, అల్లం రూ.76, కంద రూ.34, బీట్ రూట్ రూ.36, కీరదోస రూ.46, బీన్స్ రూ.105, క్యాప్సికం రూ.60, చింతకాయలు రూ.100 పలుకుతున్నాయి

ప్యాలెస్ రగడ - రాజకీయంగా డ్యామేజ్

కడప, :తెలుగు రాష్ట్రాల రాజకీయంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన వైఎస్సార్ కుటుంబంలో ఆస్తుల తగాదాలు ఇప్పుడు చౌరస్తాకు వచ్చాయి. వైఎస్ కుటుంబంలో ఇప్పటికే సరస్వతి పవర్ షేర్లతో పాటు పలు ఆస్తుల వ్యవహారాలు ఎన్‌సిఎల్‌టి కోర్టు మెట్లు ఎక్కగా, తాజాగా బెంగళూరులోని యలహంక ప్యాలెస్ వివాదం సరికొత్త రాజకీయ దుమారాన్ని రేపుతోంది. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మధ్య సాగుతున్న ఈ శత్రుత్వంలో.. వైఎస్సార్ కూతురు షర్మిల తన కుమార్తె అంజలి వివాహ వేడుకను యలహంక ప్యాలెస్‌లో నిర్వహించాలని భావించడం, దానికి జగన్ భద్రతా కారణాలు చెబుతూ అనుమతించకపోవడం రాజకీయ వర్గాల్లో విస్తుపోయేలా చేస్తోంది. ఈ బెంగళూరు ప్యాలెస్ కేవలం ఒక విలాసవంతమైన భవనం మాత్రమే కాదు, వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలోనే కుటుంబం కోసం నిర్మించిన ఆస్తి. గతం నుండి షర్మిల ఇక్కడ సుదీర్ఘకాలం నివాసముండటంతో పాటు, కుటుంబ అవసరాలకు ఇది నిలయంగా మారింది. అందుకే తన కూతురు వివాహ శుభలేఖలలో కూడా షర్మిల వివాహ వేదికగా యలహంక ప్యాలెస్‌ను ముద్రించి ఆహ్వానాలు కూడా పంచారు. అయితే, నా ఇంట్లోకి వివాహ కేటరింగ్, ఈవెంట్ మేనేజర్లు, ఫోటోగ్రాఫర్లు రావడం వల్ల నా భద్రతకు, ప్రైవసీకి తీవ్ర ముప్పు ఏర్పడుతుంది అంటూ జగన్ లేఖ రాయడం, హైదరాబాద్ లోటస్ పాండ్‌ను వాడుకోవాలని సూచించడంపై షర్మిల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తమ తండ్రి వైఎస్సార్ కట్టించిన ఆస్తిలో తనకూ సమాన హక్కు ఉందని ఆమె వర్గం సెంటిమెంట్ అస్త్రాన్ని బలంగా ప్రయోగిస్తోంది.ఈ వివాదంలో సామాజికంగా, రాజకీయంగా లభిస్తున్న ప్రజాభిప్రాయాన్ని గమనిస్తే, సానుభూతి పవనాలు పూర్తిగా షర్మిల వైపే వీస్తున్నాయి. ఎంత రాజకీయం ఉన్నా, కన్న చెల్లెలి కూతురు పెళ్లికి.. అదీ సొంత మేనకోడలి కళ్యాణానికి ప్యాలెస్‌ను తిరస్కరించడం ఏ రకమైన సంస్కృతి అని నెటిజన్లు, ప్రజలు సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారు. ఏపీలోని ప్రత్యర్థి పార్టీలు ఎన్డీయే, టీడీపీ నేతలు కూడా జగన్ వైఖరిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు. సొంత చెల్లెలికి, మేనకోడలికి న్యాయం చేయలేని నాయకుడు ప్రజలకు ఏం న్యాయం చేస్తాడు? అంటూ చంద్రబాబు, నారా లోకేష్ విమర్శలు గుప్పిస్తుండటం వైఎస్సార్‌సీపీని తీవ్ర ఇరకాటంలో పడేసింది.ఇక పొలిటికల్ ఇమేజ్ పరంగా చూస్తే జగన్ మోహన్ రెడ్డికి ఈ ఘటన వల్ల జరిగే నష్టం అంతా ఇంతా కాదు. 2024 ఎన్నికల ఘోర పరాజయం తర్వాత



వైఎస్సార్‌సీపీ మళ్లీ పుంజుకునేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో, ఇటువంటి పర్సనల్ ఇష్యూస్ జగన్ ప్రజాదరణను మరింత దిగజారుస్తున్నాయి. ముఖ్యంగా కుటుంబ సభ్యులు, వైఎస్ విజయమ్మ కూడా షర్మిల పక్షాన నిలబడటంతో.. జగన్ వద్ద పనిచేస్తున్న రాజకీయ సలహాదారులు, కోటరీ ఆయనకు సరైన సలహాలు ఇవ్వడంలో ఘోరంగా విఫలమవుతున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సాంకేతిక, చట్టపరమైన, ప్రైవసీ సాకులు చెప్పి మేనకోడలి పెళ్లిని నిరోధించడం కంటే, పెద్ద మనసుతో వేడుకకు అనుమతిస్తే రాజకీయంగా పాయింట్లు స్కోర్ చేసే అవకాశం ఉండేదన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి.జగన్ వైఖరి వెనుక ఉన్న పట్టుదల లేదా మంకుపట్టుదల ఆయనను రోజురోజుకూ జనాల్లో ప్రతికూల నాయకుడిగా నిలబెడుతోంది. నేను చెప్పిందే వేదం, నా మాటే శాసనం అనే దోరణి రాజకీయంలోనైనా, కుటుంబంలోనైనా దెబ్బతీస్తుందనేది ఈ ఉదంతం నిరూపిస్తోంది. ఒకవేళ భద్రతే కారణమైతే పగడ్బందీ సెక్యూరిటీ అరెంజ్‌మెంట్స్ చేసుకుని పెళ్లి జరిపించే అవకాశాలు ఉన్నప్పటికీ.. అంతగా భీష్మించుకుని కూర్చోవడం వల్ల వైఎస్సార్ అభిమానుల్లో సైతం జగన్ పట్ల తీవ్ర నైతిక అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ బెంగళూరు ప్యాలెస్ వివాదం కేవలం ఒక ఇల్లు లేదా కళ్యాణ వేదికకు పరిమితమైన సమస్య కాదు. వైఎస్ కుటుంబంలో ఏర్పడిన ఆస్తులు, రాజకీయ వారసత్వ పోరు క్లైమాక్స్‌కు చేరిందనడానికి ఇది స్పష్టమైన సంకేతం. సలహాదారుల లోపమో లేక సొంత పట్టుదలో కానీ, ఈ వివాదంలో జగన్ తన ఇమేజ్‌ను మరింత డ్యామేజ్ చేసుకుంటుంటే.. షర్మిల మాత్రం బాధితురాలిగా ప్రజా సానుభూతిని కూడగట్టుకోవడంలో ముందంజలో ఉన్నారు. రాబోయే రోజుల్లో ఈ ఆస్తుల రగడ కోర్టుల్లో ఎలాంటి మలుపులు తిరుగుతుందో, వైఎస్సార్‌సీపీపై ఎలాంటి రాజకీయ ప్రభావం చూపుతుందో వేచి చూడాలి.

మద్యం కుంభకోణం విచారణ కీలక మలుపు



విజయవాడ, :ఆంధ్రప్రదేశ్ రాజకీయాలో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్న వైఎస్సార్‌సీపీ హయాంలోని మద్యం కుంభకోణం విచారణ కీలక మలుపు తిరిగింది. రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఓఎస్డీ దొడ్డ వెంకట సత్యప్రసాద్‌తో పాటు ఎక్సైజ్ శాఖ మాజీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ వంటి కీలక అధికారులు కోర్టుకు , దర్యాప్తు సంస్థ సెట్‌కి ఇచ్చిన వాంగ్మూలాలు సంచలనం రేపుతున్నాయి. ఈ దందా మొత్తం నాటి సీఎంవో కనుసన్నల్లోనే జరిగిందని, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతోనే నిబంధనల ఉల్లంఘనలు, ముడుపుల వ్యవహారం నడిచిందని వారు వాంగ్మూలంలో పేర్కొనడం రాజకీయ సంచలనానికి దారితీసింది. అంతేకాకుండా, అంతిమ లబ్ధిదారు జగన్మోహన్ రెడ్డి అని సత్యప్రసాద్ ఏకంగా అప్రూవర్‌గా మారేందుకు సిద్ధమవ్వడం కేసును మరింత ఆసక్తికరంగా మార్చింది.చట్టపరమైన దృక్కోణంలో విశ్లేషిస్తే, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత సెక్షన్ 183 కింద మెజిస్ట్రేట్ ఎదుట నమోదు చేసే అధికారుల వాంగ్మూలానికి న్యాయస్థానంలో చాలా ప్రాధాన్యత ఉంటుంది. పోలీసులకు ఇచ్చే వాంగ్మూలంతో పోలిస్తే, జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ముందు ఇచ్చే వాంగ్మూలాన్ని సాక్షులు లేదా అధికారులు తదనంతరం మార్చడానికి వీలుండదు. కాబట్టి రజత్ భార్గవ, సత్యప్రసాద్ వంటి ఉన్నతాధికారులు తాము ఒత్తిడికి గురయ్యామని , ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకే ఫైళ్లపై సంతకాలు చేశామని మెజిస్ట్రేట్ వద్ద ధృవీకరిస్తే, అది చట్టప్రకారం ప్రధాన నిందితులకు, కుట్రదారులకు చుట్టుముట్టే బలమైన ప్రాథమిక సాక్ష్యంగా మారుతుంది. కేవలం అధికారుల , సహ నిందితుల వాంగ్మూలాలు మాత్రమే ఒకరిని దోషిగా తేల్చడానికి లేదా ఈ కేసులో వైఎస్ జగన్‌ను ప్రధాన నిందితుడు గా చేర్చి శిక్షపడేలా చేయడానికి సరిపోవు. భారతీయ సాక్ష్యాధారాల చట్టం ప్రకారం, అప్రూవర్ లేదా ప్రత్యక్ష సాక్షి చెప్పే మాటలకు మద్దతుగా స్వతంత్ర సాక్ష్యాలు తప్పనిసరి. కేవలం ఒక అధికారి సీఎం చెప్పారు అని వాంగ్మూలం ఇచ్చినంత మాత్రాన కోర్టు ఆమోదించదు. ఆ మాటలను నిరూపించేందుకు నాటి సీఎంవో ఫైల్స్, ఐఏఎస్ అధికారులకు పంపిన అంతర్గత మెమోలు, డిజిటల్ సాక్ష్యాలు , సీఎంవో అధికారుల అధికారిక సమీక్షల నిమిత్తం నమోదైన మినిట్స్ ఆఫ్ మీటింగ్ వంటి రికార్డులను దర్యాప్తు సంస్థలు కోర్టు ముందుంచాల్సి ఉంటుంది.ఇక ఈ కేసులో అత్యంత సంక్లిష్టమైన అంశం ? నగదు లావాదేవీల నిరూపణ . లిక్కర్ స్కామ్‌లో వేల కోట్ల రూపాయల ముడుపులు మారాయని ఆరోపిస్తున్నప్పుడు, ఆ డబ్బు ఎక్కడి నుండి బయలుదేరింది, ఏ హవాలా, బ్యాంకింగ్ మార్గాల ద్వారా పయనించింది, చివరకు అది జగన్మోహన్ రెడ్డికి లేదా ఆయన కుటుంబ సంస్థలకు, ట్రస్టులకు ఎలా చేరింది అనే విషయాన్ని పక్కాగా నిరూపించాల్సి ఉంటుంది. ఒకవేళ కేవలం అధికారులు రూ. 3200 కోట్లు జగన్‌కు చేరాయి అని వాంగ్మూలంలో చెప్పినప్పటికీ, దానికి సంబంధించిన ఫైనాన్షియల్ ట్రయిల్, ఆస్తుల జప్తు లేదా డిజిటల్ ప్రూఫ్స్ చూపించకపోతే, కేసు విచారణ దశలో చెల్లాచెదురయ్యే ప్రమాదం ఉంది. ప్రస్తుతం సిట్ , దర్యాప్తు సంస్థలు అనుసరిస్తున్న వ్యూహం ప్రకారం.. ముందస్తుగా అధికారుల నుంచి కుట్ర కోణాన్ని సేకరించి, ఆ తర్వాత ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ యాక్ట్, మనీ లాండరింగ్ కోణాల్లో నిధులను వెలికితీసే పనిలో ఉన్నారు. అధికారులను బెదిరించి లేదా ఒత్తిడి తెచ్చి సీఎంవో బాధ్యత వహించేలా నిర్ణయాలు తీసుకున్నారని ఆధారాలు లభిస్తే, కుట్రలో భాగస్వామిగా, లబ్ధిదారుగా జగన్‌ను కేసులో ం1గా చేర్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి మాజీ అధికారుల వాంగ్మూలాలు కేసును మలుపు తిప్పిన మాట నిజమే అయినా, అది జగన్మోహన్ రెడ్డి అరెస్టు లేదా ం1గా మార్చేందుకు కేవలం ఒక సపోర్టింగ్ పిల్లర్ మాత్రమే. ఈ వాంగ్మూలాల ఆధారంగా ప్రభుత్వం, సీబీడీ లేదా సిట్ బృందాలు క్షేత్రస్థాయిలో ఎంతవరకు పక్కాగా నగదు మార్పిడి రికార్డులు, డిజిటల్ ఆధారాలు, హవాలా లింకులను కోర్టు ముందు ఉంచుతాయో అనే దానిపైనే ఈ కేసు భవిష్యత్తు మరియు జగన్ లీగల్ భాగస్వామ్యం ఆధారపడి ఉంటుంది

ఆర్టీపీపీ విద్యుత్ ఉత్పత్తి సంక్షోభం..!



కడప, : ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాలో ఉన్న డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఆర్టీపీపీ) ప్రస్తుతం తీవ్రమైన విద్యుత్ ఉత్పత్తి సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. బొగ్గు మరియు నీటి కొరత కారణంగా ఈ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పత్తి తీవ్రంగా ప్రభావితమైంది. ఈ ప్లాంట్‌లో మొత్తం ఆరు యూనిట్ల ద్వారా 1650 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరగాల్సి ఉంది, కానీ ప్రస్తుతం కేవలం 1050 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి మాత్రమే జరుగుతోంది. ఈ పరిస్థితి, ముఖ్యంగా బొగ్గు నిల్వలు కేవలం మూడు రోజులకు సరిపడే స్థాయిలో ఉన్నప్పుడు, విద్యుత్ ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోతుందనే భయాన్ని కలిగిస్తోంది. ప్లాంట్‌కు రోజుకు 21 వేల టన్నుల బొగ్గు అవసరం, కానీ ప్రస్తుతం అందుబాటులో ఉన్న బొగ్గు నిల్వలు తక్కువగా ఉండటం వల్ల విద్యుత్ ఉత్పత్తి నిలిపివేయబడే ప్రమాదం ఉంది. అంతేకాకుండా, ప్లాంట్‌కు రోజుకు 70 క్యూసెక్కుల నీరు అవసరం, కానీ వర్షాలు లేకపోవడం వల్ల నీటి కొరత కూడా తీవ్రంగా ఉంది. ఈ పరిస్థితి, గతంలో కూడా ఇలాంటి సమస్యలు ఎదుర్కొన్న ఆర్టీపీపీకి, ఇప్పుడు మరింత కష్టమైన దశలోకి తీసుకెళ్లింది.వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, 2014 నుండి 2019 మధ్య కాలంలో ఆర్టీపీపీకి బొగ్గు కొరత సమస్యలు ఎదురయ్యాయి. అయితే, ఆ సమయంలో జగన్ తీసుకున్న చర్యల వల్ల బొగ్గు నిల్వలు 3 లక్షల టన్నుల వరకు చేరాయి. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా, ఈ ప్లాంట్ మళ్లీ పాత సమస్యలతో బాధపడుతోంది. ఆర్టీపీపీ ప్రధాన ఇంజనీర్ వాసుదేవరావు మాట్లాడుతూ, ప్రస్తుతం ప్లాంట్‌లో కేవలం మూడు రోజులకు సరిపడే బొగ్గు నిల్వలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి 1000 నుండి 1050 మెగావాట్ల మధ్య జరుగుతోంది, కానీ నీటి లభ్యత తక్కువగా ఉండటం వల్ల పరిస్థితి మరింత కష్టంగా మారుతోంది. ఏపీజెన్‌కో యాజమాన్యం ఆదేశాల మేరకు మాత్రమే ఉత్పత్తి కొనసాగుతోంది.ఈ పరిస్థితి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. విద్యుత్ ఉత్పత్తి నిలిపివేయబడితే, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. విద్యుత్ సరఫరా నిలిచిపోతే, వ్యాపారాలు, విద్యా సంస్థలు, మరియు ఇతర సేవలు ప్రభావితమవుతాయి. ప్రజలు ప్రభుత్వానికి ఈ సమస్యను పరిష్కరించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. విద్యుత్ ఉత్పత్తి పెరగడానికి అవసరమైన బొగ్గు మరియు నీటి నిల్వలను పెంచడం, అలాగే ప్లాంట్‌కు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం అత్యంత అవసరం. ఈ పరిస్థితి పరిష్కరించకపోతే, రాయలసీమలో విద్యుత్ ఉత్పత్తి మరింత కష్టంగా మారవచ్చు.

దామోదర-లక్ష్మీకాంత రావులపై మహేష్ గౌడ్ సీరియస్



హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో రోజురోజుకూ శృతిమించుతున్న గ్రూపు తగాదాలు, బాహాటంగా రచ్చకెక్కుతున్న క్రమశిక్షణా రాహిత్యంపై టీపీసీసీ నాయకత్వం గట్టిగా దృష్టి సారించింది. పార్టీ నేతల వివాదలా? పార్టీ ప్రతిష్టను తీవ్రంగా దెబ్బతీస్తోందని పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయా? పార్టీ సంస్థాగత నియామకాల విషయంలో నేతల మధ్య నెలకొన్న ఆధిపత్య పోరు చివరకు బహిరంగ ఘర్షణకు దారితీసిందా? ఢిల్లీలోని ఓ ప్రముఖ హోటల్ వేదికగా చోటుచేసుకున్నట్లు ప్రచారంలోకి వచ్చిన ఘటన ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు రైతుల సమస్యలు, మరోవైపు పార్టీ వ్యవహారాలు.. వీటన్నింటినీ పక్కనపెట్టి కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఢిల్లీలోనే పరస్పరం తలపడినట్లు వస్తున్న వార్తలు పార్టీ ప్రతిష్ఠకు సవాలుగా మారాయి.పార్టీ అధికారంలో ఉన్న వేళ నేతలు సంయమనం పాటించాల్సింది పోయి.. వ్యక్తిగత ఆధిపత్యం, నామినేటెడ్ పదవులు, నియోజకవర్గ వ్యవహారాలపై పరస్పరం దాడులకు దిగడంపై ఆయన సీరియస్ అయ్యారు. అంతర్గత క్రమశిక్షణను ఉల్లంఘించే వారిపై ఎంతటి స్థాయి నేతలైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేస్తూ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు.వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత రావుల వివాదాన్ని టీపీసీసీ చీఫ్ తీవ్రమైన అంశంగా పరిగణించారు. ఢిల్లీ పర్యటన సందర్భంగా హోటల్ లాబీలో డీసీసీ అధ్యక్ష పదవి, సంస్థాగత నియామకాల విషయంలో ఇరువురి మధ్య మాటామాటా పెరిగి, సహచర ఎమ్మెల్యేల ముందే బాహాబాహీకి దిగే స్థాయికి వెళ్లడం పార్టీ వర్గాల్లో పెను దుమారం రేపింది. తోటి ఎమ్మెల్యేల సమక్షంలో మంత్రి దామోదర తనపై తీవ్ర పదజాలంతో దూషణలకు దిగారని ఎమ్మెల్యే లక్ష్మీకాంత రావు ఇప్పటికే పీసీసీకి ఫిర్యాదు చేశారు. ఈ ఘటన పార్టీ హైకమాండ్ దృష్టికి కూడా వెళ్లింది. ఈ వివాదంపై పూర్తి విచారణ జరిపేందుకు గాంధీ భవన్‌కు స్వయంగా హాజరుకావాల్సిందిగా మంత్రి దామోదర, ఎమ్మెల్యే లక్ష్మీకాంత రావులకు పీసీసీ చీఫ్ ఆదేశాలు జారీ చేశారు.మంత్రి, ఎమ్మెల్యే వివాద పరిష్కారం తర్వాత.. రాష్ట్రంలోని ఇతర నియోజకవర్గాల్లో ఇటీవల చోటుచేసుకున్న వరుస క్రమశిక్షణా ఉల్లంఘనలపై కూడా సమగ్ర విచారణ చేపట్టాలని పీసీసీ నిర్ణయించింది. ఢిల్లీలోని శాంగ్రిలా హోటల్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ, జుక్కల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగినట్లు సమాచారం. జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుల నియామకాలకు సంబంధించి ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తినట్లు తెలుస్తోంది. తమ వర్గానికి ప్రాధాన్యం ఇవ్వాలన్న పట్టుదల, పార్టీ పదవుల పంపకాలపై అసంతృప్తి ఈ వివాదానికి కారణమన్న ప్రచారం జరుగుతోంది.ఈ క్రమంలో హోటల్ లాబీలోనే ఇద్దరి మధ్య మాటామాటా పెరిగినట్లు సమాచారం. 'రూములో వేసి నీ గురించి ఏం అనుకుంటున్నావు?' అంటూ మంత్రి దామోదర రాజనర్సింహ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావుపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు కథనాలు వెలువడ్డాయి. వాగ్వాదం తీవ్రరూపం దాల్చడంతో ఇద్దరూ పరస్పరం దాడికి దిగినట్లు ప్రచారం జరుగుతోంది. ఒకరినొకరు కొట్టుకునే స్థాయికి వివాదం వెళ్లిందన్న వార్త రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. ఈ ఘటన సమయంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఓ సీనియర్ జర్నలిస్ట్ అక్కడే ఉన్నట్లు సమాచారం. ఇతర ప్రజాప్రతినిధుల సమక్షంలో మంత్రి తనను దూషించి అవమానించారని లక్ష్మీకాంతరావు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై ఆయన ఇప్పటికే పీసీసీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అంతటితో ఆగకుండా పార్టీ అధిష్ఠానానికి కూడా ఫిర్యాదు చేయాలని యోచిస్తున్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ సాగుతోంది.ఈ వ్యవహారం నిజంగా ఎంతవరకు వెళ్లింది? ఇద్దరు నేతల మధ్య వివాదానికి అసలు కారణాలేమిటి? పార్టీ పెద్దలు ఈ అంశాన్ని ఎలా పరిష్కరిస్తారు? అన్న ప్రశ్నలు ఇప్పుడు తెరపైకి వస్తున్నాయిఈ ఘటన రాజకీయంగా మరో కీలక చర్చకు తెరలేపింది. తెలంగాణలో రైతులు వివిధ సమస్యలతో సతమతమవుతున్న సమయం లో అధికార పార్టీ నేతలు మాత్రంపార్టీ పదవులు, వర్గ రాజకీయాల కోసం ఢిల్లీలోనే ఘర్షణలకు దిగుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రైతులకు భరోసా కల్పించాల్సిన ప్రజాప్రతినిధులు తమలో తాము ఆధిపత్య పోరుకు దిగడం ఎంతవరకు సమంజసమన్న ప్రశ్నలు ఎదురవుతున్నాయి.ప్రభుత్వంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న మంత్రి, ప్రజల నుంచి ఎన్నికైన ఎమ్మెల్యే మధ్యే సఖ్యత లేకపోతే పార్టీ కేడర్‌కు ఎలాంటి సందేశం వెళ్తుందన్నది మరో ప్రశ్న. జిల్లా స్థాయి పార్టీ పదవుల విషయంలోనే నేతలు సంయమనం కోల్పోతే, ప్రభుత్వ పాలనలో సమన్వయం ఎలా ఉంటుందన్న విమర్శలకు ఈ పరిణామం అవకాశం కల్పిస్తోంది.

అధిష్ఠానం జోక్యం తప్పనిసరేనా?

కాంగ్రెస్ పార్టీలో గ్రూపు రాజకీయాలు కొత్తేమీ కాకపోయినా, అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అంతర్గత విభేదాలు ఇలాంటి స్థాయికి చేరుతున్నాయన్న ప్రచారం పార్టీకి ఇబ్బందికరంగా మారింది. ఈ వివాదం పీసీసీ పరిధిలోనే ముగుస్తుందా? లేక ఢిల్లీ పెద్దల వరకు చేరుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.డీసీసీ అధ్యక్షుల నియామకాల కోసం మొదలైనట్లు చెబుతున్న వివాదం ఇప్పుడు మంత్రి, ఎమ్మెల్యే మధ్య వ్యక్తిగత ఘర్షణగా మారిందన్న వార్త కాంగ్రెస్ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. రైతుల సమస్యలపై దృష్టి పెట్టాల్సిన సమయంలో నేతల మధ్య ఈ తరహా పరిణామాలు చోటుచేసుకోవడం పార్టీకి రాజకీయంగా ఎంతమేర నష్టం కలిగిస్తుందో వేచి చూడాలి.హోటల్‌లో జరిగినట్లు ప్రచారంలో ఉన్న ఘర్షణకు సంబంధించి ఇరువురు నేతల అధికారిక స్పందన, స్వతంత్ర ధ్రువీకరణ అందుబాటులోకి వచ్చిన తర్వాత పూర్తి వాస్తవాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది.ప్రధానంగా నియోజకవర్గ నిధుల పంపిణీ, స్థానిక సంస్థల సమన్వయం, అధికార వర్గాల బదిలీల విషయంలో మంత్రులపై బహిరంగంగా గళమెత్తుతున్న అసంతృప్త ఎమ్మెల్యేలు, సీనియర్ నేతల వ్యవహార శైలిపై పార్టీ అధిష్ఠానం నివేదికలు సిద్ధం చేస్తోంది. మునుగోడు, జడ్చర్ల వంటి స్థానాల్లో సొంత పార్టీ ప్రజాప్రతినిధులే ప్రభుత్వంపై విరుచుకుపడుతుండటం, జిల్లాల్లో డీసీసీ అధ్యక్షుల నియామకాల వేళ వర్గపోరు భగ్గుమంటున్న పరిస్థితులన్నింటినీ సమీక్షించి ఆయా నేతలకు కౌన్సిలింగ్ ఇవ్వడంతో పాటు హెచ్చరికలు జారీ చేయనున్నారు.

వ్యూహాలు సరే...ఆచరణ సాధ్యమేనా

గుంటూరు, : స్థానిక సంస్థల ఎన్నికలు ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అత్యంత ప్రాధాన్యత కలిగిన సవాలుగా మారాయి. 2024 సాధారణ ఎన్నికల ఓటమి తర్వాత పార్టీ క్యాడర్‌లో నెలకొన్న నైరాశ్యాన్ని తుడిచిపెట్టేందుకు అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి చావో రేవో తేల్చుకోవడానికే సిద్ధమయ్యారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జిల్లాల వారీగా రీజినల్ కోఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో సుదీర్ఘ సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ, స్థానిక ఎన్నికలను లైట్ తీసుకోవద్దని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. అధికార పక్షం నుంచి ఎలాంటి ఎదురుదెబ్బలు తగిలినా, ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. ప్రతీ స్థానంలో అభ్యర్థులను నిలబెట్టి పోటీని రసవత్తరంగా మార్చడమే జగన్ ప్రాథమిక వ్యూహంగా కనిపిస్తోంది.ఈసారి స్థానిక సమరంలో వైఎస్సార్‌సీపీ వ్యూహం మునుపటి కంటే చాలా భిన్నంగా ఉంది. ప్రతీ స్థానానికి సంబంధించి ప్రతిపాదించిన అభ్యర్థుల బలాబలాలను జగన్ స్వయంగా వడపోస్తున్నారు. అభ్యర్థి పార్టీకి ఎంత విధేయుడు? కేసులకు భయపడకుండా నిలబడగలడా? గెలిచాక పార్టీ మారకుండా ఉంటాడా? అనే అంశాల ఆధారంగానే బి-ఫామ్‌లు ఖరారు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ ఇన్‌చార్జ్‌లు సరిగా పనిచేయకపోతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరిస్తూ, అధిష్టానం వద్ద ఉన్న సమాచారంతో జిల్లాల నివేదికలను సరిపోల్చుకుంటున్నారు. ఓడినా గెలిచినా బరిలో నిలవడం ద్వారా మాత్రమే పార్టీ శ్రేణుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపవచ్చని జగన్ బలంగా నమ్ముతున్నారు.ఇదే సమయంలో, అధికార తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమిలోని అంతర్గత విభేదాలను క్యాష్ చేసుకోవడానికి వైఎస్సార్‌సీపీ పావులు కదుపుతోంది. ముఖ్యంగా మున్సిపల్ కార్పొరేషన్లు, పురపాలక సంఘాల్లో మేయర్లు, మున్సిపల్ చైర్మన్ల స్థానాలకు నేరుగా ఎన్నికలు జరుగుతుండటంతో ఆశావహుల పోటీ కూటమిలో పీక్స్‌కు చేరింది. విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు వంటి ప్రధాన కార్పొరేషన్లలో మేయర్ సీటు కోసం టీడీపీలోని బలమైన వర్గాలు, జనసేన నేతల మధ్య టికెట్ల పోరు తీవ్రమవుతోంది. కూటమిలో కిందిస్థాయి నాయకుల మధ్య సమన్వయం కుదరడం అంత తేలిక కాదన్న విషయాన్ని గుర్తించిన వైఎస్సార్‌సీపీ, అక్కడ ముదిరే విభేదాలను తమకు అనుకూలంగా మలుచుకోవాలని భావిస్తోంది.ఈ మైండ్ గేమ్‌లో భాగముగానే వైఎస్సార్‌సీపీ తమ మేయర్, చైర్మన్ అభ్యర్థుల పేర్లను ముందే ప్రకటించకుండా గుంభనంగా వ్యవహరిస్తోంది. కూటమిలో టికెట్ దక్కని అసంతృప్త నేతలు, లేదా భాగస్వామ్య పక్షాల మధ్య కుదరని పొత్తుల వల్ల ఉత్పన్నమయ్యే పరిణామాలను గమనించిన తర్వాతే తమ అభ్యర్థులను ఖరారు చేయాలనేది జగన్ ఆలోచన. అంతేకాకుండా, ముందుగానే తమ అభ్యర్థుల పేర్లు బయటపెడితే అధికార యంత్రాంగం ద్వారా వారి ఆర్థిక మూలాలపై దెబ్బకొడతారనే వ్యూహాత్మక భయం కూడా వైఎస్సార్‌సీపీని ముందస్తు ప్రకటనలు చేయకుండా అడ్డుకుంటోంది. సోషల్ మీడియాలోనూ కూటమి వైఫల్యాలను, కిందిస్థాయి నేతల ఘర్షణలను హైలైట్ చేస్తూ వైఎస్సార్‌సీపీ డిజిటల్ వింగ్ విస్తృత ప్రచారం నిర్వహిస్తోంది. పోటీ నుంచి తప్పుకుంటే పార్టీ ఆనవాళ్లు కోల్పోతాం అన్న సంకేతాన్ని జగన్ బలంగా పంపడంతో, క్షేత్రస్థాయి నాయకులు కూడా ఈ ఎన్నికలను తమ ఉనికికి పరీక్షగా భావించి సర్వశక్తులు ఒడ్డుతున్నారు.

పెంపుడు కుక్కతో సహా ప్రాణాలతో

బయటపడ్డ 86 ఏండ్ల వృద్ధుడు

కాలిఫోర్నియా : అమెరికాలో 86 ఏండ్ల వృద్ధుడు తన పెంపుడు కుక్కతో పాటు సముద్రంలో రెండు నెలల పాటు చిక్కుకుపోయాడు. ఆగస్టు 20 నుంచి అతని ఆచూకీ లేకపోవడంతో అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. అక్టోబర్ 27న పడవ నుంచి అత్యవసర సంకేతాలు అందడంతో అమెరికా కోస్ట్‌గార్డ్ రంగంలోకి దిగింది. కాలిఫోర్నియా తీరానికి సమీపంలో వృద్ధుడిని, అతని కుక్కను రక్షించింది. ఒరెగావ్‌లోని ఆస్టోరియా నుంచి అమెరికన్ సమోవాలోని పాగో పాగోకు పడవలో అతను బయలుదేరగా.. పడవ తెరచాపలు దెబ్బతినడంతో సముద్రంలో దిక్కుతోచని స్థితిలో పడవ కొట్టుకుపోయింది. అధికారులు రంగంలోకి దిగి కాపాడారు. సముద్రంలో 460 మైళ్ల దూరంలో..: ఆగస్టు 20న వృద్ధుడితో సంబంధాలు తెగిపోయాయి. అక్టోబర్ 24న అతను గమ్యస్థానానికి చేరుకోలేదని అధికారులకు సమాచారం అందడంతో గాలింపు ప్రారంభించారు. ఈ క్రమంలో అక్టోబర్ 27న పడవ నుంచి అత్యవసర బీకన్ సంకేతాలు అందాయి. దీంతో కోస్ట్‌గార్డ్ విమానాలు, నౌకలను రంగంలోకి దించింది. ఆ రోజు సాయంత్రం శాన్ డియాగో తీరానికి సుమారు 460 మైళ్ల దూరంలో 'విల్లో విండ్' పడవను గుర్తించారు. మరుసటి రోజు ఉదయం 'గ్రాండ్ ఓరియన్' అనే వాణిజ్య నౌక పడవ వద్దకు చేరుకుంది. అయితే సముద్రంలో అలలు ఉద్ధృతంగా ఉండటంతో తొలుత వృద్ధుడిని, కుక్కను రక్షించడం సాధ్యం కాలేదు. ఆ తర్వాత అదే రోజు నౌక సిబ్బంది వారిద్దరినీ సురక్షితంగా తమ నౌకలోకి తీసుకున్నారు. దెబ్బతిన్న తెరచాపలతో పడవను సముద్రంలోనే వదిలేశారు. అక్టోబర్ 29న కాలిఫోర్నియాలోని వెంచురాకు పశ్చిమాన సుమారు 170 మైళ్ల దూరంలో గ్రాండ్ ఓరియన్ నౌక నుంచి కోస్ట్‌గార్డ్ హెలికాప్టర్ సిబ్బంది వృద్ధుడిని, అతని కుక్కను తీసుకెళ్లారు. అనంతరం వారిని శాన్ డియాగోకు తరలించారు. వృద్ధుడిని వైద్య పరీక్షల నిమిత్తం స్క్రిప్స్ మెర్సీ ఆసుపత్రిలో చేర్చారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై కోస్ట్‌గార్డ్ మరిన్ని వివరాలను వెల్లడించలేదు. ఈ రెస్క్యూ ఆపరేషన్ విజయవంతం కావడంలో సహకరించిన వాణిజ్య నౌక సిబ్బంది, కోస్ట్‌గార్డ్ బృందాలను ఆ సంస్థ కమాండర్ జేసన్ న్యూయెన్ అభినందించారు. సముద్ర ప్రయాణాలు చేసేవారు అత్యవసర సమాచార పరికరాలను వెంట ఉంచుకోవడంతోపాటు, తమ ప్రయాణ వివరాలను తీరంలోని వారికి ముందుగానే తెలియజేయాలని సూచించారు.

లద్దాక్ ప్రాంతాల్లో కరెంట్ ...



శ్రీనగర్, : మనిషికి బలంగా అనుకుంటే ప్రకృతి కూడా సహకరిస్తుంది. ప్రతికూల పరిస్థితి కూడా చిన్నబోతుంది. ఎముకలు కొరికే చలి.. కనుచూపుమేర మంచుకొండలు.. అడుగు తీసి అడుగు వేయాలంటే కష్టం.. ఇలాంటి చోట కొంతమందికి పనే దైవం. విధి నిర్వహణే వారికి శిరోధార్యం ఇలాంటి ఇబ్బందుల్లో కూడా వారు ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. ప్రజల ఇబ్బందులతో పోల్చితే.. ఇవి ఒక ఇబ్బందులా అని వారు అనుకున్నారు.. అంతేకాదు ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రాణాల సైతం లెక్క చేయలేదు. దీనికి సంబంధించిన ఒక వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో సంచలనం కలిగిస్తోంది.జమ్ము కాశ్మీర్లోని లద్దాక్ ప్రాంతంలో విద్యుత్ సౌకర్యాలను మరింత పెంపొందించేందుకు కార్మికులు కృషి చేస్తున్నారు. వారు చేస్తున్న పని ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ముఖ్యంగా మారుమూల ప్రాంతాలకు కూడా విద్యుత్ సదుపాయం కల్పించాలని లక్ష్యంతో అక్కడి ప్రభుత్వం అడుగులు వేస్తోంది ప్రభుత్వ లక్ష్యానికి తగ్గట్టుగా సిబ్బంది అత్యంత కఠినమైన వాతావరణంలో పని చేస్తున్నారు. ఉష్ణోగ్రతలు మైనస్ 10 డిగ్రీలకు పడిపోయినప్పటికీ పనులు ఏమాత్రం ఆపడం లేదు.వందల అడుగుల ఎత్తులో విద్యుత్ స్తంభాలు.. లైన్లకు సంబంధించిన పనులు చేస్తున్నారు. చుట్టూ మంచుకొండలు.. కింద లోతైన లోయలు.. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా సరే ప్రమాదం జరిగే పరిస్థితులు.. అయినప్పటికీ కార్మికులు ఏమాత్రం వెనకడుగు వేయడం లేదు. తమ ప్రాణాలను ఫణంగా పెట్టి పనులు చేస్తున్నారు.లద్దాక్ ప్రాంతంలోని నుబ్రా ర్యాలీ.. సియాచిన్ గ్లేషియర్ వంటి ప్రాంతాలలో పనులు జరుగుతున్నాయి. సాధారణ సమయంలో విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేయడమే చాలా శ్రమతో కూడుకుంటుంది. అలాంటిది మంచు ప్రాంతాలలో..

అత్యంత ఎత్తైన ప్రదేశాలలో విద్యుత్ సదుపాయం కల్పించడం అంటే మామూలు ఇబ్బంది కాదు. అక్కడి వాతావరణం ఇప్పుడు ఎలా ఉంటుందో ఎవరూ చెప్పలేరు. తీవ్రమైన చలి.. బలమైన గాలులు.. మంచు వల్ల పనులకు నిత్యం ఆటంకాలు కలుగుతూ ఉంటాయి. అయినప్పటికీ నిర్ణయించిన గడువులోగా ప్రాజెక్టును పూర్తి చేసేందుకు సిబ్బంది పనిచేస్తున్నారు.ఈ పనులకు సంబంధించిన వీడియోలు బయటికి వచ్చాయి. దీంతో చాలామంది కార్మికుల శ్రమను కొనియాడుతున్నారు. ప్రశంసలు కురిపిస్తున్నారు. మన ఇంట్లో వెచ్చగా ఉంటూ.. విద్యుత్ కాంతుల మధ్య జీవితాన్ని కొనసాగిస్తున్నామంటే.. దాని వెనుక ఇటువంటి కార్మికుల శ్రమ ఉంటుందని చాలా మంది వ్యాఖ్యానిస్తున్నారు. మైనస్ పది డిగ్రీల చలిలో.. వందల అడుగుల ఎత్తులో వారు చేస్తున్న ఈ సాహసానికి నిజంగా హాట్సాఫ్ చెప్పాల్సిందే.

హైదరాబాద్ మెట్రో, ఆర్టీసీ కామన్ పాస్ ధరలను తగ్గించనున్న ప్రభుత్వం



హైదరాబాద్ : నగర ప్రయాణికులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పేందుకు సిద్ధమవుతోంది. మెట్రో రైలు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేందుకు ఇటీవల ప్రవేశపెట్టిన కామన్ పాస్ ధరలను భారీగా తగ్గించాలని నిర్ణయించింది. ప్రస్తుత ధరలు చాలా అధికంగా ఉన్నాయని ప్రయాణికుల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్ నేపథ్యంలో ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టింది. సవరించిన ధరలు దీపావళి నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ కామన్ పాస్ ధరలు ప్రయాణికులకు భారంగా మారాయి. రోజువారీ పాస్ కోసం రూ.400, నెలవారీ పాస్ కోసం ఏకంగా రూ.8,500 చెల్లించాల్సి వస్తోంది. దీంతో ఈ పాస్‌పై ప్రజల నుంచి ఆశించిన స్పందన రాలేదు. ఈ విషయాన్ని గుర్తించిన అధికారులు, ధరలను సవరించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. తాజా నివేదికల ప్రకారం రోజువారీ పాస్ ధరను రూ.400 నుంచి రూ.325కు తగ్గించనున్నారు. అదేవిధంగా, నెలవారీ పాస్ ధరను రూ.8,500 నుంచి సుమారు రూ.4,000-రూ.4,500 మధ్యకు తీసుకురావాలని భావిస్తున్నారు. ఇది అమలైతే నెలవారీ పాస్ ధర దాదాపు సగానికి తగ్గుతుంది. ఈ ఉమ్మడి పాస్‌ను అక్టోబర్ ప్రారంభంలో ప్రభుత్వం లాంఛనంగా ప్రారంభించింది. ఈ పాస్ ద్వారా ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) పరిధిలో మెట్రో రైళ్లు, ఆర్టీసీ సిటీ బస్సుల్లో (పుష్పక్ ఏసీ సర్వీసులు మినహా) అపరిమితంగా ప్రయాణించే సౌకర్యం ఉంటుంది. నగరంలో ప్రజారవాణాను ప్రోత్సహించి, ప్రైవేట్ వాహనాల వినియోగాన్ని తగ్గించాలనే లక్ష్యంతో ఈ పాస్‌ను ప్రవేశపెట్టారు. అయితే, ధరలు ఎక్కువగా ఉండటంతోఆలక్ష్యం నెరవేరలేదు. ధరల సవరణపై ఇప్పటికే మెట్రో, ఆర్టీసీ అధికారులు పలుమార్లు సమావేశమై చర్చలు జరిపారు. ప్రభుత్వ ఉన్నతాధికారులతోజరగనున్న తదుపరి సమావేశాల అనంతరం కొత్త ధరలపై పూర్తిస్పష్టత రానుంది. ఈనిర్ణయంతో కామన్ పాస్‌ను వినియోగించే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతుందని, నగరంలో ట్రాఫిక్ రద్దీ తగ్గడానికి ఇది దోహదపడుతుందని అధికారులు ఆశిస్తున్నారు.

22- ఏ రిజిస్ట్రేషన్లకు లైన్ క్లియర్

హైదరాబాద్, : తెలంగాణలో ఓపెన్ ప్లాట్లు, ఇళ్ల కొనుగోలు చేసి ఏళ్ల తరబడి నిషేధిత జాబితా చిక్కుముడుల్లో పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్న లక్షలాది మంది సామాన్యులకు, రియల్ ఎస్టేట్ వర్గాలకు ప్రభుత్వం ఊరటనిచ్చింది. దశాబ్దాల క్రితం లేఅవుట్ అనుమతులు పొంది, నాన్-నాలా నిబంధనలు కలిగిన ఆస్తులు సాంకేతిక లోపాలు , బేస్ సర్వే నంబర్ల బ్లాకింగ్ కారణంగా 22-ం నిషేధిత జాబితాలో నిలిచిపోవడంతో కొనుగోలుదారులు తీవ్ర నష్టపోయారు. ఈ సమస్యపై సమగ్ర విచారణ చేపట్టిన ప్రభుత్వం, చట్టబద్ధమైన అనుమతులు ఉన్న నాన్-నాలా ప్లాట్లు, ఇళ్ల క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్లకు ప్రత్యేక వెసులుబాటు కల్పిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది.రెవెన్యూ శాఖ జారీ చేసిన తాజా ఆదేశాల ప్రకారం.. జీహెచ్ఎంసీ , హెచ్ఎండీఏ , డీటీసీపీ , మున్సిపాలిటీలు , నిబంధనల ప్రకారం అనుమతులు పొందిన అప్రూవ్డ్ లేఅవుట్లకు సంబంధించిన ఆస్తులు 22-ం జాబితాలో ఉన్నప్పటికీ వాటి రిజిస్ట్రేషన్‌కు అనుమతిస్తారు. లింక్ డాక్యుమెంట్లు, బిల్డింగ్ లేదా లేఅవుట్ అనుమతి పత్రాలు పక్కాగా ఉన్న సందర్భాల్లో నిషేధిత జాబితా ఆంక్షలు వర్తించవు. ఈ నిర్ణయంతో రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరితో పాటు రాష్ట్రవ్యాప్తంగా 264కి పైగా కాలనీలు , లేఅవుట్లలో చిక్కుకుపోయిన ప్లాట్లకు రిజిస్ట్రేషన్ స్వేచ్ఛ లభించింది.అంతేకాకుండా, సాగు భూముల్లో గతంలో చేపట్టిన నిర్మాణాలకు సంబంధించిన అర్హమైన నాలా దరఖాస్తుల పరిష్కారానికి కూడా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. న్యాయ వివాదాలు లేని ఆస్తులకు నిర్ణీత నాలా రుసుముతో పాటు పారదర్శక నిబంధనలను వర్తింపజేస్తూ క్రమబద్ధీకరణ ప్రక్రియను వేగవంతం చేస్తారు. స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో దరఖాస్తుదారుల డాక్యుమెంట్లను డిజిటల్ డేటాతో సరిచూసి, ఆన్‌లైన్ వెరిఫికేషన్ పూర్తయిన వెంటనే బయోమెట్రిక్ విధానంలో వేగంగా డిజిటల్ రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేసేందుకు ఏర్పాట్లు చేశారు.ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఎక్కడైనా క్షేత్రస్థాయి సాంకేతిక ఇబ్బందులు లేదా శాఖల మధ్య వ్యత్యాసాలు ఎదురైతే వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు కలెక్టర్ల నేతృత్వంలో ప్రత్యేక 'జిల్లా స్థాయి కమ

ట్రంప్ ఓటమి.. ఓటమితో కుప్పకూలిన క్రూడాయిల్ ధరలు..!



న్యూయార్క్: అమెరికా మిడ్ టర్మ్స్ ఎన్నికల్లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని రిపబ్లికన్ల జోరుకు అడ్డుకట్ట పడింది. హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ (ప్రతినిధుల సభ), సెనేట్‌లో డెమోక్రాట్లు మెజార్టీ సాధించడంతో పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. ఇంటర్నేషనల్ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు భారీగా పడిపోయాయి బ్రెంట్ ముడి చమురు ధర బ్యారెల్‌కు ఏకంగా 118 డాలర్ల స్థాయిలో ఉండగా అది ఇప్పుడు 94 డాలర్ల మార్కు దిగొచ్చింది. ఈ క్రమంలో ఏకంగా 20 శాతానికిపైగా పడిపోవడం గమనార్హం. రాత్రి వేళనే ఏకంగా 10 శాతం పతనం అయ్యాయి. ఇప్పుడు గురువారం సెషన్ ఆరంభంలో కూడా ఇంకా పతనం అవుతూనే ఉంది. ఇది ఒక దశలో 93.46 డాలర్ల స్థాయి కనిష్ఠానికి పడిపోయింది.మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్లు గెలవడంతో ఇరాన్‌పై ట్రంప్ సైనిక చర్యలకు నిధుల కొరత ఏర్పడే అవకాశం ఉండటంతో, ఇరాన్ యుద్ధానికి త్వరలోనే ముగింపు పడనుందనే అంచనాలు మార్కెట్లో పెరిగాయి. దీంతో అమెరికా-ఇరాన్ శాంతి ఒప్పందం ఖరారు కావొచ్చని భావిస్తున్నారు. ఇదే ఉద్రిక్తతల్ని తగ్గించడంతో, చమురు సరఫరా వ్యవస్థలో కూడా అంతరాయాలు తొలగిపోతాయన్న అంచనాలు పెరిగాయి. దీంతో క్రూడాయిల్ ధరలు ఒక్కసారిగా పడిపోయాయి.ఇంకా ఎన్నికలకు ముందే ట్రంప్ దీనిపై కీలక వ్యాఖ్యలు కూడా చేశారు. ఇరాన్ ఒక ఒప్పందాన్ని కోరుకుంటోందని, తాము కూడా అందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. తాజాగా ఎన్నికల్లో ఓటమి నేపథ్యంలో సైనిక చర్యల కంటే ముందుగా దౌత్య మార్గాల ద్వారానే సమస్యను పరిష్కరించుకోవాలని చూస్తున్నట్లు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. యుద్ధాన్ని ముగించేందుకు ఖతార్ కూడా మధ్యవర్తిత్వం వహిస్తోంది. ఇటు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, సౌదీ, యూఏఈ, కువైట్, ఇరాక్ దేశాల ముడి చమురు ఎగుమతులన్నీ కలిపి అక్టోబరులో 10 శాతం పెరిగి రోజుకు 15.53 మిలియన్ బ్యారెళ్లకు చేరడం కూడా ధరల తగ్గుదలకు కారణమైంది. ఇదే మరిన్ని రోజులు కొనసాగితే దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు కూడా తగ్గే అవకాశాలు ఉంటాయని చెబుతున్నారు.

కాంగ్రెస్ లో నిధుల మంటలు!



మహబూబ్ నగర్, : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు అవుతున్నా పార్టీ అంతర్గత విభేదాలు మాత్రం నివురుగప్పిన నిప్పులా రగులుతూనే ఉన్నాయి. ఒకవైపు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మరోవైపు జడ్చర్ల ఎమ్మెల్యే జె. అనిరుధ్ రెడ్డి నేరుగా తమ సొంత ప్రభుత్వంపైనే అసంతృప్తి వ్యాఖ్యలు చేయడం, విమర్శల బాణాలు ఎక్కుపెట్టడం టీపీసీసీలో పెను దుమారం రేపుతోంది. ఇద్దరు ఎమ్మెల్యేల వేదన, ఆరోపణలు దాదాపు ఒకే తీరుగా ఉన్నాయి? నియోజకవర్గాలకు అభివృద్ధి నిధులు రావడం లేదు, మంత్రివర్గంలో తగిన ప్రాధాన్యత దక్కలేదు, నిధుల కోసం ప్రతిపక్ష ఎమ్మెల్యేల తరహాలోనే పోరాడాల్సి వస్తోంది అని వారు బహిరంగంగానే తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ అసంతృప్తి వెనుక కేవలం నిధులు, మంత్రి పదవుల ఆశలు మాత్రమే కాక టెండర్ల కేటాయింపుల్లో ప్రాధాన్యత దక్కకపోవడం కూడా ఉందనే ఆరోపణలు నడుస్తున్నాయి. హైదరాబాద్ రేడియల్ రోడ్ల టెండర్ల విషయంలో ఏపీకి చెందిన కాంట్రాక్టర్లకు ప్రాధాన్యత ఇస్తున్నారని, లోకల్ కాంట్రాక్టర్లను పక్కనబెట్టారని రాజగోపాల్ రెడ్డి నేరుగా సీఎంఓ నిఘా, టెండర్ల కేటాయింపులపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించడం కేడర్‌ను షాక్‌కు గురిచేసింది. మరోవైపు, జడ్చర్ల నియోజకవర్గంలో రోడ్డు, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు రాకపోవడం, ఫండ్స్ విడుదల కాకపోవడంతో అనిరుధ్ రెడ్డి ఆమరణ దీక్షకు హెచ్చరికలు జారీ చేసే దాకా పరిస్థితి దాటింది.అయితే, ఈ ఇద్దరి అసంతృప్తుల వెనుక పొలిటికల్ అజెండాలు ఉన్నాయనే భావనతో సీఎం రేవంత్ రెడ్డి, ఆయన కోటరీ దీనిని లైట్ తీసుకుంటున్నారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాజగోపాల్ రెడ్డికి సుదీర్ఘ రాజకీయ అనుభవం, కోమటిరెడ్డి బ్రదర్స్ ఇమేజ్ ఉన్నప్పటికీ, ఆయన గతంలో పార్టీ మారిన నేపథ్యం ఉండటంతో హైకమాండ్ వద్ద ఆయన ఒత్తిళ్లకు తలొగ్గకూడదని అధిష్ఠానం భావిస్తున్నట్లు సమాచారం. సీనియర్లకు పదవులు ఇస్తూ పోతే కొత్తగా వచ్చిన వారికి లేదా రేవంత్ విధేయులకు అవకాశాలు దక్కవనే వ్యూహంతోనే వీరి కామెంట్లను ప్రభుత్వం తీవ్రంగా పట్టించుకోకుండా ఉపేక్షిస్తున్నట్లు కనిపిస్తోంది. ఇక ఇద్దరు ప్రజాప్రతినిధులు రోడ్డెక్కి విమర్శలు చేస్తుంటే, వారికి సర్దిచెప్పడంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లేదా పార్టీ సీనియర్ నాయకత్వం విఫలమవుతోందనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. అసంతృప్త నేతలను పిలిచి మాట్లాడి క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించాల్సింది పోయి, అసమ్మతి వ్యాఖ్యలు చేస్తే చర్యలు ఉంటాయంటూ హెచ్చరికలు జారీ చేయడం మంటలపై నెయ్యి పోసినట్లు పనిచేస్తోంది. పార్టీ అంతర్గత సమావేశాల్లో చర్చించాల్సిన సమస్యలు మీడియా ముందుకు రావడం చూస్తుంటే, పీసీసీ అధ్యక్షుడికి , ఎమ్మెల్యేలకు మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే కాలంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అంతర్గత తిరుగుబాటు రూపంలో పెద్ద చికాకులు తప్పవు. ఇప్పుడు రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి ఓపెన్‌గా గళం విప్పుతుండటంతో, లోలోపల నిధులు రాక, హామీలు నెరవేర్చలేక సతమతమవుతున్న మరికొందరు అధికార పార్టీ ఎమ్మెల్యేలు కూడా వీరికి మద్దతుగా నిలిచే అవకాశాలు లేకపోలేదు. అసెంబ్లీలో మెజారిటీకి ముప్పు లేకపోయినప్పటికీ, స్వపక్ష ఎమ్మెల్యేలే రెబెల్స్ గా మారి అవినీతి, నిధుల మళ్లింపు ఆరోపణలు చేస్తే.. అది ప్రతిపక్షాలైన బిఆర్ఎస్, బిజెపిలకు ఉచితంగా పొలిటికల్ ఆయుధాలను అందించినట్లవుతుంది. స్థానిక ప్రజాప్రతినిధులకు నిధుల కొరత, ప్రాధాన్యతలేమి అనేది కేవలం ఇద్దరు ఎమ్మెల్యేలకే పరిమితమైన సమస్య కాదు. రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి అసంతృప్త నేతలతో సమావేశమై టెండర్లు, నిధుల విడుదల మరియు పదవుల భర్తీపై స్పష్టమైన భరోసా ఇవ్వకపోతే, ఈ చిన్న నిప్పు రాబోయే రోజుల్లో రేవంత్ సర్కార్ స్థిరత్వాన్ని, ఇమేజ్‌ను దెబ్బతీసే పెద్ద దావానలంగా మారే ప్రమాదం ఉంది.

తెలంగాణపై ఎల్‌నీనో ఎఫెక్ట్.. బోర్‌వెల్స్‌కు ఎన్‌వోసీ తప్పనిసరి



హైదరాబాద్: ఎల్‌నీనో పరిస్థితుల నేపథ్యంలో భూగర్భ జల మట్టాలు పడిపోకుండా చూడటం, లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో జల వనరులను సంరక్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తాగునీటి అవసరాలు తప్ప ఇతర పనులకు శుద్ధి చేసిన మురుగు నీటిని మాత్రమే వినియోగించాలని స్పష్టం చేస్తూ ప్రభుత్వం నూతన మార్గదర్శకాలు జారీ చేసింది. 2027 జులై చివరి వరకు అమల్లో ఉండేలా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జీవో 259 ద్వారా ఈ ఉత్తర్వులను జారీ చేశారు.

జీవో 259లోని ముఖ్యమైన నిబంధనలు

అపార్ట్‌మెంట్‌లు, గ్రూప్ హౌసింగ్ ప్రాజెక్టులు, వాణిజ్య-పారిశ్రామిక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ యూనిట్లు, బల్క్ వాటర్ సప్లైయిర్లు భూగర్భ జలాల వినియోగ నిబంధనలు-2023 ప్రకారం నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ పొందిన తర్వాతే

కొత్త బోర్లు తవ్వాల్సి ఉంటుంది. అనుమతులతో బోర్‌వెల్ తవ్వకం పూర్తి చేసిన 15 రోజుల్లోగా రిగ్ ఆపరేటర్ నిర్ణీత అధికారికి 'వెల్ కంప్లీషన్ రిపోర్ట్'ను సబ్మిట్ చేయాలి. ఆ బోర్‌వెల్‌ను సంబంధిత తహసీల్దార్ వద్ద తప్పనిసరిగా నమోదు చేయించాలి.

నిర్మాణ ప్రాజెక్టులు, తోటల పెంపకం, ల్యాండ్‌స్కేపింగ్, రోడ్ల శుభ్రత వంటి అవసరాలకు భూగర్భ జలాలను వాడకూడదు. జలమండలి అందుబాటులోకి తెచ్చిన శుద్ధి చేసిన మురుగు నీటిని మాత్రమే వినియోగించాలి.

భూగర్భ జలాలను అక్రమంగా వెలికితీసినా లేదా దుర్వినియోగం చేసినా 'వాల్టా' చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటారు.

ప్రతిఒక్కరూ వాననీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుద్ధరణ చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు.

భూగర్భజల శాఖ: నీటి కొరత తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి తగిన సంరక్షణ చర్యలు చేపట్టాలి.

మున్సిపల్ కార్పొరేషన్లు: భవన నిర్మాణ నిబంధనలకు అనుగుణంగా వర్షపు నీటి సంరక్షణ, ఇంకుడు గుంతల నిర్మాణాలను తప్పనిసరిగా అమలు చేయించాలి.హైడ్రా : చెరువులు, కుంటలు, నీటి రీఛార్జ్ ప్రాంతాలను ఆక్రమణలు, వ్యర్థాల డంపింగ్, కాలుష్యం నుంచి కాపాడాలి.మంచి నీటి సరఫరా పైప్‌లైన్ నెట్‌వర్క్‌లో లీకేజీలు, వృథాను అరికట్టడంతో పాటు కంటింజెన్సీ మానిటరింగ్ కమిటీకి ఎప్పటికప్పుడు సమగ్ర నివేదిక అందించాలి.

భూముల అమ్మకమే ఆదాయ మార్గమా?



హైదరాబాద్, : మియాపూర్‌లో 550 ఎకరాల ప్రభుత్వ భూములపై సుప్రీంకోర్టు తీర్పు తెలంగాణ ప్రభుత్వానికి భారీ విజయాన్ని అందించింది. సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత విలువైన ప్రభుత్వ భూములపై హక్కులను రాష్ట్రం తిరిగి సాధించుకుంది. అయితే ఈ భూములను విక్రయించి ప్రభుత్వ పాఠశాలలు, ఇందిరమ్మ ఇళ్లు, సాగునీటి ప్రాజెక్టులకు నిధులు సమకూరుస్తామంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన ఇప్పుడు కొత్త చర్చకు తెరలేపింది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన భూముల విక్రయ విధానాన్నే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కొనసాగిస్తోందా? అన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.తెలంగాణలో ప్రభుత్వ భూముల పరిరక్షణ, వాటి వినియోగం ఇప్పుడు రాజకీయంగా కీలక అంశంగా మారింది. మియాపూర్‌లోని 550 ఎకరాల విలువైన భూములపై సుప్రీంకోర్టు తీర్పు రావడం ప్రభుత్వానికి పెద్ద ఊరటనిచ్చింది. ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు న్యాయపోరాటం చేసిన రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించాల్సిందే. అయితే ఈ విజయం తర్వాత ఆ భూములను అమ్మి అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు సమకూర్చుకోవాలన్న రేవంత్ రెడ్డి ఆలోచన మాత్రం ఆర్థిక విధానంపై చర్చకు దారితీస్తోంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత బీఆర్ఎస్ ప్రభుత్వ భూకేటాయింపులపై తీవ్ర విమర్శలు చేస్తున్నారు. పద్మాలయ స్టూడియోస్, లాంకో హిల్స్ వంటి భూముల కేటాయింపుల విషయంలో కేసీఆర్, హరీశ్ రావు గతంలో అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ.. పదేళ్ల అధికారంలో వాటిని ఎందుకు వెనక్కి తీసుకోలేదని ప్రశ్నిస్తున్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు ఒక వైఖరి, అధికారంలోకి వచ్చిన తర్వాత మరో వైఖరి ఎందుకు అనుసరించారని నిలదీస్తున్నారు.అంతేకాకుండా కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్ సమీపంలో శ్రీకాంతాచారి అమరవీరుల కాలనీ ఏర్పాటు చేస్తామని రేవంత్ ప్రకటించారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు అందించాలన్నది ఈ ప్రతిపాదన లక్ష్యంగా పేర్కొన్నారు. ఎర్రవల్లి, షేర్ వెంకటాపూర్ గ్రామాల పరిధిలోని ప్రభుత్వ భూముల వ్యవహారంపైనా ముఖ్యమంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు.సర్వే నంబర్ 325లో మొత్తం 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, ఇప్పటివరకు 345 ఎకరాలను మాత్రమే గుర్తించారని, మరో 43 ఎకరాల ఆచూకీ తేలాల్సి ఉందని వెల్లడించారు. ఈ రెండు గ్రామాల్లో సమగ్ర భూ సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. భూమిలేని అర్హులైన పేదలకు పట్టాలు పంపిణీ చేస్తామని, ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అయితే ప్రభుత్వ భూములను విక్రయించి ఆదాయం సమకూర్చుకోవడం తెలంగాణలో కొత్త విధానం కాదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఇదే వ్యూహాన్ని అనుసరించింది. 2021 జూలైలో కోకాపేటలో దాదాపు 50 ఎకరాల భూములను వేలం వేయడం ద్వారా సుమారు రూ.2,000 కోట్ల ఆదాయం సమకూర్చుకుంది. 2023 ఆగస్టులో కోకాపేట, బుద్వేల్ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన భూముల వేలం ద్వారా సుమారు రూ.7,100 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేసింది.నియోపోలిస్ భూముల వేలం ద్వారా రూ.3,319.60 కోట్లు, బుద్వేల్ భూముల ద్వారా రూ.3,625.73 కోట్ల ఆదాయం లభించింది. అంతేకాకుండా ఔటర్ రింగ్ రోడ్డును టోల్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ విధానంలో ప్రైవేట్ సంస్థకు అప్పగించడం ద్వారా ప్రభుత్వం ముందస్తుగా రూ.7,380 కోట్ల ఆదాయాన్ని పొందింది. అంటే ప్రభుత్వ ఆస్తులను నగదుగా మార్చుకోవడం గత బీఆర్ఎస్ ప్రభుత్వ ఆర్థిక వ్యూహంలోనూ కీలక భాగంగా ఉంది.అయితే భూముల అమ్మకాల ద్వారా భారీ ఆదాయం వస్తుందని అంచనా వేసినా, ఆ అంచనాలను వాస్తవ ఆదాయంతో సరిపోల్చడంలో గత ప్రభుత్వం విఫలమైందని కాగ్ నివేదికలు తప్పుబట్టాయి. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల నివేదికలో భూములు, ఆస్తుల విక్రయాల ద్వారా వచ్చే ఆదాయంపై ప్రభుత్వం అధిక అంచనాలు వేసిందని కాగ్ ప్రస్తావించింది. గత అంచనాలు నెరవేరకపోయినా మళ్లీ భారీ ఆదాయ అంచనాలు చూపించడం ఆర్థిక నిర్వహణలో సమస్యలకు దారితీస్తుందని సూచించింది.ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. ప్రభుత్వ భూములు ఒక పరిమితమైన సంపద. ఒకసారి వాటిని విక్రయిస్తే తిరిగి ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావడం అంత సులభం కాదు. పాఠశాలల నిర్మాణం, సాగునీటి ప్రాజెక్టులు, పేదలకు ఇళ్ల నిర్మాణం వంటి కార్యక్రమాలు అత్యంత అవసరమైనవే. కానీ అలాంటి పథకాల కోసం ప్రభుత్వ భూములను విక్రయించడమే ప్రధాన ఆదాయ మార్గంగా మారితే భవిష్యత్తులో పరిస్థితి ఏమిటన్నది ఆలోచించాల్సిన అంశం.ముఖ్యంగా ఒకసారి వచ్చే భూముల అమ్మకాల ఆదాయాన్ని ప్రతి ఏడాది ఖర్చు చేయాల్సిన సంక్షేమ పథకాలకు ఉపయోగించడం ఆర్థికంగా ఎంతవరకు సమంజసం? ప్రభుత్వ పాఠశాలలు, సాగునీటి ప్రాజెక్టుల వంటి దీర్ఘకాలిక మౌలిక సదుపాయాల కల్పనకు ఆ నిధులను వినియోగించడం ఒక కోణమైతే, నిరంతరం ఖర్చు చేయాల్సిన పథకాలకు ఒకేసారి వచ్చే ఆదాయాన్ని ఆధారంగా చేసుకోవడం మరో కోణం. సంక్షేమ పథకాలకు ప్రతి సంవత్సరం స్థిరమైన ఆదాయ వనరులు అవసరం. భూముల అమ్మకాల ద్వారా వచ్చే డబ్బు ఎప్పటికీ అందుబాటులో ఉండదు.గత ప్రభుత్వ భూవ్యవహారాలను ప్రశ్నిస్తున్న రేవంత్ రెడ్డికి ఇప్పుడు తన విధానాన్ని నిరూపించుకునే అవకాశం ఉంది. మియాపూర్ భూములను విక్రయించాలని నిర్ణయిస్తే.. వాటి ద్వారా ఎంత ఆదాయం వస్తుంది? ఆ నిధులను ఏయే పథకాలకు కేటాయిస్తారు? వాటి వినియోగంపై ఎలాంటి పర్యవేక్షణ ఉంటుంది? భవిష్యత్తులో ప్రభుత్వ ఆస్తులు కరిగిపోకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటారు? వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికను ప్రజల ముందుంచాలి.ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తుల ఆక్రమణల నుంచి కాపాడటం ఎంత ముఖ్యమో, వాటిని భవిష్యత్తు తరాలకు అందుబాటులో ఉంచడం కూడా అంతే ముఖ్యం. మియాపూర్ భూములపై సుప్రీంకోర్టు తీర్పు ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు దక్కిన విజయం. ఆ విజయాన్ని మరో భూముల విక్రయానికి అవకాశంగా చూడటం మాత్రం సరైన విధానం కాకపోవచ్చు.కేసీఆర్ ప్రభుత్వం భూముల విక్రయాల ద్వారా ఆదాయం సమకూర్చుకునే విధానానికి బలమైన, దీర్ఘకాలిక ఆర్థిక ప్రత్యామ్నాయాన్ని చూపించలేకపోయిందన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పుడు అదే విధానాన్ని విమర్శిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో నడిస్తే తేడా ఏముంటుంది? రాజకీయ విమర్శలకు అతీతంగా ప్రజా ఆస్తుల నిర్వహణలో కొత్త ప్రమాణాలను నెలకొల్పాల్సిన బాధ్యత రేవంత్ ప్రభుత్వంపై ఉంది.ప్రభుత్వాలు భూములను అమ్మి తాత్కాలికంగా డబ్బు సమకూర్చుకోవడం కంటే, కొత్త సంపదను సృష్టించడం, ఆదాయ వనరులను పెంచడం, ప్రభుత్వ ఆస్తులను సమర్థంగా వినియోగించుకోవడంపై దృష్టి పెట్టాలి. రాజకీయ హామీల అమలు కోసం తరతరాల సంపదను విక్రయించడం తాత్కాలిక పరిష్కారమే తప్ప శాశ్వత ఆర్థిక విధానం కాదు. తెలంగాణ భవిష్యత్తు కోసం భూముల అమ్మకాల కంటే స్థిరమైన ఆదాయ మార్గాలే కీలకం.

తెలంగాణలో భారీగా మిగిలిపోయిన ఎంబీబీఎస్ సీట్లు



హైదరాబాద్, : హైదరాబాద్ కాళోజీ నారాయణరావు ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ద్వారా నిర్వహించిన నీట్-యూజీ 2026 కౌన్సెలింగ్ పలు విడతలుగా పూర్తయినప్పటికీ, రాష్ట్రంలోని ప్రైవేట్ వైద్య కళాశాలల్లో కనీసం 175 ఎంబీబీఎస్ సీట్లు ఖాళీగా మిగిలిపోయాయి. ఈ భర్తీ కాని సీట్లన్నీ ప్రైవేట్ కాలేజీల్లో మేనేజ్‌మెంట్ కోటా (కేటగిరీ-బి), ఎన్ఆర్ఐ కోటా (కేటగిరీ-సి) పరిధిలోనివే కావడం గమనార్హం. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఫీజులు చాలా తక్కువగా ఉండటం, డిమాండ్ ఎక్కువగా ఉండటంతో అక్కడ అన్ని సీట్లు భర్తీ అయ్యాయని జాయింట్ రిజిస్ట్రార్ జె. వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. ఇలా ప్రైవేట్ కాలేజీల్లో పెద్ద సంఖ్యలో సీట్లు మిగిలిపోవడం ఇదే తొలిసారి అని ఆయన పేర్కొన్నారు. ప్రైవేట్ కాలేజీలలో బి-కేటగిరీ సీట్లకు వార్షిక ఫీజు రూ.10 లక్షల నుంచి రూ.11 లక్షల వరకు ఉండగా, ఎన్ఆర్ఐ కోటాకు రూ.24 లక్షల నుండి రూ.25 లక్షల వరకు చెల్లించాల్సి వస్తోంది. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే ప్రైవేట్ యాజమాన్యాలు హాస్టల్ వసతి, ఇతర నిబంధనల పేరుతో అదనపు మొత్తాలను వసూలు చేస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. కేటగిరి-ఎ విద్యార్థుల నుంచి సైతం నిబంధనల ప్రకారం ఉన్న రూ.60,000 ఫీజుకు బదులుగా రూ.2.5 లక్షల నుండి రూ.3 లక్షల వరకు దండుకుంటున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంబీబీఎస్ పూర్తైన తర్వాత డ్యూటీ మెడికల్ ఆఫీసర్లుగా చేరే వైద్యులకు నెలకు రూ. 20,000 నుండి రూ. 30,000 మాత్రమే వేతనం లభిస్తోంది. పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేస్తే తప్ప మంచి అవకాశాలు లభించకపోవడం, మరోవైపు ఇంజినీరింగ్ అభ్యర్థులకు లక్షల రూపాయల ప్యాకేజీలు రావడం వైద్య రంగానికి పెద్ద సవాలుగా మారింది. రాష్ట్రంలో 10,000 కంటే ఎక్కువ ఎంబీబీఎస్ సీట్లు ఉండగా, వాటిలో 6,000 పైగా సీట్లు 29 ప్రైవేట్ కాలేజీల్లోనే ఉన్నాయి. ఎన్ఎమ్‌సీ ఇటీవల 2026-27 విద్యాసంవత్సరానికి మంజూరు చేసిన 1,010 అదనపు సీట్లలో ప్రైవేట్ రంగానికే 900 సీట్లు రావడం విశేషం. వైద్య విద్యపై విద్యార్థులకు ఆసక్తి తగ్గడం వల్ల ఈ సీట్లు ఖాళీగా మిగలలేదని, కేవలం ఆర్థిక భారం, ఇతర కారణాల వల్లే అర్హులైన విద్యార్థులు తమ కలలను వదులుకోవాల్సి వస్తోందని హెల్త్‌కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ కార్తీక్ నాగుల అభిప్రాయపడ్డారు. ప్రైవేట్ కాలేజీలు ఎందుకు ఫీజులను విపరీతంగా పెంచుతున్నాయో తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీ రెగ్యులేటరీ కమిటీ పునఃసమీక్షించాలని డిమాండ్ చేశారు.

రేవంత్ రెడ్డి వాటర్ డిప్లొమసీ ఉత్తర తెలంగాణ దాహార్తి తీర్చే బిగ్ స్కెచ్

అదిలాబాద్, :పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో అటకెక్కిన ప్రాణహిత?చేవెళ్ల ప్రాజెక్టులోని కీలకమైన తుమ్మిడిహట్టి బ్యారేజీని తిరిగి పట్టాలెక్కించేందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నారు. ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా ఆయన సరిహద్దు దౌత్యానికి శ్రీకారం చుట్టారు. బ్యారేజీ నిర్మాణంలో ప్రధాన అడ్డంకిగా మారిన 152 మీటర్ల ఎత్తు ప్రతిపాదనకు మహారాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆమోదం సాధించడమే ధ్యేయంగా రేవంత్ రెడ్డి ముంబై వేదికగా మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో సమావేశం నిర్వహించారు. . ఏళ్ల తరబడి కొలిక్కిరాని అంతర్రాష్ట్ర జలవివాదాన్ని పరిష్కరిచేందుకు..ఓ కమిటీని ఏర్పాటు చేయాలని రెండు రాష్ట్రాలు నిర్ణయించాయి. దీంతో ఓ అడుగు ముందుకు పడినట్లే అనుకోవచ్చు. గతంలో ఎస్సారెస్పీ కమాండ్ ఏరియాతో పాటు ఉత్తర తెలంగాణ ఎగువ ప్రాంతాలకు ప్రాణహిత జలాలను మళ్లించేందుకు ఉమ్మడి ఏపీలో 152 మీటర్ల ఎత్తుతో తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మించాలని సంకల్పించారు. అయితే, 152 మీటర్ల నీటిమట్టం వద్ద తమ రాష్ట్ర భూభాగంలో, ముఖ్యంగా గడ్చిరోలి జిల్లాలోని గిరిజన ప్రాంతాలు , అటవీ భూములు భారీగా ముంపునకు గురవుతాయని మహారాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసింది. దీనిని సాకుగా చూపిస్తూ నాటి కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టును తుమ్మిడిహట్టి నుంచి కాళేశ్వరం వద్దకు తరలించి, రీ-డిజైన్ పేరిట వేల కోట్ల రూపాయల వ్యయాన్ని పెంచేసింది. తుమ్మిడిహట్టి ఎత్తును 148 మీటర్లకు కుదించడం వల్ల ప్రాణహిత నది నుంచి రావాల్సిన సహజసిద్ధమైన గ్రావిటీ నీటి లభ్యత తగ్గడమే కాకుండా, పంపింగ్ భారం తీవ్రంగా పెరిగిందనే విమర్శలు వచ్చాయి.ప్రస్తుతం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ చారిత్రక పొరపాటును దిద్దుబాటు చేసేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ప్రతిపాదనలను సిద్ధం చేసింది.

భారత్‌ను అస్థిర పరిచేందుకు కుట్ర..!



న్యూఢిల్లీ: మన దేశానికి పొరుగున ఉన్న శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లో జెన్‌జీ ఉద్యమాలు రెజీమ్ చేంజ్ తీసుకొచ్చాయి. భారత్‌లో కూడా అలాంటి మార్పులు కావాలనే వాదనలు వినిపిస్తున్నాయి. శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్‌లలో ప్రభుత్వ మార్పులు, తిరుగుబాటు ఉద్యమాలతో పాలనా వ్యవస్థలు బలహీనపడ్డాయి. సామాజిక అసమతుల్యత పెరిగింది. ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు సహాయక చర్యలు, అంతర్జాతీయ సహకారం సమర్థవంతంగా నిర్వహించలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. నేపాల్‌లో ఇటీవలి వరదల సమయంలో సహాయం అందించడంలో విఫలతలు కనిపించాయి. పాలనా అనుభవం, సంస్థాగత సామర్థ్యం లోపం దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. అయినప్పటికీ కొన్ని వర్గాలు పాలకుల మార్పును లక్ష్యంగా పెట్టుకున్నట్లు కనిపిస్తోంది. దేశం అస్థిరపడితే ప్రాంతీయ శక్తులు, ముఖ్యంగా చైనా లాంటి దేశాలు లాభపడతాయనే అంచనాలు కొందరిలో ఉన్నట్లు చర్చలు జరుగుతున్నాయి. కొన్ని శక్తులు విదేశీ ప్రభావాలకు లోనై దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, లెబనాన్‌లాంటి అస్థిర దేశాల నమూనాను భారత్‌పై ప్రయోగించాలనే ఆలోచనలు ప్రమాదకరమని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. సామాజిక సామరస్యాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు, అల్లర్లు సృష్టించే ప్రయత్నాలు ఇందులో భాగంగా కనిపిస్తున్నాయిఎన్నికల సమయంలో లేదా అంతర్జాతీయ సదస్సులు జరుగుతున్నప్పుడు రైతు ఉద్యమాలు, సరిహద్దు ఆందోళనలు వంటివి తీవ్రరూపం దాల్చిన ఉదాహరణలు ఉన్నాయి. ఇప్పుడు బ్రిక్స్ వంటి కార్యక్రమాలను అడ్డుకునేందుకు కొత్త ఉద్యమాలు ప్రారంభం కాబోతున్నాయనే చర్చలు ఉన్నాయి. చిన్న సంఘటనలను పెద్దవిగా చిత్రీకరించి, వాటిని దేశవ్యాప్త అశాంతికి కారణంగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నట్లు కనిపిస్తోంది. బిహార్‌లో జరిగిన ఒక ఘటనను అతిగా ప్రచారం చేసి రాజకీయ లబ్ధి పొందాలనే ప్రయత్నాలు దీనికి ఉదాహరణ. అవాస్తవాలను నిజాలుగా చూపే ప్రమాదం ఉంది.ఏ దేశంలోనైనా ప్రభుత్వ మార్పు ప్రజాస్వామ్య మార్గంలోనే జరగాలి. హింసాత్మక తిరుగుబాట్లు, అస్థిరత సృష్టించే ప్రయత్నాలు దీర్ఘకాలిక నష్టాలకు దారితీస్తాయి. స్థిరమైన వ్యవస్థలు, బలమైన సంస్థలు ఉన్న దేశంలో అభివృద్ధి సాధ్యం అవుతుంది. అబద్ధాల ప్రచారం, చిన్న విషయాలను పెద్దవిగా చూపే ప్రయత్నాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. సామాజిక మాధ్యమాలు, రాజకీయ ప్రచారాలు ద్వారా వచ్చే సమాచారాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించాలి.

ఓట్ల చీలిక ఎవరికి దెబ్బ..!?



లక్నో : యూపీలో భారతీయ జనతా పార్టీ రాజకీయ ఆధిపత్యానికి మునుపెన్నడూ లేనంతగా సవాళ్లు ఎదురవుతున్నాయి. జాతీయ భద్రత, బలమైన కేంద్ర నాయకత్వం ప్రధాన అజెండాగా సాగిన లోక్‌సభ ఎన్నికల్లోనే యూపీ ఓటర్లు బీజేపీకి ఊహించని షాక్ ఇవ్వడం పార్టీకి మేల్కొలుపుగా మారింది. దాదాపు దశాబ్ద కాలంగా అధికారంలో ఉన్న యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని డబుల్ ఇంజిన్ సర్కార్‌పై పాలనాపరమైన అసంతృప్తి క్షేత్రస్థాయిలో విస్తరిస్తోందన్న సంకేతాలు వెలువడుతున్నాయి. జాతీయ నినాదాలే పూర్తిస్థాయిలో ప్రభావం చూపలేకపోయిన తరుణంలో, పూర్తిగా స్థానిక, సామాజిక అంశాల చుట్టూ తిరిగే అసెంబ్లీ సమరంలో కమలనాథులకు పెను పరీక్ష తప్పేలా లేదు.యోగి ప్రభుత్వంపై పెరుగుతున్న అసంతృప్తికి ప్రధానంగా నిరుద్యోగం, ప్రభుత్వ ఉద్యోగ పరీక్షల పేపర్ లీకేజీలు, వ్యవసాయ సంక్షోభం, పెరిగిపోయిన ద్రవ్యోల్బణం వంటి క్షేత్రస్థాయి సమస్యలే ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. వీటికితోడు శాంతిభద్రతల పేరిటజరిగిన కొన్ని కఠిన చర్యలు, బుల్డోజర్ న్యాయం కొన్ని సామాజిక వర్గాల్లో భయాందోళనలను, వ్యతిరేకతను పెంచాయి. ముఖ్యంగా ఓబీసీ, దళిత వర్గాలలో ప్రభుత్వ ప్రాధాన్యతలపై తలెత్తిన అనుమానాలు బీజేపీ సాంప్రదాయ ఓటు బ్యాంకులో చీలిక తెచ్చాయి. మరోవైపు ప్రభుత్వ యంత్రాంగం , పార్టీ క్యాడర్ మధ్య సమన్వయ లోపం, మంత్రులు–ఉపముఖ్యమంత్రుల మధ్య తలెత్తిన అంతర్గత విభేదాలు కూడా పాలనపై ప్రభావం చూపుతున్నాయి.ఈ రాజకీయ శూన్యతను సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ అత్యంత చాకచక్యంగా తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. గతంలో ఉన్న కేవలం యాదవ–ముస్లిం సమీకరణ పరిధిని దాటి, ఆయన ప్రయోగించిన పీడీఏ వెనుకబడిన, దళిత, మైనారిటీ వర్గాలు సామాజిక ఫార్ములా క్షేత్రస్థాయిలో విస్తృత ఆదరణ పొందుతోంది. రాజ్యాంగ పరిరక్షణ, కులగణన, రిజర్వేషన్ల హక్కుల పరిరక్షణను ప్రధాన అజెండాగా మార్చి అఖిలేష్ నిరంతరం ప్రజల్లో ఉండటం సమాజ్‌వాదీ పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది. బహుజన్ సమాజ్ పార్టీ ప్రభావం గణనీయంగా తగ్గడంతో, బీజేపీ వ్యతిరేక ఓటుకు ఎస్పీయే ఏకైక ప్రత్యామ్నాయంగా నిలవడం అఖిలేష్ రాజకీయ గ్రాఫ్‌ను భారీగా పెంచింది. అయితే రాబోయే రాజకీయ పోరులో బీజేపీని ఎదుర్కోవడం అఖిలేష్‌కు నల్లేరుపై నడకేమీ కాదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. యోగి ఆదిత్యనాథ్‌కు వ్యక్తిగతంగా ఉన్న బలమైన హిందుత్వ ఇమేజ్, బీజేపీకి ఉన్న పటిష్టమైన బూత్ స్థాయి నెట్‌వర్క్, కేంద్ర పథకాల లబ్ధిదారుల వర్గం ఇప్పటికీ కాషాయ పార్టీకి కొండంత అండగా ఉన్నాయి. లోక్‌సభ ఎదురుదెబ్బల తర్వాత బీజేపీ సైతం దిద్దుబాటు చర్యలు చేపడుతూ, నాన్–యాదవ్ ఓబీసీలు, దళిత వర్గాలను తిరిగి ఆకర్షించేందుకు వ్యూహాత్మక మార్పులు చేస్తోంది. అఖిలేష్ హవా కొనసాగుతున్నప్పటికీ, తీవ్రస్థాయికి చేరిన ప్రభుత్వ వ్యతిరేకతను తన సంకీర్ణ కూటమి ద్వారా అసెంబ్లీ సీట్లుగా ఎంతవరకు మలచగలరన్న దానిపైనే యూపీ తదుపరి రాజకీయ భవితవ్యం ఆధారపడి ఉంటుంది.

ఛేయూత పింఛన్ల కోసం దరఖాస్తులు

వరంగల్, : తెలంగాణ ప్రభుత్వం చేయూత పింఛన్లకు సంబంధించి మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం చేయూత పథకం కింద పింఛన్ పొందుతున్న భర్త మరణిస్తే వెంటనే భార్యకు పింఛన్ మంజూరు చేసే విధానం అమల్లో ఉంది. తాజాగా ఈ విధానాన్ని మరింతగా విస్తరించింది. ఇకపై దివ్యాంగులు, డయాలసిస్, హెచ్ఐవీ, హైలేరియా, గీత, చేనేత కార్మికుల పింఛనుదారులకూ కూడా ఈ విధానాన్ని వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.చేనేత, గీత కార్మికులు.. దివ్యాంగులు, ఇతర కేటగిరీల్లో పింఛను అందుకునే జీవిత భాగస్వామి చనిపోతే మహిళలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని గమనించిన ప్రభుత్వం.. వారికి అండగా నిలిచేందుకు తక్షణ పింఛను సాయం అందించాలని ప్రతిపాదనలు వచ్చాయి. ఈ ప్రతిపాదనలకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం రావడంతో ఉత్తర్వులు జారీ చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు.. దీంతో అధికారులు వెంటనే ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ చేయూత పథకం కింద పింఛన్లకు సంబంధించి కొన్ని మార్గదర్శకాలు కూడా ఉన్నాయి.దివ్యాంగ, గీత, చేనేత కార్మికులు సహా ఆయా కేటగిరీల కింద పింఛన్ పొందుతూ మరణించిన లబ్ధిదారుడి భార్య వయస్సు 57 ఏళ్ల కంటే తక్కువగా ఉంటే వితంతు పింఛను ఇస్తారు. ఒకవేళ 57 ఏళ్ల లేదా అంతకంటే ఎక్కువ వయసు ఉంటే వృద్ధాప్య పింఛను మంజూరు చేస్తారు. ఈ పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు 15 రోజుల్లోగా భార్య ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ, మరణించిన పింఛనుదారుడి ఆధార్ కార్డు, మరణ ధ్రువీకరణ పత్రం సమర్పించాల్సి ఉంటుంది.ఈ డాక్యుమెంట్లను గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శికి, పట్టణ ప్రాంతాల్లో బిల్ కలెక్టర్‌కు దరఖాస్తుతో పాటుగా అందజేయాలి. అనంతరం సంబంధిత అధికారులు ఈ పత్రాలను పరిశీలిస్తారు.. ఆ తర్వాత చేయూత పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్నవారి వివరాలు నమోదు చేసి అర్హత ధ్రువీకరించుకున్న తర్వాత పింఛన్ మంజూరు చేయనున్నారు. తెలంగాణ ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో ఎంతోమందికి ఊరట లభించనుంది.

చైనా, రష్యాపై గూఢచర్యం చేస్తున్నాం

వారికంటే మేమే బెటర్ : ట్రంప్



అమెరికా కూడా ఆ దేశాలపై గూఢచర్యం చేస్తున్నట్లు వెల్లడి ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని దెబ్బతీశామని వెల్లడి ఇరాన్‌తో చర్చలకు ఎవరూ ముందుకు రావడం లేదని వ్యాఖ్య యుద్ధం ముగిశాక చమురు ధరలు భారీగా తగ్గుతాయని అంచనా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్యంతర ఎన్నికల ప్రచారాన్ని ముగిస్తూ చైనా, రష్యాపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ దేశాలు అమెరికాపై నిఘా పెట్టినట్లే తాము కూడా వాటిపై నిఘా పెడుతున్నామని చెప్పారు. పైగా, వాటి కంటే మెరుగ్గా గూఢచర్యం చేయగలమని వ్యాఖ్యానించారు. ఇరాన్‌తో యుద్ధాన్ని సమర్థించుకున్నారు. ద్రవ్యోల్బణం తగ్గుతోందని, చమురు ధరలు కూడా దిగివస్తున్నాయని పేర్కొన్నారు. అమెరికాపై చైనా, రష్యా గూఢచర్యం చేస్తున్నాయన్న ఆందోళనలను ట్రంప్ తోసిపుచ్చారు. అయోవాలోని డుబుక్‌లో ఆదివారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడారు. చైనా, రష్యా అమెరికాపై నిఘా పెడుతున్నాయని తనకు తెలుసని చెప్పారు. తాము కూడా ఆ దేశాలపై నిఘా ఉంచుతున్నామని, ఈ విషయంలో తమదే పైచేయి అని వ్యాఖ్యానించారు. ఇరాన్ సైనిక సామర్థ్యాన్ని దెబ్బతీశామని ట్రంప్ పేర్కొన్నారు. ఆ దేశానికి రాడార్లు, వైమానిక రక్షణ ఆయుధాలు లేవని అన్నారు. నాయకులు కూడా లేకుండా చేశామని వ్యాఖ్యానించారు. చర్చలు జరిపేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని, అధ్యక్ష బాధ్యతలు చేపట్టేందుకు కూడా ఎవరూ సిద్ధంగా లేరని చెప్పారు. యుద్ధాన్ని తాము ప్రారంభించలేదని, ముగింపు దశకు తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. కాన్సస్‌లోని సలీనాలో జరిగిన మరో సభలో ట్రంప్ ఆర్థిక అంశాలపై మాట్లాడారు. గత మూడు నెలల్లో ద్రవ్యోల్బణం 1.7 శాతానికి తగ్గిందని తెలిపారు. మాజీ అధ్యక్షుడు జో బైడెన్ నుంచి అధిక ధరల సమస్యను వారసత్వంగా పొందానని, తాను దానికి కారణం కాదని అన్నారు. ఇరాన్ అణ్వాయుధాన్ని సంపాదించకుండా అడ్డుకున్నామని పేర్కొన్నారు. బరాక్ ఒబామా, బైడెన్ హయాంలతో పోలిస్తే ప్రస్తుతం చమురు ధరలు తక్కువగా ఉన్నాయని చెప్పారు. యుద్ధం ముగిసిన తర్వాత ధరలు భారీగా పడిపోతాయని అంచనా వేశారు. దేశ భద్రత, ప్రపంచ శాంతి కోసం ఇంధన ధరలు పెరగడం చిన్న మూల్యమేనని వ్యాఖ్యానించారు. అమెరికాలో మంగళవారం మధ్యంతర ఎన్నికలు జరగనున్నాయి. ప్రతినిధుల సభ, సెనెట్‌లపై ఆధిపత్యం కోసం ప్రధాన పార్టీల మధ్య పోటీ నెలకొంది. ఈ నేపథ్యంలో ట్రంప్ డుబుక్‌లో రెండు గంటలకు పైగా ప్రసంగించారు. అనంతరం సలీనాకు వెళ్లి చివరి ప్రచార సభలో పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో భారీ నకిలీ కరెన్సీ ముఠా గుట్టురట్టు

- రూ.6.78 కోట్ల నకిలీ నోట్లు స్వాధీనం.. నలుగురి అరెస్టు

హైదరాబాద్: నగరంలో భారీ నకిలీ కరెన్సీ ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఏకంగా రూ.6.78 కోట్ల విలువైన నకిలీ నోట్లను స్వాధీనం చేసుకుని, ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న నలుగురిని అరెస్టు చేశారు. మడుపోజు కర్ణాకర్, చిన్నోళ్ల మాణిక్య రెడ్డి, చెరుకుపెల్లి రత్నాకర్ రెడ్డి, కరణ అజయ్ కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.500 నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాకు చెందిన మరో ముగ్గురు పరారీలో ఉండటంతో వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. అందిన పక్కా సమాచారంతో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. రామోజీ ఫిల్మ్ సిటీ సమీపంలో అనుమానాస్పదంగా కనిపించిన కారును ఆపి తనిఖీ చేయగా, అందులో రూ.8 లక్షల విలువైన నకిలీ నోట్లు బయటపడ్డాయి. కారులో నకిలీ పోలీసు గుర్తింపు కార్డులు, బొమ్మ తుపాకీ, హ్యాండ్‌గన్‌లు, నాలుగు మొబైల్ ఫోన్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను విచారించగా హైదరాబాద్ సమీపంలోని కుంట్లూరులో నకిలీ నోట్ల తయారీ కేంద్రం నిర్వహిస్తున్నట్లు వెల్లడైంది. దీంతో అక్కడ తనిఖీలు చేపట్టిన పోలీసులు మరో రూ.6.70 కోట్ల విలువైన నకిలీ నోట్లను గుర్తించారు. నోట్ల తయారీకి ఉపయోగిస్తున్న ప్రింటర్లు, ల్యాప్‌టాప్, లామినేషన్ మెషీన్, పేపర్ కటింగ్ మెషీన్ తదితర పరికరాలను స్వాధీనం చేసుకున్నారు.

పోలీసుల విచారణలో ఈ ముఠా నకిలీ నోట్ల తయారీ కోసం యూట్యూబ్ వీడియోలు, సోషల్ మీడియాను ఆశ్రయించినట్లు వెల్లడైంది. అసలు నోట్లను స్కాన్ చేసి, కంప్యూటర్‌లో మార్పులు చేసి నకిలీ నోట్లను ముద్రించినట్లు పోలీసులు గుర్తించారు. మొదట నకిలీ నోట్లను నేరుగా మార్కెట్లో చలామణి చేసేందుకు ప్రయత్నించినప్పటికీ విఫలమయ్యారు. దీంతో ప్రజలను మోసం చేసేందుకు కొత్త పద్ధతిని ఎంచుకున్నారు. తక్కువ ధరకు ఎక్కువ మొత్తంలో నకిలీ నోట్లు ఇస్తామని ఆశ చూపుతూ వ్యక్తులను సంప్రదించేవారు.

నమ్మకం కలిగించేందుకు మొదట అసలు నోట్లను చూపించి, ఆ తర్వాత డబ్బులు తీసుకుని మోసానికి పాల్పడేవారు. ఈ మోసాలకు పోలీసుల పేరును కూడా ఉపయోగించుకున్నారు. నకిలీ నంబర్ ప్లేట్లు ఉన్న వాహనాల్లో తిరుగుతూ, తాము పోలీసు అధికారులమని నమ్మించేందుకు నకిలీ గుర్తింపు కార్డులు, మైక్రోఫోన్లు, బొమ్మ తుపాకులను వినియోగించేవారు. నకిలీ నోట్లు కొనుగోలు చేసేందుకు వచ్చిన వారిని పోలీసులమంటూ బెదిరించి, వారి వద్ద ఉన్న డబ్బును దోచుకుని పరారయ్యేవారు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు, షాద్‌నగర్ స్పెషల్ ఆపరేషన్స్ బృందం సంయుక్తంగా ఈ ముఠాను పట్టుకున్నాయి. పరారీలో ఉన్న మరో ముగ్గురి కోసం గాలింపు కొనసాగుతోందని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి వెల్లడించారు. ఈ నకిలీ కరెన్సీ తయారీ, మోసాల వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా అనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు.

జగిత్యాల చిన్నారి ఘటనలో ట్విస్ట్..

హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధించాలని కలెక్టర్ పిటిషన్



జగిత్యాల: 'అమ్మా.. నన్ను తీసుకెళ్లు.. భయమేస్తోంది' అంటూ శిశు సంక్షేమ కేంద్రంలో చిన్నారి రోదించిన వీడియోతో రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైన జగిత్యాల బాలుడి దత్తత వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల మేరకు చిన్నారిని పెంపుడు తల్లిదండ్రులకు అప్పగించినప్పటికీ వివాదం సద్దుమణగలేదు. బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించాలని ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గత ఉత్తర్వులపై స్టే విధించి, చిన్నారిని తిరిగి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ)కి అప్పగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని జంబిగద్దెకు చెందిన సరిత, శ్రీనివాస్‌గౌడ్ దంపతులకు సంతానం లేకపోవడంతో మూడేళ్ల క్రితం కోరుట్లకు చెందిన ఓ దంపతుల నుంచి నెల రోజుల వయసున్న శిశువును తీసుకుని పెంచుకుంటున్నారు. తల్లి మరణించిన ఆ చిన్నారిని తమ బిడ్డగానే భావిస్తూ అల్లారుముద్దుగా చూసుకుంటున్నారు. అయితే ఆస్తి తగాదాల నేపథ్యంలో శ్రీనివాస్‌గౌడ్ బంధువులు బాలుడి దత్తత చట్టబద్ధంగా జరగలేదని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు సెప్టెంబర్ 16న చిన్నారిని దంపతుల నుంచి తీసుకుని కరీంనగర్ శిశుగృహకు తరలించారు. దీంతో చిన్నారిని తమకు అప్పగించాలంటూ సరిత, శ్రీనివాస్ దంపతులు హైకోర్టును ఆశ్రయించారు. వారి పిటిషన్‌ను పరిశీలించిన న్యాయస్థానం అక్టోబర్ 16న బాలుడిని పెంపుడు తల్లిదండ్రులకు అప్పగించాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అయితే అప్పగింతలో జాప్యం జరగడంతో దంపతులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. శిశుగృహలో చిన్నారిని కలిసేందుకు వెళ్లిన సమయంలో 'డాడీ.. ఇంటికి తీసుకెళ్లు.. అమ్మా.. నన్ను తీసుకెళ్లు.. భయమేస్తోంది' అంటూ బాలుడు రోదించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ నేపథ్యంలో అధికారులు హైకోర్టు ఉత్తర్వులను అమలు చేసి చిన్నారిని దంపతులకు అప్పగించారు. దీంతో రెండు నెలలుగా బిడ్డకు దూరంగా ఉన్న ఆ దంపతుల ఇంట్లో ఆనందం నెలకొంది. హైకోర్టు ఉత్తర్వులపై కలెక్టర్ అభ్యంతరం: చిన్నారిని అప్పగించిన తర్వాత తాజాగా కలెక్టర్ సత్యప్రసాద్ హైకోర్టును ఆశ్రయించడం ఈ వ్యవహారంలో కొత్త మలుపుగా మారింది. సీడబ్ల్యూసీ నిబంధనలు, అధికారులు సమర్పించిన ఆధారాలను పూర్తిగా పరిశీలించకుండానే బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారని కలెక్టర్ తన పిటిషన్‌లో పేర్కొన్నట్లు సమాచారం. హిందూ సంప్రదాయం ప్రకారం దత్తత తీసుకున్నంత మాత్రాన దానిని చట్టబద్ధమైన దత్తత ప్రక్రియగా పరిగణించవచ్చా? అనే అంశాన్ని పరిశీలించాలని కోర్టును కోరారు. గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పునఃపరిశీలించే వరకు బాలుడిని తిరిగి శిశు సంక్షేమ కేంద్రానికి అప్పగించాలని కలెక్టర్ కోరారు. చిన్నారి తల్లిదండ్రుల వద్ద ఉంటే విచారణకు ఆటంకం కలిగే అవకాశం ఉందని పిటిషన్‌లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తూ ఇచ్చిన ఉత్తర్వులపై స్టే విధించాలని, చిన్నారిని తిరిగి సీడబ్ల్యూసీ సంరక్షణలోకి పంపాలని కోరుతూ కలెక్టర్‌తోపాటు సంబంధిత అధికారులు రిట్ పిటిషన్ దాఖలు చేశారు.

ఈఎస్ఐ హౌస్ కీపింగ్‌లో ఏం జరుగుతోంది..?



హైదరాబాద్: తెలంగాణలోని ఈఎస్ఐ ఆస్పత్రులు, డిస్పెన్సరీల్లో హౌస్ కీపింగ్, సెక్యూరిటీ సేవల ఖర్చు భారీగా పెరిగింది. ఈ సేవలకు చెల్లించే చార్జీలను ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ (ఐఎంఎస్) అధికారులు భారీగా పెంచడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2024లో చదరపు అడుగుకు రూ.10గా ఉన్న చార్జీని 2025లో రూ.25కు, తాజాగా రూ.49.50కు పెంచారు. కొన్ని చోట్ల అంతకంటే ఎక్కువ చెల్లింపులకు అనుమతులు ఇచ్చినట్లు సమాచారం. దీంతో గతేడాదితో పోలిస్తే 2026లో ఈ సేవలపై దాదాపు రూ.50 కోట్ల అదనపు భారం పడుతోంది. టెండర్లు నిర్వహించకుండా నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టులు అప్పగించడంపై కూడా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.అద్దె కంటే తొమ్మిది రెట్లు ఎక్కువ ఖర్చు ఖైరతాబాద్‌లో 3,060 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈఎస్ఐ డిస్పెన్సరీ అద్దె భవనంలో కొనసాగుతోంది. చదరపు అడుగుకు రూ.15 చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. జిల్లా కలెక్టర్ అధ్వర్యంలోని కమిటీ చదరపు అడుగుకు రూ.10 అద్దె చెల్లించాలని నిర్ణయించినప్పటికీ, భవనాల లభ్యత, డిమాండ్‌ను బట్టి యజమానితో చర్చించి అద్దెను ఖరారు చేశారు. దీంతో ప్రభుత్వం నెలకు దాదాపు రూ.45,900 చెల్లిస్తోంది. కేన్సర్ చికిత్సలో కొత్త ప్రయోగాలు అయితే, ఇదే భవనంలో హౌస్ కీపింగ్, సెక్యూరిటీ సేవల కోసం నెలకు దాదాపు రూ.4.15 లక్షలు ఖర్చు చేస్తుండటం గమనార్హం. భవనం అద్దెతో పోలిస్తే ఈ వ్యయం తొమ్మిది రెట్లు ఎక్కువ. హౌస్ కీపింగ్‌కు చదరపు అడుగుకు రూ.70.49, సెక్యూరిటీ సేవలకు రూ.65.17 చొప్పున చెల్లిస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. హైదరాబాద్ జిల్లా పరిధిలోని ఇతర డిస్పెన్సరీల్లోనూ ఇదే తరహాలో అధిక వ్యయం చేస్తున్నట్లు ఐఎంఎస్ లెక్కలు సూచిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా నాలుగు ప్రాంతీయ ఈఎస్ఐ ఆస్పత్రులు, రెండు డయాగ్నొస్టిక్ కేంద్రాలు, 71 డిస్పెన్సరీలు ఉన్నాయి. వీటిలో 53 డిస్పెన్సరీలు హైదరాబాద్ రీజియన్ పరిధిలో, 18 వరంగల్ రీజియన్ పరిధిలో ఉన్నాయి. రాష్ట్రంలో 21 లక్షల మంది ఈఎస్ఐ చందాదారులు ఉండగా, వారి కుటుంబసభ్యులతో కలిపి 90 లక్షల నుంచి కోటి మంది వరకు వైద్య సేవలు పొందుతున్నారు

చార్జీలు పెరిగినా ఉద్యోగులకు అందని ప్రయోజనం ఈఎస్ఐ ఆస్పత్రులు, డిస్పెన్సరీల్లో హౌస్ కీపింగ్, సెక్యూరిటీ సేవల బాధ్యతలను ఐఎంఎస్ డైరెక్టరేట్ పర్యవేక్షిస్తోంది. కాంట్రాక్టర్ల ఎంపిక, ధరల నిర్ణయం, బిల్లుల చెల్లింపులు ఈ విభాగం పరిధిలోనే జరుగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 8,78,455 చదరపు అడుగుల విస్తీర్ణానికి ఈ సేవలు అందించాల్సి ఉంది. హౌస్ కీపింగ్, సెక్యూరిటీ సేవల చార్జీని చదరపు అడుగుకు రూ.49.50కు పెంచుతూ ఐఎంఎస్ డైరెక్టర్ ఈ నెల 15న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ధరలకు జీఎస్టీ అదనం. 2028 జనవరి నుంచి డిసెంబర్ వరకు ఈ ధరలు అమల్లో ఉంటాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే, కొన్ని ప్రాంతాల్లో హౌస్ కీపింగ్‌కు చదరపు అడుగుకు రూ.70.15 వరకు చెల్లిస్తున్నట్లు సమాచారం. ఖైరతాబాద్‌లో ఈ మొత్తం రూ.70.49గా ఉంది 2020 నుంచి చదరపు అడుగుకు రూ.10 చొప్పునే చెల్లిస్తున్నారంటూ సీఎం ప్రజావాణికి పలువురు వినతులు సమర్పించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, సంస్థలు చార్జీలు పెంచాలని కోరడంతో 2025 మేలో చదరపు అడుగుకు రూ.25 చెల్లించేలా ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. తాజాగా ఈ మొత్తాన్ని రూ.49.50కు పెంచారు.

కొన్ని చోట్ల అంతకంటే ఎక్కువ చెల్లించేందుకు కూడా అనుమతులు ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే, చార్జీలు పెరిగినా ఉద్యోగులకు పెద్దగా ప్రయోజనం కలగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. చాలాచోట్ల హౌస్ కీపింగ్, సెక్యూరిటీ సిబ్బందికి నెలకు రూ.12 వేల నుంచి రూ.15 వేల మధ్యే వేతనాలు చెల్లిస్తున్నారు. చార్జీల పెంపుతో ఉద్యోగులకు కనీసం రూ.35 వేలకు పైగా వేతనం అందాల్సి ఉన్నప్పటికీ, ఆ ప్రయోజనం కాంట్రాక్టర్లకే దక్కుతోందనే ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు, ఉద్యోగులకు సంబంధించిన ఈఎస్ఐ, ఈపీఎఫ్ నిధులు నెలల తరబడి జమ కావడం లేదని సమాచారం. ఈ సమస్యపై నాచారం ప్రాంతీయ ఆస్పత్రిలో ఉద్యోగులు గత వారం మూడు వారాల పాటు నిరసనలు, ఆందోళనలు చేపట్టినట్లు కథనంలో పేర్కొన్నారు. నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టుల అప్పగింత ప్రభుత్వ శాఖల్లో రూ.5 లక్షలు దాటిన పనులకు టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లను ఎంపిక చేయాల్సి ఉంటుందని కథనం పేర్కొంది. అయితే, ఐఎంఎస్‌లో కోట్ల రూపాయల విలువైన హౌస్ కీపింగ్, సెక్యూరిటీ పనులను టెండర్లు లేకుండానే నామినేషన్ పద్ధతిలో కొన్ని సంస్థలకు అప్పగించినట్లు ఆరోపణలు ఉన్నాయి. చార్జీల పెంపు, కాంట్రాక్టర్ల ఎంపిక, బిల్లుల చెల్లింపుల వెనుక ముడుపుల వ్యవహారం ఉందంటూ కార్మిక వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

ఉల్లిగడ్డ పొట్టులో ఉన్న లాభాలు...!



ఉల్లిపాయ పొట్టుతో ఎన్నో లాభాలున్నాయి. సాధారణంగా మనం ఇవి పనికిరావని భావించి పారవేస్తాం. కానీ ఈ ఉల్లిపాయ పొట్టు లేదా తొక్కలు ఇంటి పనుల్లో, అందం సంరక్షణలో, తోటపనుల్లో చాలా ఉపయోగపడతాయి. ఉల్లిపాయ పొట్టులో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, అనేక పోషకాలు ఉంటాయి. అందుకే ఇవి ఆరోగ్యానికి, రోజువారీ ఉపయోగాలకు సహాయపడతాయి. ప్రతిరోజూ వంటగదిలో చాలా కూరగాయలు, పండ్ల తొక్కలు, ఇతర వ్యర్థాలు జమ అవుతాయి. చాలామంది వాటిని పనికిరావని భావించి చెత్తబుట్టలో వేస్తారు. కానీ, నిజానికి వాటిలో కూడా అనేక ప్రయోజనాలు దాగి ఉంటాయి. అలాంటివాటిలో ఉల్లిపాయ పొట్టు కూడా ఒకటి. సాధారణంగా మనం ఇవి పనికిరావని భావించి పారవేస్తాం. కానీ ఈ ఉల్లిపాయ పొట్టు లేదా తొక్కలు ఇంటి పనుల్లో, అందం సంరక్షణలో, తోటపనుల్లో చాలా ఉపయోగపడతాయి. ఉల్లిపాయ పొట్టులో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, అనేక పోషకాలు ఉంటాయి. అందుకే ఇవి ఆరోగ్యానికి, రోజువారీ ఉపయోగాలకు సహాయపడతాయి. 1. సహజ ఎరువుగా.. ఉల్లిపాయ తొక్కలను సహజ ఎరువుగా ఉపయోగించవచ్చు. ఇవి మొక్కల పెరుగుదలకు సహాయపడతాయి. తొక్కలను నీటిలో నానబెట్టి ఆ నీటిని మొక్కలకు పోస్తే ఆకులు పచ్చగా, ఆరోగ్యంగా పెరుగుతాయి. 2. జుట్టు సంరక్షణకు.. ఉల్లిపాయ తొక్కలు జుట్టుకు కూడా ఎంతో మేలు చేస్తాయి. ఒక గిన్నెలో నీరు తీసుకుని ఉల్లిపాయ తొక్కలను వేసి మరిగించాలి. చల్లారిన తర్వాత ఆ నీటిని జుట్టుకు అప్లై చేయడం వల్ల జుట్టు మెరిసేలా, బలంగా, మందంగా మారుతుంది. 3. టీగా.. కొంతమందికి మాత్రమే తెలిసిన విషయం ఏమిటంటే.. ఉల్లిపాయ తొక్కలతో టీ కూడా తయారు చేయవచ్చు. ఈ టీ తాగడం వల్ల ఊబకాయం తగ్గడంలో సహాయపడుతుంది. అలాగే అలెర్జీలు, ఇన్ఫెక్షన్లు, అధిక రక్తపోటు సమస్యల నుంచి ఉపశమనం పొందడంలో కూడా ఉపయోగపడుతుంది. 4. చర్మ సంరక్షణకు.. ఉల్లిపాయ తొక్కలలో ఉండే యాంటీఆక్సిడెంట్లు చర్మానికి మేలు చేస్తాయి. తొక్కలను నీటిలో మరిగించి, చల్లారిన తర్వాత ఆ నీటిని చర్మానికి అప్లై చేస్తే చర్మం తాజాగా కనిపిస్తుంది. ఉల్లిపాయ తొక్కలను ఇంటి శుభ్రపరచడంలో కూడా ఉపయోగించవచ్చు. తొక్కలను నీటిలో మరిగించి ఆ నీటితో వంటగదిని లేదా ఇంటిని శుభ్రం చేస్తే దుర్వాసనలు తొలగిపోతాయి. దీనిని ప్రతిరోజూ కూడా ఉపయోగించవచ్చు.

వ్యాయామం చేయకుండానే బరువు తగ్గొచ్చు!

నేటి కాలంలో చక్కెర లేనిదే మన రోజు గడవదు. ఉదయం తాగే టీ, కాఫీ నుంచి రాత్రి తినే స్వీట్ల వరకు ప్రతి దాంట్లోనూ పంచదార ఒక అంతర్భాగమైపోయింది. అయితే, ఈ తీపి పదార్థాలు శరీరానికి చేసే నష్టం అంతా ఇంతా కాదు. అధిక బరువు,
టైప్-2 డయాబెటిస్, గుండె సంబంధిత సమస్యలు మరియు దంత క్షయానికి చక్కెర ప్రధాన కారణం. మరి కేవలం ఆహారంలో చక్కెరను పక్కన పెడితే ఎంత బరువు తగ్గొచ్చో తెలుసా? బరువు తగ్గాలని కఠినమైన వర్కౌట్లు చేస్తున్నా ఫలితం రావడం లేదా? అయితే మీరు తీసుకునే తీపి పదార్థాలపై ఒక్కసారి కన్నేయండి.
డాక్టర్ సుధీర్ కుమార్ ఒక 40 ఏళ్ల వ్యక్తిని ఉదాహరణగా తీసుకుని ఈ లెక్కలు వివరించారు. కేవలం పైన చెప్పిన ఆహార పదార్థాలను మానేయడం ద్వారా, సదరు వ్యక్తి నెలకు సుమారు 1.5 కిలోల బరువు తగ్గుతారని డాక్టర్ సుధీర్ కుమార్ తెలిపారు. ఏ విధమైన కొత్త వ్యాయామాలు చేయకుండానే ఏడాదికి సుమారు 18 కిలోల బరువు తగ్గే అవకాశం ఉంటుంది. లిక్విడ్ క్యాలరీల
(సాఫ్ట్ డ్రింక్స్, జ్యూస్) వల్ల కడుపు నిండిన అనుభూతి కలగదు. వీటిని చాలా త్వరగా తాగేయొచ్చు, దీనివల్ల మనం తెలియకుండానే ఎక్కువ క్యాలరీలను శరీరానికి ఇస్తాం.
అందుకే ఇవి బరువు పెరగడానికి, డయాబెటిస్ మరియు ఫ్యాటీ లివర్ వ్యాధి రావడానికి ప్రధాన కారణమవుతున్నాయి. బయట దొరికే ఆహార పదార్థాలు కొనేముందు వాటిపై ఉండే న్యూట్రిషన్ లేబుల్స్ చదవండి. సాధ్యమైనంత వరకు సహజమైన వండ్లనే తినండి, రసాలు కాదు.చక్కెరను తగ్గించడం వల్ల శరీరంలో ఎనర్జీ లెవల్స్ కూడా బ్యాలెన్స్‌డ్‌గా ఉంటాయి. చక్కెరను మానేయడం అనేది కేవలం బరువు తగ్గడానికే కాదు, దీర్ఘకాలిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కూడా ఎంతో ముఖ్యం. అయితే ఈ లెక్కలు అందరికీ ఒకేలా ఉండకపోవచ్చు. కాబట్టి మీ వయస్సు, ఆరోగ్య స్థితిని బట్టి సరైన డైట్ ప్లాన్ కోసం నిపుణులను సంప్రదించడం మంచిది.



వేసవిలో బొప్పాయి తింటే..!



బొప్పాయి పండు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఈ పండులో విటమిన్లు ఎ, సి, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ముఖ్యంగా వేసవిలో ఈ పండు తినడం శరీరాన్ని చాలా చల్లగా ఉంచుతుంది. అందుకే చాలా మంది ఈ పండును తీసుకుంటారు. కానీ బొప్పాయి పండు తినడానికి ఎప్పుడు ఉత్తమ సమయమో చాలా మందికి తెలియదు. బొప్పాయి పండు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఈ పండులో విటమిన్లు ఎ, సి, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ముఖ్యంగా వేసవిలో ఈ పండు తినడం శరీరాన్ని చాలా చల్లగా ఉంచుతుంది. అందుకే చాలా మంది ఈ పండును తీసుకుంటారు. కానీ బొప్పాయి పండు తినడానికి ఎప్పుడు ఉత్తమ సమయమో చాలా మందికి తెలియదు. బొప్పాయిలో కార్బోహైడ్రేట్లు, ఫైబర్, ప్రోటీన్, విటమిన్ సి, విటమిన్ ఎ, విటమిన్ బి9, పొటాషియం, మెగ్నీషియం, కాల్షియం, విటమిన్ బి1, విటమిన్ బి3, విటమిన్ బి5, విటమిన్ ఇ, విటమిన్ కె వంటి ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి జీర్ణక్రియ, జుట్టు, చర్మానికి మేలు చేస్తాయి. ఉదయం ఖాళీ కడుపుతో లేదా అల్పాహారం సమయంలో బొప్పాయి పండును తినడం ఉత్తమం. ఇది రోజంతా జీర్ణవ్యవస్థలో సమతుల్యతను కాపాడుకోవడానికి సహాయపడుతుంది. అలాగే, బొప్పాయి ప్రేగులను నిర్విషీకరణ చేస్తుంది కాబట్టి, రాత్రిపూట కూడా తినవచ్చు. కానీ భోజనం తర్వాత కనీసం 3 నుంచి 4 గంటల వరకు పండ్లు తినకుండా జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే భోజనం చేసిన వెంటనే తినడం వల్ల జీర్ణవ్యవస్థకు అంతరాయం కలుగుతుంది. బొప్పాయిలో పపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది ప్రోటీన్‌ను జీర్ణం చేయడంలో సహాయపడుతుంది. అల్పాహారంగా బొప్పాయి తినడం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. మలబద్ధకం, గ్యాస్, ఆమ్లత్వం వంటి సమస్యలను నివారిస్తుంది. బొప్పాయిలో ఫైబర్ కూడా పుష్కలంగా ఉంటుంది. ఇది పేగులను శుభ్రపరుస్తుంది. కడుపును తేలికగా ఉంచుతుంది. రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. బొప్పాయి విటమిన్ సి రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. ఉదయం ఖాళీ కడుపుతో బొప్పాయి తినడం వల్ల శరీరానికి ఇన్ఫెక్షన్లు, వ్యాధులతో పోరాడటానికి శక్తి లభిస్తుంది. ఇది జలుబు, వైరల్ ఇన్ఫెక్షన్లు, ఇతర వ్యాధుల నుండి రక్షించడంలోనూ సహాయపడుతుంది. బొప్పాయి పండు ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఈ పండులో విటమిన్లు ఎ, సి, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ముఖ్యంగా వేసవిలో ఈ పండు తినడం శరీరాన్ని చాలా చల్లగా ఉంచుతుంది. అందుకే చాలా మంది ఈ పండును తీసుకుంటారు.

మధ్యాహ్నం నిద్రపోతే శరీరంలో ఏం జరుగుతుంది?



చాలా మందికి మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత కాసేపు అలా కనుకు తీయడం అలవాటు. కొందరు దీన్ని సోమరితనంగా భావిస్తే మరికొందరు అలసటను తగ్గించుకునే మార్గంగా చూస్తారు. అయితే మధ్యాహ్నం నిద్ర అందరికీ ఒకేలా పని చేయదని, అది మనం నిద్రపోయే సమయం, వ్యవధిపై ఆధారపడి ఉంటుందని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఢిల్లీకి చెందిన డాక్టర్ అజయ్ కుమార్ విశ్లేషణ ప్రకారం.. మధ్యాహ్నం పూట 20 నుండి 30 నిమిషాల చిన్న విశ్రాంతి వల్ల పని సామర్థ్యం, ఏకాగ్రత మెరుగుపడతాయి. రాత్రి నిద్ర సరిగ్గా లేని వారికి లేదా శారీరక శ్రమ అధికంగా చేసే వారికి ఈ చిన్న నిద్ర రీచార్జ్‌లా పనిచేస్తుంది. మనస్సును ప్రశాంతంగా ఉంచి, మిగిలిన రోజంతా ఉత్సాహంగా గడిపేలా చేస్తుంది. గంట దాటితే ముప్పే:
మధ్యాహ్నం నిద్ర ప్రయోజనకరమే అయినప్పటికీ అది గంట దాటితే మాత్రం అనర్థాలు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గంట కంటే ఎక్కువ నిద్రపోతే లేచిన తర్వాత తలనొప్పి, బద్ధకం, శరీరం బరువుగా అనిపించడం వంటి సమస్యలు వస్తాయి.

పాన్ ఇండియా మూవీలో మమిత...



'ప్రేమలు' సినిమాతో ఓవర్ నైట్ స్టార్‌గా మారిపోయి యూత్‌తో పాటు ఫ్యామిలీ ఆడియన్స్‌లో కూడా ఫుల్ క్రేజ్ తెచ్చుకుంది యంగ్ బ్యూటీ మమితా బైజు. ఈ మలయాళ ముద్దుగుమ్మ యాక్టింగ్‌తో పాటు తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో కుర్రకారు హృదయాలను దోచుకుంది. దీంతో వరుస ఆఫర్లు దక్కించుకోవడమే కాకుండా.. బ్యాక్ టు బ్యాక్ హిట్స్ తన ఖాతాలో వేసుకుంది. ఈ క్రమంలోనే ఈ అమ్మడు నటించిన విశ్వనాథ్ అండ్ సన్స్, జన నాయగన్, బెత్లెహెం కుటుంబ యూనట్ వంటి చిత్రాలు బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్స్ రాబట్టి మమితకు గోల్డెన్ లెగ్ పేరును తెచ్చిపెట్టాయి. ఇందులో భాగంగానే తాజాగా మమిత ఖాతాలో మరో పాన్ ఇండియా ప్రాజెక్ట్ చేరినట్లు తెలుస్తుంది. 2024లో వచ్చి సంచలన బ్లాక్‌బస్టర్ 'హనుమాన్' చిత్రానికి సీక్వెల్‌గా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కుతున్న హై-బడ్జెట్ మైథలాజికల్ సూపర్ హీరో యాక్షన్ చిత్రం 'జై-హనుమాన్'. 'ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్' లో భాగంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతోన్న ఈ చిత్రంలో 'కాంతార' ఫేమ్ రిషబ్ శెట్టి హనుమంతుడి పాత్రలో కనిపించబోతుండగా.. ఇందులో కీలకమైన పాత్ర కోసం మమితా బైజును సంప్రదించారట మేకర్స్. ఇప్పటికే కథ చర్చలు జరిగి మమిత కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చి ఈ పాన్-ఇండియా మైథలాజికల్ యూనివర్స్‌లోకి అడుగు పెట్టినట్లు సమాచారం. ఈ పాత్రపై అధికారిక ప్రకటన రానప్పటికీ ప్రజెంట్ ఇందుకు సంబంధించిన పోస్టులు వైరల్ కావడంతో ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నచ్చితే అమ్మాయిని అయినా పెళ్లి చేసుకుంటా!

– నటి, సింగర్ స్నిగ్ధ నయని

'అలా మొదలైంది' సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి మంచి పాపులారిటీ సంపాదించుకున్న నటి, సింగర్ స్నిగ్ధ నయని తాజాగా చేసిన వ్యాఖ్యలు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉంటున్న ఆమె.. సింగింగ్ షోలతో పాటు సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్‌గా ఉంటున్నారు. అయితే ఇటీవల ఆమె ఓ అమ్మాయితో కలిసి పెళ్లి చేసుకున్నట్లుగా సోషల్ మీడియాలో ఓ వీడియోను షేర్ చేయడం పెద్ద సంచలనంగా మారింది. అంతేకాకుండా హనీమూన్‌కి కూడా వెళ్లడంతో ఆ వీడియోలు కాస్త వైరల్ కావడంతో నెటిజన్లు ఆమె నిజంగానే వివాహం చేసుకున్నారంటూ రకరకాలుగా చర్చించుకున్నారు. ఈ నేపథ్యంలో, తాజాగా ఒక యూట్యూబ్ చానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో స్నిగ్ధ ఈ పెళ్లి రూమర్లపై స్పందిస్తూ అసలు నిజం బయటపెట్టారు. కేవలం సరదాగా రీల్స్ కోసం మాత్రమే ఆ వీడియో చేశానని, కానీ అందరూ దానిని నిజమైన పెళ్లి అనుకుని పొరబడ్డారని ఆమె స్పష్టం చేశారు. ఈ వీడియో చూసి తన బంధువులు కూడా నిజమేనని నమ్మి తనకు వరుసగా ఫోన్లు చేశారని గుర్తు చేసుకున్నారు. తమకు చెప్పకుండా రహస్యంగా పెళ్లి ఎందుకు చేసుకున్నావని బంధువులు నిలదీసినట్లు ఆమె తెలిపారు. ప్రస్తుతానికి తాను లెస్బియన్ కాదని, అమ్మాయినేనని క్లారిటీ ఇచ్చారు.



'కరికాల' అద్భుత ప్రపంచంలోకి కేథరిన్



సుబ్బు' వంటి సినిమాలతో ప్రేక్షకులను అలరించారు. ఇక ఇప్పుడు ఆయన ప్రధాన పాత్రలో 'కరికాల' అనే భారీ ఫాంటసీ అడ్వెంచర్ మూవీ తెరకెక్కుతోంది. 'శంబాల' సినిమాతో హ్యాట్రిక్ హిట్ కొట్టిన డైరెక్టర్ యుగంధర్ ముని ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై సోషియో ఫాంటసీ డ్రామాగా వస్తున్న ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో రెండు భాగాలుగా విడుదల చేయనున్నారు. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో 'కరికాల: చాప్టర్ 1'ను 2027 జూలై 2న, అలాగే 'కరికాల: చాప్టర్ 2'ను 2027 అక్టోబర్ 28న థియేటర్లలోకి తీసుకురాబోతున్నట్లు చిత్ర బృందం ఇప్పటికే ప్రకటించింది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ బిగ్ ప్రాజెక్ట్‌లోకి తాజాగా ఓ హాట్ బ్యూటీ ఎంట్రీ ఇచ్చింది. ఈ చిత్రంలో గ్లామరస్ నటి కేథరిన్ నటిస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. 'శంబాల'సినిమాతో హ్యాట్రిక్ హిట్ కొట్టిన డైరెక్టర్ యుగంధర్ ముని ఈ చిత్రాన్నిఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై సోషియో ఫాంటసీ డ్రామాగా వస్తున్న ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో రెండు భాగాలుగా విడుదల చేయనున్నారు. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో 'కరికాల: చాప్టర్ 1'ను 2027 జూలై 2న,అలాగే 'కరికాల: చాప్టర్ 2'ను 2027 అక్టోబర్28నథియేటర్లలోకి తీసుకురాబోతున్నట్లు చిత్ర బృందం ఇప్పటికే ప్రకటించింది.'కరికాల అద్భుతప్రపంచంలోకి కేథరిన్ డ్రైపాకు స్వాగతం.. ఒకకొత్త సౌందర్యం, రహస్యంఅద్భుతమైన అధ్యాయం" అంటూ మేకర్స్ ఓ క్రేజీ పోస్టర్‌ను షేర్ చేసి సినిమాపై భారీ హైప్ క్రియేట్ చేశారు.

మణిరత్నం, విజయ్ సేతుపతి కాంబోలో మూవీ!

టాలెంటెడ్ డైరెక్టర్ మణిరత్నం, మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి కాంబినేషన్‌లో ఓ సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. నేచులర్ బ్యూటీ సాయి పల్లవి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీకి 'ఇంజి వెల్లం' అనే ఆసక్తిక టైటిల్‌ను ఫిక్స్ చేశారు మేకర్స్. ప్రజెంట్ షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ మూవీకి సంబంధించి తాజాగా ఓ క్రేజ్ న్యూస్ నెట్టింట చక్కర్లు కొడుతోంది. సాధారణంగా ఒక్కో సినిమాకు దాదాపు ?15 కోట్లు తీసుకుంటారని ప్రచారంలో ఉన్న మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి.. మణిరత్నం సినిమా కోసం కేవలం ?6 కోట్లకే నటిస్తున్నారంటూ కోలీవుడ్ వర్గాల నుంచి సమాచారం. 2018లో వచ్చిన 'చెక్క చివంత వానం', 'నవాబ్' తర్వాత మణిరత్నంతో విజయ్ సేతుపతికి ఇది మూడో సినిమా కావడంతో సినిమాపై భారీ హైప్ నెలకొంది. ఇక వీరిద్దరి మధ్య ఉన్న ఆ అనుబంధంతోనే సేతుపతి తన రెమ్యునరేషన్‌ను ఈ సినిమా కోసం ఏకంగా 60% తగ్గించుకున్నట్లు టాక్. దీంతో ప్రజెంట్ ఈ వార్త కోలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లో కూడా హాట్ టాపిక్‌గా వైరల్ అవుతున్నది. కాగా.. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న ఈ రొమాంటిక్ డ్రామా ఫస్ట్ లుక్‌లో వర్షంలో తడుస్తున్న జంటను చూసి అభిమానుల్లో ఇప్పటికే ఆసక్తి



పెరిగింది. కథ, పాత్రల వివరాలను మేకర్స్ ఇంకా వెల్లడించలేదు. 2027 జనవరిలో విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని అప్డేట్స్ త్వరలో రానున్నాయి.

Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com